RNI.No. APTEL/2014/57702
ESTD: 1999
www.voodayam.com
Postal Regd. No. GTR/117/2025-27




# వుదయం




గుంటూరు | 13-04-2026 సోమవారం | సంపుటి : 13 | సంచిక : 42 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal
Follow us on

# చర్చలపై అణుబాంబు

## అమెరికా, ఇరాన్ మధ్య కుదరని ఒప్పందం, పాక్ సంభాషణలకు తెర



హొర్ముజ్ జలసంధిపై నౌకా దిగ్భంధనానికి ట్రంప్ ఆదేశం

ఇందులో ఇతర దేశాలూ పాల్గొంటాయని ప్రకటన

అత్యున్నత ప్రతిపాదనను ఇరాన్ ముందుంచాం

ఫలితం లేక పోవడంతో వెనక్కు వెళుతున్నాం : అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్

చర్చల వైఫల్యానికి అమెరికా అసంబద్ధ డిమాండ్లే కారణ : ఇరాన్

అణు కార్యక్రమాన్ని ఇరాన్ వదిలి పెట్టుకునేలా చేయలేక పోయిన అమెరికా

21 గంటల పాటు నిరంతరాయంగా సాగి ఆగిపోయిన చర్చలు





**వుదయం డెస్క్, ఏప్రిల్ 12 :** శనివారంనాడు 21 గంటల సంప్రదింపుల అనంతరం యుఎస్–ఇరాన్ మధ్య శాంతి చర్చలు కుప్పకూలాయి. పాకిస్తాన్ మధ్యవర్తిత్వం వహించిన ఈ చర్చలు అసంపూర్ణంగా ఆగిపోయాయి. అంతిమ, అత్యుత్తమ ఆఫర్‌ను వారి ముందు ఉంచిన తర్వాత తన బృందం వెను దిరుగుతోందని, ఇది ఇరాన్‌కు మంచి వార్త కాదని వాషింగ్టన్ ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించిన యుఎస్ ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ పేర్కొన్నారు.

అణు వివాదాన్ని పరిష్కరించేం దుకు చర్చలు విఫలమైన నేపథ్యంలో, ఇరాన్‌తో ఉద్రిక్తతలను పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హోర్ముజ్ జలసంధిపై పూర్తి స్థాయి నావికా దిగ్బంధనాన్ని ప్రకటించారు. చాలా సమస్యలపై ఏకాభిప్రాయం కుదిరినప్పటికీ, అత్యంత ముఖ్య మైన అంశం అయిన అణు ఆశయాల విషయంలో మాత్రం ఏకాభిప్రాయం కుదరలేదని పేర్కొంటూ, నౌకా రవాణాకు ఎదురయ్యే ఎలాంటి ముప్పుపైనైనా బల ప్రయోగం చేస్తా మని ట్రంప్ హెచ్చరించారు.

మిగతా 2లో

# బాలికలే ఏలికలు

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పై చెయ్యి ● ఫస్టియర్ లో 66.2, సెకండియర్ లో 70.58 శాతం ఉత్తీర్ణత

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పెరిగిన ఉత్తీర్ణత ● మే 13 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఫలితాలు విడుదల చేసిన ప్రభుత్వ సలహాదారు కేకే, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా



**హైదరాబాద్, ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఆదివారం ఉదయం 11 గంటలకు నాంపల్లి లోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో ఈ ఫలితాలు విడుదల చేశారు. ప్రథమ ఇంటర్‌లో 66.2 శాతం, ద్వితీయ ఇంటర్‌లో 70.58 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వెల్లడించారు. కాగా ఈ ఫలితాల్లో ఈసారి కూడా బాలికలే పైచేయి సాధించారు. ఫస్టియర్ పరీక్షలకు 4,89,123 మంది విద్యార్థులు హాజరు కాగా.. 3,23,807 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల్లో ఉత్తీర్ణత శాతం 74.4 కాగా.. బాలురు ఉత్తీర్ణత శాతం 57.69గా ఉంది. ద్వితీయ ఇంటర్ పరీక్షలకు మొత్తంగా 5,07,948 మంది విద్యార్థులు హాజరు కాగా.. 3,58,490 మంది (70.34శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికల ఉత్తీర్ణత శాతం 78.65గా ఉండగా.. బాలుర ఉత్తీర్ణత 62.50 శాతంగా నమోదైంది.




ఇంటర్ ఫలితాలు విడుదల చేస్తున్న కె కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా తదితర అధికారులు

ప్రథమ ఇంటర్‌లో 66.20 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. జనరల్‌లో 66.94 శాతం మంది, ఒకేషనల్‌లో 59.30 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ ఇంటర్‌లో 75.34శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. జనరల్‌లో 75.61శాతం ఒకేషనల్‌లో 72.71శాతంగా ఉంది.

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం బాగానే ఉంది. బీసీ వెల్ఫేర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 86శాతం (జనరల్) ఉత్తీర్ణత నమోదు కాగా.. ఒకేషనల్‌లో 96శాతంగా ఉంది. ద్వితీయ ఇంటర్‌లో (జనరల్) 90శాతం నమోదు కాగా.. ఒకేషనల్‌లో 98శాతంగా ఉంది.

కేజీబీవీల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 72శాతం, ఒకేషనల్‌లో 86శాతం ఉత్తీర్ణత కాగా.. సెకండ్ ఇయర్‌లో 82శాతం, ఒకేషనల్‌లో 94శాతంగా ఉంది. ప్రైవేటు అన్ ఎయిడెడ్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో (జనరల్) 77శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ఒకేషనల్‌లో 65శాతంగా ఉంది. ద్వితీయ ఇంటర్‌లో 71శాతం (రెగ్యులర్) ఉత్తీర్ణత నమోదు కాగా.. ఒకేషనల్‌లో 51శాతంగా ఉంది. సోషల్ వెల్ఫేర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్‌లో ఉత్తీర్ణత శాతం 77.66 కాగా.. ద్వితీయ ఇంటర్‌లో 86.79శాతంగా ఉంది. కాగా సప్లిమెంటరీ పరీక్షలను త్వరలోనే నిర్వహించనున్నట్లు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా వెల్లడించారు. ఉత్తీర్ణత కాని విద్యార్థులు రెగ్యులర్ విద్యార్థులతో కలిసి తదుపరి విద్యను కొనసాగించేందుకు వీలు గా నెలరోజుల్లోనే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

**ఇంటర్ పరీక్షల రీ కౌంటింగ్**, రీ వెరిఫికేషన్‌కు ఏప్రిల్ 13 నుంచి 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం ఫీజు చెల్లింపునకు ఏప్రిల్ 13 నుంచి 20 వరకు అవకాశం ఇచ్చారు. మే 13 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయన్న యోగితా రాణా. రెండు సెషన్లలో ఈ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అడ్వాన్స్‌డ్ ప్రాక్టికల్ పరీక్షలు మే 22న ప్రారంభమవుతాయనీ ఇవీ రెండు సెషన్లలో నిర్వహిస్తామన్నారు.

## స్వరోత్తుంగ తరంగం

# ఆశా అస్తమయం



**ముంబై, ఏప్రిల్ 12 (వుదయం):** మైమరపించే ఆ స్వరాన్ని ఇక వినలేం. ఎంతటి విషాదంలో ఉన్నా కూడా ఆమె పాట వినగానే తెలియని ఉత్తేజం వచ్చేంలా చేయగల గళం ఆమెది. అది కేబెరా పాట అయినా, రొమాంటిక్ సాంగ్ అయినా ఆ భావాలను తన స్వరంలోనే ఒలికించేస్తారు ఆమె. 14 భాషల్లో వేలాది పాటలతో భారత చిత్ర పరిశ్రమను ఆమె అలరించారు. క్వీన్ ఆఫ్ ఇండీ పాప్‌గా పేరు గాంచిన ఆశ, తెలుగులోనూ కొన్ని పాటలు పాడారు. వయసు పెరిగినా ఆమె స్వరం అలసిపోలేదు కానీ గుండె అలసిపోయి ఆగిపోయింది. ఏప్రిల్ 11న గుండెపోటుకు గురైన ఆ దిగ్గజ గాయనిని ముంబైలోని బ్రీచ్‌కాండీ ఆసుపత్రిలోని అత్యవసర విభాగానికి తరలించగా, అక్కడే ఆమె తుదిశ్వాస విడిచారు.

ఈ విషాద వార్తను మహారాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి ఆశిష్ షెలార్ ప్రకటించారు. ఆమె పార్థివ దేహాన్ని సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆమె నివాసంలో ఉంచుతారు. సాయంత్రం 4 గంటలకు శివాజీ పార్కులో అంత్యక్రియలు జరుగుతాయి. మహారాష్ట్ర లోని సాంగ్లీలో కళాకారుల కుటుంబంలో 1933 సెప్టెంబర్ 8న ఆశా జన్మించారు. ఆమె తండ్రి దీననాథ్ మంగేష్కర్ థియేటర్ ఆర్టిస్ట్. అక్క లతా మంగేష్కర్. ఉమా, మీనా అక్కాచెల్లెళ్లు, హృదయనాథ్ సోదరుడు. ఆశా 9 ఏళ్ల వయస్సులోనే తండ్రిని కోల్పోయింది. కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకొనేందుకు

మిగతా 2లో

# కాళేశ్వరం వేగవంతం

పనుల త్వరితానికి స్టీరింగ్ కమిటీ

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి) :** కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పరిధిలోని మెడిగడ్డ, అన్నారం,సుందిళ్ల పునరుద్ధరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పునరుద్ధరణ పనులు వేగవంతం చేసేందుకు నీటిపారుదల రంగ నిపుణులు కల్నల్ పరిక్షిత్ మెహ్రా కన్వీనర్ గా ఉన్నత స్థాయి స్టీరింగ్ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు.ఈ కమిటీ వారానికి రెండు సార్లు సమావేశమయి ఎప్పటికప్పుడు పనుల పురోగతిని సమీక్షలు నిర్వహిస్తుందన్నారు. అవసరమైతే స్వయంగా తాను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సమావేశాల్లో పాల్గొని పురోగతిని సమీక్షిస్తానని తెలిపారు. అలాగే ప్రతిరోజూ పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారి నియమించనున్నట్లు ఆదివారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, విజిలెన్స్ కమిషన్ వంటి చట్టబద్ధ సంస్థలు ఇప్పటికే మూడు బ్యారేజీల ఫౌండేషన్, డిజైన్, ప్రణాళిక, అమలు అంశాల్లో తీవ్రమైన లోపాలను గుర్తించినట్లు తెలిపారు. ఈ మూడు నిర్మాణాల్లో సమస్యలు ఒకే విధంగా ఉన్నాయన్నారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతుల పూర్తి ప్రక్రియలో 2027, 2028 సంవత్సరాలను కీలకంగా పరిగణించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. నిర్దేశిత గడువులోనే అన్నారం,

## కన్నవారిని ఏడిపిస్తున్న కవిత

● తల్లిదండ్రులను కన్నీళ్లు పెట్టించొద్దని కెటిఆర్ సూచన

● పార్టీ పేరు మార్చి నష్టపోయాం ● భవిష్యత్తులో టిఆర్ఎస్ పేరు పునరుద్ధరణ



**హైదరాబాద్, ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి) :** కవిత ప్రవర్తనతో కుటుంబ సభ్యులు తరచూ మనస్తాపానికి గురవుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.ఇది ఏమాత్రం సరైన పద్ధతి కాదని అభిప్రాయపడ్డారు. గత కొంతకాలంగా తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన కల్వకుంట్ల కవిత 'కొత్త పార్టీ' అంశంపై కేటీఆర్ తొలిసారిగా స్పందించారు. ఈ ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా కవితకు సూచనలు చేశారు. తల్లిదండ్రులకు మనం మేలు చేయకపోయినా పర్వాలేదు కానీ, వారు బాధపడే పనులు మాత్రం చేయకూడదన్నారు.

మిగతా 2లో

## జాతీయస్థాయిలో సమగ్ర కుల గణన జరగాలి : భట్టి

**హైదరాబాద్, ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి) :** జాతీయస్థాయిలో సమగ్ర కుల జన గణన జరిగితేనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఉదయం హైదరాబాదులోని ప్రజా భవన్ లో డిప్యూటీ సీఎం చేతుల మీదుగా "క్యాస్ట్ సెన్సెస్ డీపెనింగ్ ఆఫ్ సోషల్ జస్టిస్ " అనే పుస్తకావిష్కరణ అనంతరం ఆయన మాట్లాడారు. జాతీయస్థాయిలో నిర్వహించే జన గణనలో అన్ని కులాల సామాజిక, విద్య,ఆర్థిక స్థాయిలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వే దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్న భట్టి.., దేశవ్యాప్తంగా సమగ్ర కుల జన గణన చేపట్టడానికి అది మార్గదర్శకంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య పరిపాలనను బలోపేతం చేయడంలో,

మిగతా 2లో




# విద్యుత్ సిబ్బంది సమస్యలపై కమిటీ

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నేతలతో భేటి



**హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఎఎంఎస్) :** విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీనియర్ అధికారులతో కమిటీ వేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఆదివారం హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు డిప్యూటీ సీఎంతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు విద్యుత్ డిస్కములను ప్రైవేటు పరం చేస్తారన్న ప్రచారం జరుగుతుందని డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువచ్చారు, ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్యుత్ డిస్కములను ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరించమని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని నాయకులు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు అసత్య ప్రచారాలను ఖండించాలన్నారు. ఇంధన శాఖ దీర్ఘకాలం కొనసాగాలని అందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రజా ప్రభుత్వం చేపడుతుందని భట్టి తెలిపారు. విద్యుత్ సంస్థలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉద్యోగుల జేఏసీ, అధికారులపై ఉందని తెలిపారు. 1912 కు వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కారం చేసి మెరుగైన సేవలకు విద్యుత్ సంస్థలు చిరునామాగా నిలవాలని డిప్యూటీ సీఎం అన్నారు. ఉద్యోగుల సమస్యలు ఇతర అంశాలు విని పరిష్కరించేందుకు ఉద్యోగ సంఘాలకు ప్రతినెల ఒక గంట పాటు సమయం ఇచ్చేలా విద్యుత్ సంస్థల ఉన్నత అధికారులను ఆదేశిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. మూడవ డిస్కం ఏర్పాటు ఉద్యోగుల సర్దుబాటు, 2026 prc, 2004 వరకు నియామకమైన వారికి పాత పెన్షన్ స్కీమ్ అమలు, రెగ్యులర్ ప్రమోషన్స్, రిక్రూట్మెంట్స్, ఆర్టిజన్ సమస్యలపై విద్యుత్ ఉద్యోగుల జేఏసీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కు విజ్ఞాపన పత్రాన్ని సమర్పించింది. కార్య క్రమంలో జేఏసీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్ రావు, కో కన్వీనర్ బీసీ రెడ్డి, నాయకులు భూపాల్ రెడ్డి, సదానందం, స్వామి, రమేష్, అశోక్, సుధాకర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, నాగరాజు, సత్యనారాయణ, దయానంద్, మల్లయ్య, ప్రమోద్ పాల్గొన్నారు.

## పంట మార్పిడి చేస్తే కొనేవారుండరు

కాంగ్రెస్ పాలనలో రైతులు ఇబ్బందిపడుతున్నారు

మాజీ మంత్రి హరీశ్ రావు

**సిద్దిపేట, ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి) :** పంట మార్పిడి చేయమని చెబుతున్న కాంగ్రెస్ సర్కార్.. రైతులు పంట మార్పిడి చేస్తే వాటిని కొనే దిక్కు లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ది రైతులను ఇబ్బంది పెట్టే ప్రభుత్వం అని అన్నారు. వడగళ్ల వర్షాల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు సమయానికి రైతు బంధు ఇవ్వాలన్నారు.ఆదివారం సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను హరీశ్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు.

మిగతా 2లో

# జాతీయస్థాయిలో సమగ్ర కుల గణన జరగాలి : భట్టి

మొదటి పేజీ తరువాయి

సామాజిక న్యాయాన్ని మరింత లోతుగా స్థాపించడంలో కుల లెక్కింపు ప్రాధాన్యతను ఈ గ్రంథం స్పష్టంగా ప్రతిపాదిస్తుందని రచయితలు వారి అభిప్రాయాన్ని తెలిపారు. పుస్తక ఆవిష్కరణ అనంతరం డిప్యూటీ సీఎం బీసీ ఉపాధ్యాయులు, ప్రొఫెషనల్స్, మేధావులు, విద్యార్థుల జాయింట్ యాక్షన్ కమిటీ, ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో క్యాస్ట్ సెన్సెస్ అండ్ డీపెనింగ్ ఆఫ్ సోషల్ జస్టిస్ పుస్తక రచయిత, ఆల్ ఇండియా ఓబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిసర్చ్ స్కాలర్ జి కిరణ్ కుమార్, డాక్టర్ వాహిని బిల్లు పాల్గొన్నారు. డి అశోక్, సురేందర్, గణేష్, శివ, అరవింద్, లక్కీ, ప్రవీణ్, మల్లేష్ పాల్గొన్నారు

# కన్నవారిని ఏడిపిస్తున్న కవిత

మొదటి పేజీ తరువాయి

ఇది ఏమాత్రం సరైన పద్ధతి కాదన్నారు. కవిత చాలా తెలివైన మహిళ, ఆమెకు రాజకీయాలపై మంచి అవగాహన ఉంది. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఆమె ఇలా ప్రవర్తించడం ఏమా త్రం కరెక్ట్ కాదు. ఇకనైనా తన వైఖరిని మార్చుకోవాలని కోరుకుంటున్నాను." అని ఆయన పేర్కొన్నారు.

మంచిర్యాల : టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చి తాము రాజకీయంగా చాలా నష్టపోయామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. ప్రజల్లో బలంగా నాటుకుపోయిన గులాబీ జెండా, టీఆర్ఎస్ పేరుకు ఉన్న సెంటిమెంట్ విడదీయలేనిదన్న ఆయన మళ్లీ పార్టీని టీఆర్ఎస్ గానే చూడాలని, పాత పేరుతోనే ముందుకు సాగాలని అనుకుంటున్నట్లు చెప్పారు. ఈ విషయం పై పార్టీ లో అంతర్గత చర్చలు జరుపుతున్నట్లు సంకేతాలిచ్చారు. ఆదివారం ఆదివారం మంచిర్యాల జిల్లాలో పర్యటించిన ఆయన, క్యాతనపల్లి నూతన మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, గత నిర్ణయాలపై ఆయన స్పందిం చారు. రానున్న రోజుల్లో ప్రజాక్షేత్రంలోనే ఉంటానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే ప్రజా సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపడతున్నట్లు చెప్పారు . ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీని మళ్లీ బలోపేతం చేయడమే తమ లక్ష్యం అన్నారు. స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# పంట మార్పిడి చేస్తే కొనేవారుండరు

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ధ్వజమెత్తారు. పంట కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. పంట కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. నారాయణఖేడ్, ఆదిలాబాద్, నిజామాబాద్ కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు సెంటర్లను ప్రారంభించలేదని.. వెంటనే కొనుగోలు సెంటర్లను ప్రారంభించి, మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్ లను అధికారులు సందర్శించాలని సూచించారు.చాలా చోట్ల కొనుగోలు సెంటర్లను ప్రారంభించకపోవడంతో రైతులు తక్కువ ధరకు పంటను అమ్ముకుని నష్టపోతున్నారని తెలిపారు.

# కాళేశ్వరం వేగవంతం

మొదటి పేజీ తరువాయి

సుందిళ్ల పనులు పూర్తవుతాయని, అదే సమయంలో మేడిగడ్డను కొంత భాగన్నీ పూర్తి చేయగలమనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికే డిజైన్ కన్సల్టెంట్‌గా ఏఎఫ్ ఆర్ వై ఇండియాను ఎంపిక చేసిందన్న మంత్రి.. ఐఐటీ ముంబైతో సంయుక్తంగా పని చేయాలని నిర్ణయించిందన్నారు. డిజైన్ బృందం రాత్రింబగళ్లు పనిచేసి వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.డిజైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, డిజైన్ సిద్ధమైన వెంటనే సెంట్రల్ వాటర్ కమిషన్ (సొడబ్ల్యూసీ)కిఆమోదం కోసం పంపాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. సెక్రటరీ పరిక్షిత్ మెహ్రాతో నిరంతరం సంప్రదింపులో ఉండాలన్న ఆయన ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కన్సల్టెంట్లకు సూచించారు.డిజైన్ ప్రక్రియకు సంబంధించిన భూభౌతిక, భూసాంకేతిక, మట్టి, హైడ్రాలిక్ మోడలింగ్ వంటి అన్ని అధ్యయనాలు సమగ్రంగా నిర్వహించబడతాయని మంత్రి తెలిపారు. అవసరమైన అన్ని పరీక్షలు, డేటా అత్యవసర ప్రాధాన్యంతో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

# బాబు డైరెక్షన్ లో రేవంత్ పాలన

**మాజీ మంత్రి జీవన్ రెడ్డి**

**చంద్రబాబు మెప్పు కోసం కాళేశ్వరం పై కుట్రలు**

**జగిత్యాల, ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్ర ప్రభుత్వం స్వతంత్రంగా కాకుండా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లో నడుస్తోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం చంద్రబాబు మెప్పు




పొందడం కోసమే రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే మేడిగడ్డ బ్యారేజీని ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు.ఆదివారం జగిత్యాలలో ఆయన మీడియాతో మాట్లాడారు.రేవంత్ రెడ్డి మేడిగడ్డ బ్యారేజీకి వెంటనే మరమ్మతులు చేపట్టకుండా రాష్ట్ర ప్రజలను వంచిస్తున్నారని విమర్శించారు. మేడిగడ్డ రిపేర్లు చేయకుండా కాలయాపన చేయడంతో రాష్ట్ర ప్రయోజనాలకు గండి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ నినో ప్రభావం పడి, రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడితే మేడిగడ్డ లేని లోటు ఏంటో ప్రజలకు అప్పుడు స్పష్టంగా అర్థమవుతుందని చెప్పారు. ఆ సమయంలో ప్రజలు పడే ఇబ్బందులను చూసి రేవంత్ రెడ్డిని తెలంగాణ సమాజం ఎప్పటికీ క్షమించదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేయడంతో భవిష్యత్తులో సాగునీరు, తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర రైతాంగాన్ని బలి చేయొద్దని రేవంత్ రెడ్డి ని కోరిన జీవన్ రెడ్డి... వెంటనే మేడిగడ్డ బ్యారేజీ పై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



# ఆశా అస్తమయం

మొదటి పేజీ తరువాయి

అక్క లతా మంగేష్కర్‌తో కలిసి పాటలు పాడింది. క్లాసికల్, గజల్స్, రొమాంటిక్ ఇలా అన్ని రకాల పాటలను అలవోకగా పాడగలగడం ఆమెకు దేవుడిచ్చిన వరం. దశాబ్దాల పాటు సాగిన తన కెరీర్‌లో, భారతీయ సంగీతానికి ఆమె చేసిన అపారమైన సేవకు గుర్తింపుగా, దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం, పద్మ విభూషణ్ వంటి అనేక పురస్కారాలను ఆమె అందుకున్నారు. గతేడాది సెప్టెంబర్ 8న 92వ ఏట అడుగుపెట్టిన ఆశా భోస్లే, ఈ సందర్భంగా ఒక మీడియా సంస్థతో మాట్లాడుతూ, "నాకు 92 ఏళ్లు. నా ఈ సుదీర్ఘ ప్రయాణంలో నాకు అండగా నిలిచిన నా శ్రేయోభిలాషులందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. మీ ప్రేమ లేకపోతే ఇంతకంటే గొప్పదాన్ని కాలేకపోయేదాన్ని" అని తన ఆత్మీయతను పంచుకున్నారు. "మీ చప్పట్లు విన్న ప్రతిసారీ, సంగీతం, కళలనే ఈ విశాల సముద్రంలో మరింత ముందుకు వెళ్లడానికి, కొత్త కొత్త మార్గాలను అన్వేషించడానికి అది నన్ను ప్రోత్సహిస్తుంది. నా బహిరంగ ప్రతిబింబానికి పూర్తి విరుద్ధంగా, నేను అంతగా వ్యక్తులతో కలవను. నా విజయాల గురించి మాట్లాడటానికి నేను సిగ్గుపడతాను, ఎందుకంటే ఇంత తక్కువ సమయంలో నేను నేర్చుకోవాల్సింది ఇంకా చాలా ఉంది, అంటూ ఆమె వినయంగా చెప్పుకున్నారు. ఆశా భోంస్లే హిట్‌ల జాబితాలో పియా తు అబ్ తో ఆజా, దమ్ మారో దమ్, చురా లియా హై తుమ్నే జో దిల్ కో, ఝుమ్కా గిరా రే, యే మేరా దిల్, దిల్ చీజ్ క్యా హై, ఓ మేరే సోనా రే, ఇన్ ఆంఖోన్ కీ మస్తీ హజార్ కే మస్తానే హజారో హై వంటి క్లాసిక్‌లు ఉన్నాయి. ఆశా భోంస్లే తన వ్యక్తిగత జీవితంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. 16 ఏళ్ల వయసులో, ఆమె తనకంటే 15 ఏళ్లు పెద్దవాడైన, తన సోదరికి కార్యదర్శిగా పనిచేస్తున్న గణపత్ రావ్ భోస్లేను వివాహం చేసుకున్నారు. కుటుంబ సభ్యుల ఇష్టానికి వ్యతిరేకంగా జరిగిన ఈ వివాహం సంతోషకరంగా లేక, కొద్దికాలమే నిలిచింది. ఈ సమయంలో ఆమె తన అత్తమామల నుండి వేధింపులను భరించారని చెబుతారు. ఆ తర్వాత జీవితంలో, ఆశా భోస్లే దిగ్గజ సంగీత స్వరకర్త రాహుల్ దేవ్ బర్మన్ (ఆర్.డి. బర్మన్)తో ప్రేమను, సృజనాత్మక సామరస్యాన్ని కనుగొని, చివరికి ఆయననే వివాహం చేసుకున్నారు. ఆసక్తికరంగా, ఆర్.డి. బర్మన్ ఆమె కంటే ఆరేళ్లు చిన్నవారు, పైగా ఇది ఆయనకు రెండవ వివాహం కూడా. వారిద్దరూ కలిసి భారతీయ సినీ సంగీతంలో అత్యంత విశిష్టమైన, చిరస్థాయిగా నిలిచిపోయే భాగస్వామ్యాలలో ఒకదాన్ని నెలకొల్పారు . ప్రేమ, సంగీతం చేతిలో చెయ్యి వేసుకుని నడిచిన బంధం అది.

# చర్చలపై అణుబాంబు



మొదటి పేజీ తరువాయి

ఇంధన మార్గాలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు చెలరేగిన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. సురక్షిత మార్గాన్ని కల్పిస్తామని, అంతర్జాతీయ జలాల్లో ఇరాన్ దోపిడీని నిరోధిస్తామని అమెరికా ప్రతిజ్ఞ చేసింది.

**చర్చలు ఎందుకు విఫలం అయ్యాయి?**

దాదాపు 21 గంటల ప్రైవేటు చర్చల తర్వాత వివరాలలోకి వెళ్లి, బహిరంగంగా సంప్రదింపులు జరపడానికి వాన్స్ నిరాకరించారు. కానీ, కీలక వివాదం అణ్వాయుధాలకు సంబంధించిందని ఆయన ప్రస్తావించారు.

వారు అణు ఆయుధాన్ని సమకూర్చుకోరని, అలాగే అణు ఆయుధాన్ని వేగంగా సాధించేందుకు వీలు కల్పించే సాధనాలను కూడా అన్వేషించరని తెలిపే ఒక స్పష్టమైన హామీని మనం చూడాల్సిన అవసరం ఉందన్నదే వాస్తవం, అని వాన్స్ పేర్కొన్నారు. ఇది అధ్యక్షుడు (డొనాల్డ్ ట్రంప్) గారి ప్రధాన లక్ష్యం అని, చర్చల ద్వారా తాము సాధించడానికి ప్రయత్నించింది కూడా సరిగ్గా దాన్నేనని ఆయన వివరించారు.

వారి అణు కార్యక్రమాలు ఏ స్థితిలో ఉన్నప్పటికీ, గతంలో వారి వద్ద ఉన్న యురేనియం శుద్ధి కేంద్రాలు, అన్నీ ధ్వంసమైపోయాయి, అని ట్రంప్ ఉపాధ్యక్షుడు తెలిపారు. దీర్ఘకాలంలో అణ్వాయుధాన్ని అభివృద్ధి చేయకూడదనే సంకల్పం ఇరానీయన్లకు ఉందా అని వాన్స్ ప్రశ్న వేస్తూ, లేదు అని సూటిగా సమాధానమిచ్చారు. స్పష్టంగా చెప్పాలంటే, ఇరానియన్లు అణ్వాయుధాన్ని అభివృద్ధి చేయకూడదనే సంకల్పంతో ఉంటారా అన్నదే ప్రశ్న. ఇప్పుడే కాదు, ఇప్పటి నుంచి రెండేళ్ల తర్వాత కాదు, దీర్ఘకాలంపాటు ఆ నిబద్ధతతో ఉండే ప్రాథమిక కట్టుబాటును చూస్తామా? అది ఇంకా మనం చూడలేదు, కానీ చూస్తామని ఆశిస్తున్నాను అని వాన్స్ అన్నారు. తాము అణుబాంబును తయారుచేయడానికి ప్రయత్నించడం లేదని ఇరాన్ నొక్కి చెబుతోంది. అయితే, ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధంలోనూ, గత సంవత్సరం అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు చేసిన దాడులలోనూ ఇరాన్‌లోని కీలక స్థావరాలపై బాంబు దాడులు చేశాయి. రోజంతా సాగిన చర్చలలో ఇరాన్ కు సంబంధించి ఫ్రీజ్ చేసిన ఆస్తులపై చర్చించారా అని ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, దానితో పాటుగా అనేక అంశాలను చర్చించినట్టు ఆయన చెప్పారు. కాకుంటే, మా షరతులకు ఇరానియన్లు అంగీకరించే పరిస్థితి రాలేదు అని ఆయన అన్నారు.ఇరాన్ వార్తా నెట్‌వర్క్ అయిన ప్రెస్ టివి నివేదిక ప్రకారం, హొర్ముజ్ జలసంధి సహా అనేక సమస్యలు వివాదాంశాలుగా ఉన్నాయి.

**చాలా సరళం, చాలా అనుకూలం**

యుఎస్ ప్రతినిధి బృందం అత్యంత సరళంగా, సానుకూలంగా ఉందని, ట్రంప్ కోరినట్టుగా ఒప్పందం కుదుర్చుకోవాలనే సద్భావనతో వారు వచ్చారని వాన్స్ అన్నారు. మేం ఆ పని చేశామని కూడా ఆయన అన్నారు.

**అమెరికా అసంబద్ధ డిమాండ్లను ఎండగట్టిన ఇరాన్**

మధ్య ప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించడమే లక్ష్యంగా జరిగిన ఇస్లామాబాద్‌లో చర్చలలో ప్రతిష్టంభనకు అమెరికా అసంబద్ధ డిమాండ్లే కారణమని ఇరాన్ ప్రభుత్వ బ్రాడకాస్టర్ ఐఆర్ఐబి ఆదివారం పేర్కొంది.

ఇరాన్ ప్రజల జాతీయ ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఇరాన్ ప్రతినిధి బృందం 21 గంటల పాటు నిరంతరాయంగా, తీవ్రంగా చర్చలు జరిపిందని, ఇరాన్ ప్రతినిధి బృందం పలు చొరవలు తీసుకున్నప్పటికీ, అమెరికా పక్షపు అసమంజసమైన డిమాండ్లు చర్చల పురోగతిని అడ్డుకున్నాయని, దీంతో చర్చలు ముగిశాయి, అని ఐఆర్ఐబి టెలిగ్రామ్‌లో తెలిపింది.

**బ్యాకప్ ప్రణాళికపై ట్రంప్ ఏమన్నారు?**

ఇరాన్‌తో చర్చలు కుప్పకూలినా లేదా హొర్ముజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు టెహ్రాన్ తిరస్కరించినా మీ బ్యాకప్ ప్రణాళిక ఏమిటని యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను అడుగగా, ప్లాన్ బి ఏమీ లేదని అమెరికా అధ్యక్షుడు స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయ ప్రణాళిక అవసరమే లేదు. వారి సైన్యం ఓడిపోయింది. మేం అన్నింటినీ సమన్వయం చేశాం. వారి వద్ద క్షిపణులు చాలా తక్కువగా ఉన్నాయి. వారి తయారీ సామర్థ్యాలు కూడా చాలా పరిమితం. మేం వారిని చాలా తీవ్రంగా దెబ్బతీశాం. మా సైన్యం చేసిన పని అమోఘం, అని చర్చలకు ముందు, శుక్రవారం ఉదయం అమెరికా అధ్యక్షుడు విలేకరులతో అన్నారు.

**హొర్ముజ్ దిగ్బంధనానికి ఆదేశం**

ప్రపంచంలోని అత్యంత కీలకమైన చమురు రవాణా మార్గాలలో ఒకటైన హొర్ముజ్ జలసంధిలోకి ప్రవేశించడానికి లేదా దాని నుండి బయటకు వెళ్లడానికి ప్రయత్నిస్తున్న నౌకలను అమెరికా నౌకాదళం తక్షణమే అడ్డుకోవడం ప్రారంభిస్తుందని ట్రంప్ అన్నారు.

సముద్రంలో మైన్లు ఉండవచ్చని సూచిస్తూ ఇరాన్ అనిశ్చితిని సృష్టిస్తోందంటూ, దీనిని ఆయన ప్రపంచ దోపిడీ అని అభివర్ణించారు. ఇరాన్‌కు సుంకాలు చెల్లిస్తున్నాయని అనుమానిస్తున్న నౌకలను కూడా అమెరికా అడ్డుకోవడమే కాక ఆ జలమార్గంలోని మైన్లను తొలగించడం ప్రారంభిస్తుంది. తీవ్ర ప్రతీకారం ఉంటుందని హెచ్చరిస్తూ, అమెరికా బలగాలపై గానీ, వాణిజ్య నౌకలపై గానీ ఎలాంటి దాడి జరిగినా దానిని అఖండ బలంతో ఎదుర్కొంటామని, ఈ దిగ్బంధన ప్రయత్నంలో పలు దేశాలు చేరతాయని ట్రంప్ అన్నారు.

**అణు సమస్యపై చర్చలు విఫలం**

దాదాపు 20 గంటల పాటు చర్చలు జరిపినప్పటికీ, అణు సమస్యపై ఇరాన్ అధికారులతో జరిపిన చర్చలు పురోగతిని సాధించడంలో విఫలమయ్యాయని ట్రంప్ అన్నారు. ఇతర రంగాలలో ఒప్పందం కుదిరినప్పటికీ, తన అణు ఆశయాలను వదులుకోవడానికి ఇరాన్ నిరాకరించడం అన్ని విజయాలను కప్పివేసిందని ఆయన నొక్కి చెప్పారు. ఇరాన్ ఎన్నటికీ అణ్వాయుధాలు సమకూర్చుకోకూడదనే తన చిరకాల వైఖరిని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఈ విషయంలో దాని నాయకత్వం దృఢంగా ఉందని వర్ణించారు. టెహ్రాన్‌ను అణ్వాయుధ సామర్థ్యాన్ని కలిగి ఉండనివ్వడం కంటే, నిరంతర సైనిక ఒత్తిడి కొనసాగించడమే మేలని ఆయన అన్నారు.

**పాకిస్తాన్ పాత్రకు ప్రాధాన్యత**

ఇస్లామాబాద్‌లో జరిగిన చర్చలను ప్రస్తావిస్తూ, అసిమ్ మునీర్, షెహబాజ్ షరీఫ్‌ల పాత్రను ట్రంప్ ప్రశంసించారు. భారతదేశం ప్రమేయం ఉన్న ఒక పెద్ద సంఘర్షణను నివారించిన ఘనతను వారు తనకు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు, అయితే ఆయన దీనిపై మరింత వివరించలేదు. జలసంధిని త్వరితగతిన తిరిగి తెరవాలని అమెరికా అధ్యక్షుడు ఇరాన్‌ను కోరారు, అంతరాయం కొనసాగితే దాని ప్రపంచ ప్రతిష్టకు శాశ్వత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

# రాష్ట్రాభివృద్ధిలో భేషజాలు ఉండవు

**పార్టీలతీతంగా ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి : మంత్రి శ్రీధర్ బాబు**

**సిద్దిపేట, వుదయం :** రాష్ట్రాభివృద్ధి.. పార్టీలతీతంగా ప్రజా సంక్షేమం విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి బేషజాలు లేవని రాష్ట్ర ఐటీపరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా నర్మెట్ట గ్రామంలో రూ. 210 కోట్లతో నిర్మించనున్న జూనో జ్యూ ల్ బయో ఫ్యూయల్ ఫ్యాక్టరీ మొదటి దశ నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. అన్ని ప్రాంతాలు వర్గాలు బాగుపడాలన్నదే ప్రజా ప్రభుత్వం లక్ష్యం అన్నారు. అందుకే గత ప్రభుత్వంలో చేపట్టిన మంచి పనులను కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేశారు. పరిశ్రమ ఏర్పాటు కోసం ఆన్లైన్లో రెండు నెలల క్రితం దరఖాస్తు చేసిందే తరువాయి పారదర్శకంగా అనుమతులు ఇచ్చి పరిశ్రమ ప్రారంభించుకున్నట్లు చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుకు రాజకీయాలకతీతంగా అందరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వపరంగా సహకారం అందిస్తామని మంత్రి తెలిపారు.

**రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరు సహకరించాలి : మాజీ మంత్రి హరీష్ రావు**

పరిశ్రమల ఏర్పాటుకు రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో సిద్దిపేట ప్రాంతంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ, కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ప్రారంభం అయ్యాయని స్పష్టం చేశారు. సాగునీరు రావడంతో జిల్లాలో 80 వేల ఎకరాల్లో వారి సాగవుతుందని అన్నారు. రైతులకు వరి ధాన్యం తో పాటుగా, వరి వ్యర్థ ప్రార్థన నుండి అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు. అమెరికా ఇరాన్ యుద్ధం నేపథ్యంలో కొరత నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో బయో గ్యాస్ ప్లాంట్ ఇలాంటి పరిశ్రమల ఏర్పాటు దేశానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

**తెలంగాణ వారికి ఆంధ్రాలో సహకరించాలి : వీహెచ్**

తెలంగాణ వారికి ఆంధ్రప్రదేశ్ లో అవకాశాలు ఇవ్వాలని మాజీ రాజ్యసభ సభ్యుడు వి హనుమంతరావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణ ఆంధ్ర ప్రజలు అన్నదమ్ముల విడిపోయినట్టు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాంతంలో ఆంధ్ర ప్రాంత పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపించడం శుభ పరిణామం అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ వారు ఎవరైనా పరిశ్రమ స్థాపనకు ముందుకు వస్తే సహకరించాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ని కోరారు. తెలుగు వారందరూ ఒకటిగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ భువనేశ్వర్ కలిత, పర్యావరణ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఎన్. కె. ప్రేమచంద్రన్, మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు, జూనో జ్యూ ల్ బయో ఫ్యూయల్ ఫ్యాక్టరీ సీఈవో నాగ శరత్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కు లీడర్, క్యాడర్ లేదు

**ఆ పార్టీ తో ఎన్నటికీ పొత్తు ఉండదు**

**బీఆర్ఎస్ కు కరప్షన్, అహంకారం, డ్రగ్స్ మరకలు**

**కేటీఆర్, రేవంత్ రెడ్డి బీజేపీ ని దెబ్బతీసే కుట్ర**

**నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్**



**నిజామాబాద్, ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి) :** లీడర్, క్యాడర్ లేని బీఆర్ఎస్ పార్టీతో బీజేపీ ఎప్పటికీ పొత్తు పెట్టుకోబోదని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పష్టం చేశారు. కరప్షన్, అహంకారం, డ్రగ్స్ పార్టీతో మాకేంటి పొత్తు అని దుయ్యబట్టారు. ఆదివారం నిజామాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్, రేవంత్ రెడ్డిఇద్దరూ ఒక్కటేనని చెప్పారు. బీజేపీని దెబ్బతీసేందుకు ఈ ఇద్దరు కలిసి డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ కు పదేళ్లు సీఎంగా అవకాశం ఇస్తే సెక్రటేరియట్ కు రాలేదని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడిగా అవకాశం ఇస్తే ఇప్పటి వరకు అసెంబ్లీలో అడుగుపెట్టలేదన్నారు. అలాంటప్పుడు ఆయన రాజకీయాల్లో ఎందుకని నిలదీశారు.అలాంటి కేసీఆర్ తో మాకు పొత్తు ఏంటన్నారు. కేసీఆర్ తన పదేళ్ల పాలనలో ఏం చేశారో ఆయన కూతురు కవితనే చెబుతున్నారు కదా అని ప్రశ్నించారు. ఇటు కవిత పార్టీకి సీఎం రేవంత్ రెడ్డి ఫండింగ్ ఇస్తున్నారని అర్వింద్ ఆరోపించారు. కులాల వారీగా హిందువులను విడదీసేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నం చేయిస్తున్నారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దొంగ పొత్తులతో బీజేపీని దెబ్బ తీయడానికి ప్రణాళికలు చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు కేటీఆర్ ను రేవంత్ రెడ్డి ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. త్వరలో బీఆర్ఎస్ నుంచి బీజేపీకి భారీగా వలసలు ఉండబోతున్నాయని జోస్యం చెప్పారు. ఎవరిని పార్టీలోకి తీసుకోవాలి ఎవరిని తీసుకోవద్దనే విషయంలో బీజేపీ పెద్దలు నిర్ణయం తీసుకుంటారన్నారు.

**బీజేపీలో గ్రూప్‌లు లేవు:**

తెలంగాణ బీజేపీలో గ్రూప్ రాజకీయాలపై అర్వింద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో ఎలాంటి గ్రూప్ లు లేవని స్పష్టం చేశారు చిన్న చిన్న సమస్యలు అన్ని పార్టీల్లోనూ ఉంటాయన్నారు. రాకేశ్ రెడ్డితో నాకెలాంటి విభేదాలు లేవని చెప్పారు. బీజేపీలో లేఖల అంశంపై స్పందిస్తూ.. తాను ఎలాంటి చిట్ చాట్ చేయనని చెప్పారు. తాను పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేయనన్నారు. అధిష్టానానికి ఎవరూ లేఖలు రాయలేదన్న ఆయన.. ఫిర్యాదు చేయలేదని స్పష్టం చేశారు. 2029లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాబోతోందన్నారు. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ లో చేరే విషయంలో తొందరపడ్డారని అభిప్రాయపడ్డారు.

# మహిళా బిల్లుకు మద్దతిచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

**కేంద్రమంత్రి బండి సంజయ్**

**బిల్లును వ్యతిరేకిస్తే మహిళలే బుద్ధి చెబుతారు**

**కరీంనగర్, ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి) :** మహిళా సాధికారత గురించి మాట్లాడే పార్టీలన్నీ పార్లమెంట్‌లో బిల్లుకు మద్దతు ఇచ్చి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ బిల్లును వ్యతిరేకించే పార్టీలకు మహిళలే బుద్ధి చెబుతారని



వ్యాఖ్యానించారు. ఆదివారం కరీంనగర్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళలకు చట్టసభలో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలనేది దశాబ్దాల నాటి కల అని గుర్తుచేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. రాజకీయాలకు అతీతంగా ఈ బిల్లుకు మద్దతు తెలపాలని కోరారు. మహిళల ఆశలు, ఆకాంక్షలకు మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రతీక అని చెప్పారు. పార్లమెంట్‌లో మహిళా ప్రాతినిధ్యం పెరగాల్సిందే అని అన్నారు. డీలిమిటేషన్‌తో పార్లమెంట్‌లో స్థానాలు పెరుగుతాయన్న ఆయన ఈ బిల్లుతో తెలంగాణలోనూ 60 మంది మహిళలు అసెంబ్లీలో అడుగుపెట్టే అవకాశం ఉంటుందని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లుకు మద్దతు కోరుతూ అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లేఖ రాశారని చెప్పారు. వ్యక్తులు, పార్టీలకు అతీతంగా చట్టాన్ని నిజమైన స్ఫూర్తితో అమలు చేసేందుకు సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలను మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌తో నిర్వహిద్దామని అన్నారు.

# ఘనంగా దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

**సదాశివపేట, ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి) :** సదాశివపేట పట్టణంలోని సంగమేశ్వర ఆలయంలో దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దత్తాత్రేయ స్వామి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే గారిని సన్మానించి ఆశీర్వదించారు.ఈ మహోత్సవంలో స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో సేవలు సమర్పించారు



# ఐఐటీ హైదరాబాద్‌కు డా. సతీష్ రెడ్డి నియామకం

**సంగారెడ్డి, వుదయం జిల్లా ప్రతినిధి :** భారతీయ సాంకేతిక సంస్థ ఐఐటీ హైదరాబాద్ , డీఆర్డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ . జి . సతీష్ రెడ్డి ను గౌరవ సలహాదారు (ఆర్డీ)గా నియమించింది. ఈ నిర్ణయం ద్వారా మిషన్ ఆధారిత పరిశోధనకు మరింత బలం చేకూర్చడంతో పాటు, పరిశ్రమలతో అనుసంధానం పెంచడం మరియు ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్‌ను వేగవంతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.రక్షణ, ఏరోస్పేస్, డీప్-టెక్ రంగాల్లో ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడంలో డా. సతీష్ రెడ్డి కీలక పాత్ర పోషించనున్నారు. ఆయన వ్యూహాత్మక మార్గదర్శకత్వం ద్వారా పరిశోధన ఫలితాలు ప్రాయోగిక రంగాలకు చేరేలా చేయడంపై దృష్టి సారించనున్నారు.దేశ సాంకేతిక స్వావలంబన సాధనలో ఈ నియామకం



ముఖ్య మైలురాయిగా నిలుస్తుందని ఐఐటీ హైదరాబాద్ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

# ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి

## మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి



**రామచంద్రాపురం, ఏప్రిల్ 12(వుదయం) :** పటాన్‌చెరు నియోజకవర్గం భారతి నగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీలో గల సొసైటీ కమ్యూనిటీ హాల్ (5 సిరీస్)లో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరం ప్రజల నుండి మంచి స్పందన పొందింది. ఈ శిబిరానికి మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిటిజన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో, మ్యాక్ సొసైటీ కమిటీ సహకారంతో ఈ ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ శిబిరంలో రక్తపోటు, ర్యాండమ్ బ్లడ్ షుగర్ పరీక్షలు, 2డి ఎకో, మామోగ్రామ్, కంటి మరియు దంత పరీక్షలతో పాటు వైద్యుల సంప్రదింపులు అందించబడినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే కార్డియాలజీ మరియు గైనెక్ ఆంకాలజీ విభాగాల్లో ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉంచారు. కాలనీకి చెందిన పెద్ద సంఖ్యలో నివాసులు హాజరై ఈ సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా భెల్ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉదయ్ కుమార్ హాజరై శిబిరాన్ని అభినందించారు. కార్యక్రమంలో మ్యాక్ సొసైటీ కాలనీ అధ్యక్షుడు సలీమ్, జనరల్ సెక్రటరీ నందగోపాల్, డైరెక్టర్లు సుబ్రహ్మణ్యం, దుర్గారెడ్డి, నివాసులు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో వాసవి ఒకేషనల్ ప్రభంజనం

**ఐపీఈ 2026 ఫలితాల్లో వాసవి ఒకేషనల్ కళాశాల సత్తా / మొదటి, రెండో సంవత్సరాల్లో అత్యధిక మార్కులు**



**శంకర్‌పల్లి, ఏప్రిల్ 12 (వుదయం) :** ఆదివారం విడుదలైన ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాల్లో శంకర్‌పల్లి వాసవి ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ఘన విజయాన్ని నమోదు చేసింది. ఐపీఈ-2026 ఫలితాల్లో కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి సంస్థకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ప్రియాంక రెడ్డి, ప్రిన్సిపాల్ రాంచందర్ మాట్లాడుతూ విద్యార్థుల అంకిత భావం, అధ్యాపకుల కృషి, యాజమాన్యం అందించిన మెరుగైన విద్యా వసతులే ఈ ఫలితాలకు ప్రధాన కారణమని తెలిపారు. శంకర్‌పల్లి ప్రాంతంలో ఒకేషనల్ విద్యకు వాసవి కళాశాల నిలువెత్తు నిదర్శనంగా నిలిచిందని వారు పేర్కొన్నారు.

మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంఎల్‌టి విభాగంలో 500 మార్కులకు గాను సనాబేగం 489, ఎండి. ముస్కాన్ 487, ఎం. స్ఫూర్తి 482, సమీనా బేగం 476 మార్కులు సాధించి కళాశాల గౌరవాన్ని పెంచారు. విద్యార్థుల ఈ విజయం పట్ల కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రోత్సహించింది. విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతర శ్రమ, క్రమశిక్షణ అవసరమని ప్రిన్సిపాల్ రాంచందర్ సూచించారు.

ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 1000 మార్కులకు గాను ఏ. పూజ 969 (ఎంఎల్‌టి), సిహెచ్ హర్షిత 968 (సిఎస్), రంజాన్ బి 957 (ఎంఎల్‌టి), వి. జయంతి 941 (ఎంఎల్‌టి) మార్కులు సాధించి కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందిస్తూ, వారికి తగిన మార్గనిర్దేశం అందించిన అధ్యాపక బృందాన్ని ప్రత్యేకంగా ప్రశంసించింది. రాబోయే రోజుల్లో కూడా వాసవి ఒకేషనల్ కళాశాల ఇలాంటి ఫలితాలతో శంకర్‌పల్లి ప్రాంతంలో ముందంజలో నిలవాలని యాజమాన్యం ఆకాంక్షించింది.

# ఉచిత మెడికల్ క్యాంపు విజయవంతం చేయాలి

## మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్



**షాద్ నగర్, ఏప్రిల్ 12 (వుదయం):** నేడు ఉదయం 10 గంటలకు 24 వ వార్డులోని పతంజలి యోగ సెంటర్ లో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మెడికల్ క్యాంపు నిర్వహింపబడనున్నదని మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ తెలియజేశారు. ఈ అవకాశాన్ని 23, 24,25 వ వార్డు ప్రజలందరూ వినియోగించుకుని మెడికల్ క్యాంపుకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలతో పాటు మందులు కూడా పంపిణీ చేస్తారు.. కావున వార్డు ప్రజలందరూ కార్యక్రమానికి విచ్చేసి అవసరమైన పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు సూచనలతో తమ తమ ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని కోరారు.

# మన రక్తదానం మరొకరికి ప్రాణధానం

## ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్




**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి ) :** జీహెచ్ఎంసీ కొంపల్లి సర్కిల్ పరిధి అపర్ణ గ్రీన్ ఎస్కేప్స్ వద్ద కొంపల్లి ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దాదాపు 150 మంది డాక్టర్లు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ మన రక్తదానం మరొకరికి ప్రాణదానమని అన్నారు. ఈ రక్తదాన శిబిరం ద్వారా సేకరించిన రక్తం రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల బ్లడ్ బ్యాంకులకు సరఫరా చేయడం, రక్తం కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఐఎంఏ ట్రెజరర్ డాక్టర్ దయాళ్ సింగ్, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ పి. శరత్ చంద్రరావు, సెక్రటరీ పివిఎస్సి హరి కిరణ్, ట్రెజరర్ డాక్టర్ జి. హరి కిరణ్, డాక్టర్ నవీన్ రెడ్డి, డాక్టర్ భాస్కర్ రెడ్డి, డాక్టర్ సురేష్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సిగాచి ప్రమాద అధికారులపై చర్యలు తీసుకోవాలి



**శంకర్ పల్లి ఏప్రిల్ 12 (వుదయం) :** సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్ యాజమాన్యం మరియు సంబంధిత అధికారుల ఘోర నిర్లక్ష్యం వల్ల అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ తీవ్రంగా ఆరోపించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన పటాన్చెరు పట్టణంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిని కలిసి, 2018 నుండి 2024 వరకు జరిగిన తనిఖీ నివేదికల ఆధారంగా సమగ్ర వివరాలతో కూడిన ఫిర్యాదును సమర్పించారు. ఈ సందర్భంగా మెట్టు శ్రీధర్ మాట్లాడుతూ, సిగాచి ఇండస్ట్రీస్ గత ఏడేళ్లుగా ఫ్యాక్టరీ చట్టాలను నిర్లక్ష్యంగా ఉల్లంఘిస్తూ వస్తోందని పలు ఆధారాలతో వివరించారు. ముఖ్యంగా 20-18-19లో అనుమతించిన 100 మంది కార్మికుల పరిమితిని మించి నియామకాలు జరిపినట్లు, 2022లో 818 హెచ్ పీ లైసెన్స్ పరిమితి ఉండగా 1777 హెచ్ పీ సామర్థ్యం గల యంత్రాలను అనుమతి లేకుండా ఏర్పాటు చేసి ప్రమాదాలకు కారణమయ్యారని వెల్లడించారు. కార్మికుల మరణాలకు బాధ్యులైన సిగాచి ఇండస్ట్రీస్ యాజమాన్యంతో పాటు విధి నిర్వహణలో విఫలమైన అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించాలని అమాయక కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలని మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు.

# గొల్లగూడెం మల్లన్న జాతరలో జగ్గారెడ్డి



**సంగారెడ్డి, ఏప్రిల్ 12 (వుదయం):** గొల్లగూడెం గ్రామంలో నిర్వహించిన మల్లన్న జాతర కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే టిజిఐఐసి చైర్మన్ నిర్మలమ్మ , మున్సిపల్ చైర్మన్ వనిత సంతోష్ , కౌన్సిలర్ శ్రీశైలం తదితరులు హాజరై జాతర ఉత్సవాల్లో పాల్గొన్నారు.


# స్టేట్ టాపర్స్‌లో చేవెళ్ళ మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థులు



**చేవెళ్ల ఏప్రిల్ 12 (వుదయం) :** ప్రభుత్వ చేవెళ్ళ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు.సీనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థిని శృతిలయ ఎంపీసీలో 994 మార్కులు, సీహెచ్ స్పందన బైపీసీలో 963 మార్కులు, వర్షిత సీఈసీలో 976 మార్కులు భార్గవి ఎంఈసీలో 978 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్లో షిరీన్ సుల్తానా ఎంపీసీలో 465, సంజన బైపీసీలో 435, హారిక సీఈసీలో 483 మార్కులతో టాపర్స్ గా నిలిచారాని ఇంచార్జ్ ప్రిన్సిపల్ వినోద్ కుమార్ తెలిపారు.ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# దోమల నుండి విముక్తి కల్పించండి

## సిపిఐ మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి):** సిఎంసీ పరిధిలోని నిజాంపేట్ సర్కిల్ పంచవటి అపార్ట్మెంట్స్ లో సిపిఐ ఆధ్వర్యంలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఇంటింటికి సిపిఐలో భాగంగా ప్రగతి నగర్ డివిజన్ పరిధిలోని పంచవటి అపార్ట్మెంట్స్లో స్థానిక ప్రజలను సమస్యల గురించి అడగగా అంబీర్ చెరువులో పెరుక పోయిన గుర్రపు దెక్క వలన దోమలు పెరిగి నివాస యోగ్యత లేని ప్రాంతంగా ప్రగతి నగర్ మారిందని దోమల వల్ల స్థానిక ప్రజలకు అనేక రకాల విషపు జ్వరాలు వస్తున్నాయని, అంబీర్ చెరువు అనుకొని ఉన్న లేక్ వ్యూ ,పంచవటి, ఎన్టీఆర్ నగర్ తదితర ప్రాంతాలలో దోమల బెండదా విపరీతంగా ఉందని వెంటనే దోమల సమస్యకు పరిష్కారం చేయాలనీ లేని పక్షంలో పెద్ద ఎత్తున స్థానిక ప్రజలను సమీకరించి నిజాంపేట్ సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహా న్యూస్ ఎడిటర్ కె.అజిత, పంచవటి అపార్ట్మెంట్స్ స్థానికులు సిపిఐ నాయకులు పొన్నకంటి దస్తగిరి, శివ రెడ్డి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలోనే పేదింటి కల నెరవేరింది



**చేవెళ్ల, ఏప్రిల్12 (వుదయం) :** మొయినాబాద్ మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ ఘనంగా ప్రారంభించారు .ఈ సందర్భంగా భీమ్ భరత్ మాట్లాడుతూ..."కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ పేదల పక్షాన నిలుస్తుంది.పేదల సంక్షేమమే మా లక్ష్యం" అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ, పేదల కలను నిజం చేస్తున్నారని కొనియాడారు.పేదల కోసం ఇల్లు కల్పించి వారి జీవితాల్లో వెలుగు నింపిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండల అధ్యక్షులు మానయ్య, చిలుకూరు రాజు, విఠల్ యాదవ్ కుమార్, మాజీ సర్పంచ్ అమరనాథ్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కావాలి రమేష్, 11వ వార్డ్ కౌన్సిలర్ శ్రీ మహేష్, పార్టీ అధ్యక్షులు రాజేష్, పిషార్ మ్యాన్ అధ్యక్షులు బిక్షపతి, మాజీ డిప్యూటీ ఉపసర్పంచ్ శ్రీశైలం, ఎంగని మల్లేష్, కనగండ్ల విజయ్ కుమార్, సుధాకర్, బత్తుల రజినీకాంత్, అస్లాం, మీనాజ్ కుమార్, కె. శ్రీనివాస్, కమిటీ అధ్యక్షులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# రాయికోడు జాతరలో వీరశైవ లింగాయత్ సమాజం భక్తి ప్రదర్శన



**రాయికోడు, ఏప్రిల్ 12 (వుదయం):** భద్రకాళి సమేత వీరభద్ర స్వామి రాయికోడు జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా వీరశైవ లింగాయత్ సమాజం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నరసింహులు, గౌరవ సలహాదారు మరెల్లి అడివప్ప ఆలయానికి విచ్చేసి, శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్వామివారి ఆశీస్సులు తీసుకుని, సమాజ అభ్యున్నతి మరియు ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. జాతరలో భాగంగా భక్తుల రద్దీ అధికంగా కనిపించగా, ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయి.

# మానవ సేవయే మాధవ సేవ

## సత్యసాయి సేవాసమితి చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్చెరు, ఏప్రిల్ 12 (వుదయం):** మానవసేవయే మాధవసేవ అని, వేసవికాలంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు శ్రీ భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పటాన్చెరు బస్టాండ్ లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రశంసించారు. ఆదివారం ఉదయం స్థానిక నాయకులతో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్య సాయి బాబా సేవా సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో పాటు భక్తి భావాన్ని పెంపొందించేలా కార్యక్రమాలు రూపొందించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

అనంతరం మార్కెట్ రోడ్డులో మురళి కిరాణా యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సైతం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రామిరెడ్డి, రాజు, రామ్మోహన్ మల్లేష్, అజ్మత్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE VIII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS :: AT HYDERABAD
O.S. No. 849 OF 2026

BETWEEN :
Smt. Syed Khairunnissa Begum & Others ...Plaintiffs
AND
The Tahsildar, Bahadurpura Mandal, Hyderabad District, at Bahadurpura, ...Defendants

To,
1. All Concerned
Please take notice that the above named Plainttifs filed the above O.S. No. 849 of 2026 to declare the plainttifs as legal heirs of late Syed Shah Yahya Alam Quadri who died on 08-10-1964 and the matter is posted to 27-04-2026 for appearance, as such if any person/s is/are having any objections, they may appear before this court on 27-04-2026 at 10-30 A.M. either in person or through an Advocate, duly instructed by you the concerned, if any failing which the matter will be decided on merits.
//BY ORDER OF THE COURT//
Sd/-
Dr. A. NARASIMHA RAO
LLM ., Ph D. in Law - Advocate,
Flat No 503, Sri Sai Residency, Behind Sri Sai Baba Temple
Kaman, Prashanhnagar Colony, Vanasthalipuram,
Hyderabad -070 Mob: 9848047426

# సంగారెడ్డి బైపాస్ రోడ్‌పై 5 జంక్షన్లు



**సంగారెడ్డి, ఏప్రిల్ 12 (వుదయం) :** సంగారెడ్డి పట్టణంలో బైపాస్ రోడ్ విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రూ. 13 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో భాగంగా మొత్తం ఐదు ప్రధాన జంక్షన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఐబి గెస్ట్ హౌస్ నుంచి బసవేశ్వర చౌక్ వరకు ఐదు చోట్ల జంక్షన్లు ఏర్పాటుకానున్నాయి. జంక్షన్ల పనులను పరిశీలించిన ఎమ్మెల్యే. ఐబి చౌరస్తా మరియు ఆర్డీవో క్యాంప్ ఆఫీస్ సర్కిల్ వద్ద ప్రత్యక్షంగా పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు. జంక్షన్లు కేవలం ట్రాఫిక్ సౌలభ్యం కోసం మాత్రమే కాకుండా, ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించేలా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. ప్రత్యేకంగా సుందరీకరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆధునిక డిజైన్లతో రూపకల్పన చేయాలని కన్సల్టెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా జంక్షన్‌ల నిర్మాణం చేపట్టాలని, పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని హెచ్ఎండిఏ అధికారులకు జగ్గారెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హాఫీజ్, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్, హెచ్ఎండిఏ ఇంజనీర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**చేవెళ్ల ఏప్రిల్ 12 (వుదయం) :** అనారోగ్యంతో మరణించిన దండు పెంటయ్య కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి ప్రముఖులు పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రా రెడ్డి దండు సత్యనారాయణను కలిసి కుటుంబానికి ధైర్యం చెప్పారు. అలాగే మాజీ ఎంపీపీ మాల్గారి విజయభాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు నత్తి కృష్ణ రెడ్డి, కనకమామిడి మల్లారెడ్డి, జుకన్నగారి జైపాల్ రెడ్డి, కృష్ణ మంగలి రాజు, ఒగ్గు టీంకు,సీనియర్ రిపోర్టర్ వార్త వెంకటేష్, సభ్యులు తదితరులు హాజరై మృతుడి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారు పెంటయ్య కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# మేడ్చల్ గడ్డపై నూతన రాజకీయ శకం ప్రారంభం వైపు

**చేవెళ్ల, ఏప్రిల్ 12 (వుదయం) :** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామానికి వేదిక సిద్ధమవుతోంది. తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించబోయే నూతన రాజకీయ పార్టీకి రాష్ట్ర వ్యాప్తంగా మద్దతు వెల్లువెత్తుతోంది.

**పోరు గర్జన బైక్ ర్యాలీ**

ఈ నేపథ్యంలో ఆదివారం కందుకూరు మండల కేంద్రంలో తెలంగాణ జాగృతి ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాయకంటి జగన్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో 'పోరు గర్జన' బైక్ ర్యాలీ నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలు, యువత ర్యాలీలో పాల్గొని సందడి చేశారు.

**ప్రముఖుల హాజరు**

ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అర్చన సేనాధిపతి, మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ ముస్తఫా, నాయకులు రామిడి వెంకట్ రెడ్డి, మంచిరెడ్డి విజయ్ కిరణ్ రెడ్డి, కె. శివశంకర్ తదితరులు హాజరై ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు.

**ప్రశ్నించు పోరాడు – పరిష్కరించు' నినాదంతో ముందుకు**

ఈ సందర్భంగా కప్పాటి పాండురంగా రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో కవిత పాత్ర చిరస్మరణీయమని, గత 20 ఏళ్లుగా తెలంగాణ జాగృతి ద్వారా సంస్కృతి, ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకువచ్చారని అన్నారు.ఇప్పుడు అన్ని వర్గాల సాధికారత కోసం కొత్త రాజకీయ పార్టీని స్థాపించేందుకు సిద్ధమయ్యారని తెలిపారు.

## 'పోరు గర్జన'తో ఉత్సాహం ఉరకలు



**పాలకులపై విమర్శలు**

'నీళ్లు-నిధులు-నియామకాలు' వంటి కీలక అంశాల్లో గత, ప్రస్తుత ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శిస్తూ, సామాజిక సమానత్వం కోసం కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమైందన్నారు.

**ఏప్రిల్ 25న ఆవిర్భావ సభ**

మేడ్చల్ (మునీరాబాద్)లో ఏప్రిల్ 25న జరగనున్న నూతన పార్టీ ఆవిర్భావ సభకు రంగారెడ్డి జిల్లా నుంచి భారీగా ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

**భారీ స్పందన**

ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని కవిత నాయకత్వానికి మద్దతు తెలుపుతూ నినాదాలు చేశారు.

IN THE COURT OF THE HON'BLE 1st JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: SECUNDERABAD
O.S. No. 243 OF 2025

BETWEEN :
Dr. Bathini Mary Kantha Aruna & Others ...Plaintiffs
AND
The Mandal Revenue Officer/ Tahsildar, Secunderabad Mandal & others ...Defendants

To,
1. All Concerned
The Plaintiffs herein filed the above suit in O.S. No. 243 of 2025 before the Hon'ble 1st Junior Civil Judge, Secunderabad against the Defendants praying to declare them as legal heirs of late Sri Late B.J.Fleming & Late Dr.Orpamma.
That the above Suit is posted on **30.04.2026** for appearance. Objections if any may be filed by **10.30 am on 30.04.2026.**

(BY ORDER OF THE HONOURABLE COURT)
Sd/-
M/s U. SUMAN, L. MAHESWARI, Advocates,
#501, Elite Enclave, Law College Road, Yellareddyguda, Hyderabad-73
Mob: 9848933642

ఉష
వుదయం సాహిత్యం

# ఆస్మాని-ఓ పరిమళభరిత అరుణజ్యోత్స్న


పుట్టించింది పెంచింది ఈ నేలే అయితే నేనెవరని ప్రశ్నిస్తే ఏం చెప్పాలి? అస్థిత్వం ఎవరికి వారు ప్రకటించుకొనేదా ఇంకెవరో ప్రకటిస్తే అంగీకరించేదా? స్వదేశంలో పరదేశీయులుగా ముద్రవేయబడుతున్న మైనారిటీల తరతరాల అస్థిత్వవేదనలోంచి పెల్లుబికిన ప్రశ్నలను సంధించాడు కవి పీర్ల మహమూద్. దేశంలో ద్వేషవాతావరణం ఒక వ్యూహం ప్రకారం పెట్రేగిపోతున్నది. సీత శీలపరీక్షలా ముస్లింలు తమ దేశభక్తిని నిరూపించుకోవాల్సిన అనివార్యతలోకి నెట్టబడి నిత్యం అవమానాల మధ్య, అనుమానాల మధ్య అస్థిత్వపోరాటం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అభద్రతాభావనలలోకి నెట్టివేయబడుతున్న సమస్త మైనారిటీల గొంతుకై మహమూద్ ధ్వనిస్తున్నాడు. మహమూద్ కవిత్వం సమకాలీన సమాజ ప్రకంపనల సమాహారం. అది పూల పరిమళంలా గుబాళిస్తూనే తుపాకి మొనలా గ్రుచ్చుకుంటుంది. మానవ సమూహాన్ని మహమూద్ ఎంతగా ప్రేమిస్తాడో దానవప్రవృత్తుల్ని అదే స్థాయిలో ద్వేషిస్తాడు. మహమూద్ కవిత్వం అచ్చం అతనిలానే నిరాడంబరంగా కనిపిస్తుంది. పెళపెళ పదార్భాటాలు ఏవీ లేకుండా మల్లెలు మాట్లాడినట్లు వుంటుంది. సూఫీతాత్విక ప్రభావం వల్లనేమో మహమూద్ వాక్యాన్ని అత్యంత సుకుమారంగా మలుస్తాడు. మొత్తం మానవసమాజం పట్ల బాధ్యత తీసుకొన్న నిబద్ధ వ్యక్తిత్వంతో మనకు తెలియని ప్రపంచాన్ని మన కళ్ళముందు దృశ్యమానం చేస్తాడు. రాయలసీమ రాటుదేలిక సినిమా పరివేషం వేసుకొని వేటకత్తులు తిప్పినట్లుగా వుండదు మహమూద్ కవిత్వం. ఇంకిపోయిన పెన్నానది ఇసుకకళ్ళల్లోకి తొంగిచూసినట్లు అనిపిస్తుంది. రతనాలు అమ్మిన రాయలసీమలో రాళ్ళ పంటలు తప్ప మోళ్ళు మోసులెత్తని వేదనాంతరంగంలా మహమూద్ కవిత్వం మనల్ని గుక్క తిప్పనీయదు 'ఆస్మాని" పేరిట వచ్చిన మహమూద్ కవితా సంకలనంలోని ప్రతి పుటలో నేల మీది దృశ్యాలే కనిపిస్తాయి. ప్రొద్దుటూరు గల్లి నుండి అంతర్జాతీయ సమస్యల దాకా వస్తువైవిధ్యం కూడుకొన్న కవితలు సామాజిక చీకటి కోణాల చిట్టా విప్పుతాయి. ఇవాళ కవిత్వం కడుపు నిండిన పండితుల తూగుటుయ్యాల తుళ్ళింతల ఊహాగానం కాదు, కడుపు మండిన శ్రామికవర్గాల యుద్ధరావం. మహమూద్ వ్యక్తిగా, కవిగా పీడితపక్షపాతి. గత మూడు దశాబ్దులుగా సృజనరంగంలో కొనసాగటం అందునా నిరంతరం కవిత్వరచన చేస్తూ వుండటం మామూలు విషయం కాదు. చాలా మంది కవులలాగా మహమూద్ ఎక్కడా వస్తు అన్వేషణలో వెంపర్లాడటం కనిపించదు. సంఘర్షణాత్మక సమాజంలో కవితావస్తువులకు కొదవ లేదు. ప్రతిభావంతుడైన మహమూద్ 'ఈ కాలపు కలంతోనే, తన ఆక్రోషపు బలంతోనే" కవితలు రాసాడు, ఇప్పటికీ రాస్తున్నాడు. నిరంతరం రాయడమే కదా కవి సజీవతకు నిదర్శనం. తెలుగు సాహిత్య చరిత్రలో 1992 ఒక కొండగుర్తు. డిసెంబరు-6 చారిత్రిక తప్పిదాల నేపథ్యంలో బాబ్రీ మసీదు కూల్చివేయబడింది. అది కోట్లాది మంది మైనారిటీల నమ్మకం గాయపడిన రోజు. కొన్నేళ్ళ పాటు వీటి ప్రకంపనలు కొనసాగాయి. ఇంకా సాగుతూనే వున్నాయి. మైనారిటీవాద కవిత్వం పుటల కొద్దీ వచ్చింది. కొందరు కవులు మతాన్ని భుజాన్ని



వేసుకొని తిరిగితే, మరి కొందరు మతనేపథ్య సమస్యలు తీసుకొని కవితలు రాసినా మతసరిహద్దు రేఖలు దాటి నిలబడ్డారు, మతతత్వవాదులతో కలబడ్డారు. ముఖ్యంగా వామపక్ష భావజాలం ప్రగాఢంగా వున్న కవులు చాలా సంయమనంతో కవిత్వసృజన చేశారు. మహమూద్ అలాంటి వామపక్ష ఉద్యమాల నుండి వచ్చిన కవి. 'ఆస్మాని' లో మతనేపథ్య కవితలు వున్నాయి కానీ అవి మత కవితలుగా గాక సకల పీడితవర్గ కవిత్వంలో భాగంగానే కనిపిస్తాయి. మహమూద్ లొంగుబాటు తెలియని పోరాటయోధుడు. తన జాతి పుట్టుమచ్చలు వెతుకుతున్న చోట తలవంచని అస్థిత్వపతాకం ఎత్తి గర్జిస్తున్నాడు మహమూద్.

ఎవరో ముక్కూ మొహం వ్యక్తిత్వం లేనివాడి ముందు నా దేశభక్తి నిరూపించుకోవాలి నేనెవరోనో చెప్పాలి సూఫియానా ఆలోచనా పరిచిన దారిలో నడచి ప్రేమశ్వాస గుండెల నిండా నింపుకొన్న విశ్వాసినని చెప్పనా నా దేశపు సగటుతనాన్ని సస్నేహంగానే గుండెలకు హత్తుకొనే సాధారణ ముసల్మానునని చెప్పనా నేను బానిసత్వాన్ని అంగీరించలేను అలాగని నాదైన దేశాన్ని విడిచిపోలేను ఇంకే మార్గం లేదు నా అస్థిత్వాన్ని ప్రశ్నిస్తున్నవాళ్ళ అస్థిత్వాన్ని ప్రశ్నించడం తప్ప ఇవాళ సమకాలిన సమాజం సంక్షుభితంగానే కాదు అత్యంత సంఘర్షణాత్మకంగా వుంది. ఒక దేశం, ఒక పార్టీ. ఒక మతం అనే భావజాలం ఒక వ్యూహంగా రుద్దబడుతున్న రాజకీయవాతావరణంలో పాసిజం వేయిపడగల హైందవనాగరాజులాగా బుసలుకొడుతుంది. ప్రజాస్వామిక మూలసూత్రాలు పెనుప్రమాదంలోకి నెట్టివేయబడుతున్న ఈ అకాలంలో రాయడం అంటే ప్రశ్నించడమే. మహమూద్ ప్రశ్నించే కవి. కవిత్వం రాయడం వెనుక నిశ్చితమైన తాత్వీకదృక్కోణం వున్న వాడు కనుకనే కుండబ్రద్దలు కొట్టినట్లు కవిత్వం ఎందుకు రాయాలోఎట్లా రాయాలో కూడా చెప్పాడు.

ఇపుడు మనక్కావలసింది జీవితాన్ని కవిత్వం చేయడమే జీవితమంతా కవిత్వమైపోవడమే రాయాలిపుడు మనం రాజ్య ధిక్కారం అణువణువున నింపుకున్న రాజద్రోహ కవిత్వం రాత రాజద్రోహంగా మారి కలాల మీద కత్తులు నూరుతున్న దేశంలో కవి నిస్సందేహంగా సంకెళ్ళతో సంగీతం వినిపించే తెగువ చూపేవాడు కాక తప్పదు. మహమూద్ తోవలో నడిచిన కవుల కోవలోని వాడు. ఆత్మాశ్రయ, సూఫీతాత్విక, విప్లవవాద త్రివేణి సంగమం మహమూద్ కవిత్వం. వైయక్తికమైన వస్తువును తీసుకొన్న దానిలో కూడా సామాజికత ధ్వనింపజేస్తాడు మహమూద్. సహచరి మీద ప్రణయ కవిత్వం రాసినా ఉద్యమమార్గంలో సహగాములై సాగిన అనుభవాల తలపోతలకు పరిమళాలను అద్దుతాడు. విప్లవ కవిత్వానికి పరిమళభరితం చేసినవాడు శివసాగర్. రక్తప్రవాహాలు, అరుపులు, చరుపుల రణగణధ్వనుల విప్లవ కవిత్వంలో తెలివెన్నెల కాయించాడు. ఉద్యమోన్నత ప్రణయైకభావనలు పూయించాడు. విప్లవ కవిత్వాన్ని సరిక్రొత్త పరిమళాలు సమకూర్చాడు. మహమూద్ విప్లవకవిత్వం శివసాగరం అలలెత్తే మరో పొడిగింపు. సీరియస్ కవిత్వం రాస్తూనే మరో ప్రక్క మానవసంబంధాలను ఆత్మీయంగా అక్షరీకరిస్తాడు. గుర్తుందా నీకు నీ భుజమ్మీద తూపాకి కొనకు సూర్యుడు మెత్తటి సాయంత్రం ఎండని వేలాడదీసి అల్విదా చెప్పేవాడు కనుల మీద కలవరింతల జాడ శత్రువు బూటు చప్పుడులా నిద్దురను కలవరపాటుకు గురిచేసినప్పుడు పీడకలలను కంటిపై వాలనీయకుండా తన కలలను కప్పిన అమ్మలా కలల వసంతానివై వచ్చేదానివి అలా వెచ్చటి సుషుప్తి దగ్గరయ్యేది భయం దూరంగా పారిపోయేది నా రాత్రిని కంటికి రెప్పలా కాపాడిన నీ సెంట్రీడ్యూటికి నా ఉదయం రెడ్ సెల్యూట్ చేసేది రహస్యోద్యమ సహచరిని తలచుకొంటూ కఠిన దారుల్లో శత్రువుతో తలబడినప్పుడు ఆమె పెదవిపై చెదరని ఆత్మవిశ్వాసపు వెల్తుర్ధ్వని తనలో ప్రతిధ్వనించిన తీరు ఓ సంభాషణాత్మ కవితగా రూపుదాల్చింది. మహమూద్ నిలువెల్ల మానవసంబంధాలు మూర్తీభవించిన మనస్విగా ఈ పుటల నిండా పర్చుకొని పలుకరిస్తాడు. నీ మోము నా అరచేతుల్లో కాదు నా మోమును నీ అరచేతుల్లో చూసుకొని మా కిత్నే ఖుబుసూరత్ హై తేరే హాత్ అనుకోవడం నా జీవితం తారకలు జల్లుల్లా రాలి నీటిబిందువుల్లా నీ పాదాల్లో అంటుకొన్నట్టు పాల పుంతలు ఊద్ ధూపాల్లా మారి పరిమాళాలద్దినట్టు మా కిత్నే ములాయం హై తేరే పావ్ సమస్త ప్రకృతిలో అమ్మను చూస్తూ ఇంకా అమ్మ పాదాల చుట్టూ బాల్యమై అంబాడుతున్న కవి మహమూద్. అమ్మకు తాను అలీ'లా కనిపిస్తే అమ్మ అతనిది సాక్షాత్తు పవిత్ర ఖురానా "ఆయత్' లా అనిపిస్తుందని మోహర్రం పండుగను గుర్తుచేసుకొంటాడు. మానవసంబంధాలు మృగ్యమౌతున్న వేళలో సహచరిని హృదయానికి హత్తుకొన్నా, అమ్మ పాదాలను కళ్ళకు అద్దుకొన్న మహమూద్ ప్రేమపాశాల అమ్మతహృదయుడు. ప్రతి మలుపులోను స్త్రీ పక్షపాతిగా వారి సమస్యల మీద స్పందిస్తాడు. సమస్త స్త్రీలు పురషసమాజపీడితులుగానే చూస్తాడు. స్త్రీ విముక్తి బాటలో కదిలి కదిలించే తాభిలాషియైనా కార్యకర్తగా, కావ్యకర్తగా కవి మహమూద్ నిలబడతాడు. తల లాగా దేవాలయాలు నాభిలాగా భూస్వాములు తోడల్లాగా బిసిలు పాదాల్లాగా బహుజనులూ ఈ దేశం దేహంలో అంగాలుగా ఎందుకున్నరో ఊరిబయట విసిరేయబడిన ఎస్సీ ఎస్టీ కాలనీలకు గ్రామం నడిబొడ్డులోపంచాయితీ చేసే అగ్రవర్ణ రచ్చబండకూ పెళ్ళిసంబంధాలకూ రక్తసంబంధాలకూ లంకె. ఏమిటో ఒకసారి తరచి చూసుకోవాలి మీ పెళ్ళాం మెడలో తాళి కట్టినప్పుడక్కడా దళితపూజారెందుకు లేడో ఊహించుకోవాలి కులం ఈ దేశ రుధిరంగా సోదరా అసలు నీ దృక్పథానికి అంటుకున్న శుక్లం. కాదురా కులం తెలుగునాట అస్థిత్వ ఉద్యమాల తీరుతెన్నుల్ని చాలా దగ్గరనుండి గమనించిన మహమూద్ కాసింత అసహనంతో రాసిన కవిత. చివరికి వర్గపోరాటాల చుట్టూ సమస్త ఆలోచనలను కేంద్రీకరించిన కామ్రేడులు సైతం వర్ణపోరాటాలను అంతగా పట్టించుకోలేదు. సమస్య వచ్చినప్పడే స్పందించడం తరువాత ప్రక్కన పడేయడం లాంటి నేతల నిర్వాకాలను మహమూద్ నిరసిస్తున్నాడు. భారత వామపక్షాలూ, అంబేద్కరిస్టులు కూడా అస్థిత్వపోరాటాలలో దృక్కోణాలను సరిచేసుకోవాల్సిన అవసరం వుందనేది నిజం. వీరి కంటి శుక్లాలు తొలగిపోయి ఒక స్పష్టవైఖరితో ముందుకు సాగేక్రమంలో భీమ్రేడ్లుగా నేతలు మారాల్సిన అవసరం ఈ కవిత నొక్కి చెబుతుంది. ఆస్మాని చదువుతుంటే ఓ సుశిక్షితుడైన సాయుధసైనికునితో పయనిస్తున్నట్లు అనిపిస్తుంది. ఒక సుదీర్గలక్ష్యసాధన కోసం ఎత్తిన ఆయుధానికి భుజం కాయాలనే ఆలోచన రేకెత్తిస్తుంది. నిజంగా ఆస్మాని సంపుటం లోని కవిత్వం గతితార్కిక సూఫీతత్వంతో పరిమళిస్తున్న అనుభవం, అనుభూతి మనకు కలుగుతుంది.



– షుకూర్
9491088529

---

భారతీయ కవిత

## తుఫాన్: మామిడి చెట్టూ, కవి జయంత మహాపాత్రా

ఈ పెద్ద మామిడి చెట్టు
అన్ని శాపాల నుంచి విముక్తం చేసేది

ఇంట్లోని భారీ ఉక్కపోత అంతా
దీని చల్లని విశాలమైన నీడలో
ఓదార్పు పొందేది

కాలపు భారపు చప్పుడును
ఈ మామిడి చెట్టు తేలిక పరిచేది
తండ్రి దీవెనై –

కుటుంబపు కడగళ్ల కన్నీళ్ళూ
వికసించే పూలుగా పరిణమించేవి
నీలమణి రంగు పత్రశాఖలలో వసించే
ఎర్ర చీమలను చూస్తూ
గాయాలనూ విలాపాలనూ మరచేవారు

ఊగే ఆకుల గుసగుసలను కవిత్వంగా
ఆకుపచ్చ పెదాల శాఖల అభిరుచిని రాగంగా
మలిచేదిది

ఒక రాత్రి వేళ ఓ తుఫాన్ తాకిడికి
చెట్టు మీది కాకులు ఉలిక్కిపడ్డాయి
ఆ రాత్రంతా బీభత్సంగా మారింది
పక్షులు భయంతో అరుపులు పెట్టాయి
చీకటి తనలో తానే ఆశ్రయం చూసుకుంది
పెనుగులాడీ పెనుగులాడీ చెట్టు కడకు నేలకొరిగింది
దానితో పాటు కూలిపోయాయి జ్ఞాపకాలూ, కవిత్వమూ
వేదనా, తత్సంబంధితాలన్నీ–

కానీ అది ఆ భయంకర తుఫాన్ నుంచి
ఆ కాంక్రీట్ ఇంటినీ, జయంత మహాపాత్రతో పాటు
ఇంటివాళ్ళందరినీ కాపాడింది

ఇవాళ చెట్టును చూద్దామంటే ఆ చోటులో అంతా ఖాళీ
ఆ ఖాళీలో నీళ్ళు నిండిన
తండ్రుల, అమ్మమ్మల కళ్ళు కనపడతాయి

ఒడియా మూలం: కమలాకాంత పాండా
ఆంగ్లానువాదం: ప్రభంజన్ కె మిశ్రా
తెలుగు సేత: దర్భశయనం శ్రీనివాసాచార్య



---

## సమాజ సౌభాగ్యంకోసం, మనసు పూచిన పూలు


తెలుగు సాహిత్యం విభిన్న దృక్పథాలతో విభిన్న అభివ్యక్తులతో వైవిధ్యభరితంగా కొనసాగుతున్నది. బీసీ వాదం, తెలంగాణ వాదం, దళిత, మైనారిటీ వాదాలు,స్త్రీవాదం ఇట్లా చూసుకుంటూ పోతే తెలుగు వచన కవితా రంగం మొత్తం వాదాలతో నిండి నడుస్తోంది. ఇప్పుడు పరిస్థితి ఎలా వచ్చిందంటే ఒక వాదాన్ని ఆశ్రయించని కవిత కవితే కాదని అనే పరిస్థితి వచ్చింది. ఇక వ్యక్తీకరణలో కవిత్వంలో ఎన్ని ప్రతీకలు వాడితే ఎన్ని ఇమేజ్ లు వాడితే అది అంత గొప్ప కవిత్వం. పైదేది కాదనదగింది కాదు. కాని ఇది ఏమీ లేకుండా సాధారణ వ్యక్తికరణతోనే గొప్ప కవిత్వం సృజించగలిగే కొన్ని కలాలు సమాంతరంగా కొనసాగుతున్నాయి. ఆ కలాల దృష్టి అంతా సమాజ సంక్షేమం. సౌభాగ్యం. ప్రకృతి ప్రేమ.
ఇదే సాహితీ సాంప్రదాయానికి చెందిన కవిత్వం ఇటీవల డాక్టర్ ఎల్లూరి శివారెడ్డి గారు వెలువరించిన మనసు పూచిన పూలు. శివారెడ్డి వస్తువు ఏ మూసలోనూ చేరదు. ఏ రాజకీయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించదు. కేవలం మానవ ప్రేమ, సర్వజన సౌభాతృత్వమే ఈ కవిత్వానికి ప్రాతిపదిక.

ప్రకృతి ప్రేమ ఈనాటి జీవన విధానానికి ఆవశ్యం ఆచరణీయ అంశం. దానికి ఉత్ప్రేరకంగా ఆయన వృక్ష సందేశం, తరుఘోష, పరాన్న భుక్కులు, ఈ చెట్టు నీది నాది, లాంటి కవితలు నిలుస్తాయి
"చెట్లు మౌనంగా ఋషి లాగా ధర్మాన్ని బోధిస్తాయి, పదికాలాలు పచ్చగా ఉండమని,....... పక్కనున్న పాదపం గలగలమని నవ్వితే తలూపడం తరువులన్నిటికీ తెలుసు.....

తరుఘోష అనే ఈ కవితలో వృక్షాల ఔన్నత్యం చెప్పారు . తెలుగు భాషలో వృక్షాలు అమహత్తులే. ఇవి ఎలా ఇంతటి ధర్మగుణం పొందగలిగాయి?. కవిలోని ధర్మ గుణమే. మానవీకరణ పొందిన వృక్షాల మమకారం ఇక్కడ కవి చిత్రీకరించారు.
సినారె శైలి గుర్తుకు తెచ్చే కవిత వృక్ష సందేశం. "పృథ్వీతలాన్ని పరిమళభరితం చేయాలని పూలు పుట్టుకొచ్చాయి. గుల్మాల ( కొమ్మల ) గుండెలపై, లతా కన్యల లలిత గాత్రాలపై, తమ వెంట అనంత జన్మల వాసనలు మోసుకొచ్చాయి".

తన లలిత జీవితాన్ని తొందరగా ముగిస్తాయి పూలు. మళ్లీ మేఘ గర్జనల వల్ల చెట్టుకే పుడతాయి. ఇక్కడో గమ్మత్తు ఉంది. చెట్లను వయోభారంతో ఎందుకు వంగిపోతున్నాయని? తమలాగా ఎందుకు పరిమళించడం లేదని గుసగుసలు పోతాయి. ప్రతి జీవికి ఒక పరమార్థం ఉంటుందని జీవితం మూన్నాళ్ళ ముచ్చట కాదని వృద్ధవృక్షాలు ( వృద్ధి చెందిన వృక్షాలు ) లతలకు ఆశీస్సులు అందిస్తాయి. చెట్టు, పువ్వు, లతలు, వీటి సంభాషణ వల్ల మనిషి జన్మ రహస్యం చక్కగా వ్యక్తీకరించారు.

శివారెడ్డి గారి కవిత్వం ప్రసాద మాధుర్యంతో నిండి ఉంటుంది. పదబాహుళ్యం ఆయన గంటం ముందు వినయంగా నిలబడుతుంది.




ఈ యన క విత ్వం భాషా ప్రేమికులకు గొప్ప ప ఒండుగ లాంటిది.
వ ృద ్ధ వ ృక్షాలు, తరుణీ దీపాలు నిర ంత ర దురంత సంచారం, మధు పాలు, ఇక్షు ఖండాలు, కృష్ణ వర్ణ రంజిత నేపథ్యం, రౌద్రార్భటీపరీత హలాహల విష నిధి, లాంటి సమాసాలెన్నో అలవోకగా ఒరిగిపోతాయి.
మానవుడు భూమికగా ఆయన కలం అమృతాక్షరాలు వర్షించింది. కాగా ఇది ఎం ఎన్ రాయ్ చెప్పిన మానవతావాదం కాదు. సాంప్రదాయిక నేపథ్యం నుండి ఆధునిక మానవునికి సార్వత్రికత ప్రోది చేయడంలో వికసించింది. మనిషి మహిమ, మాట, దారి లాంటి కవితలు ఈ ధోరణికి నిదర్శనాలు. "ఒకనాడు ఇది స్వచ్ఛ సరోవరం, నిజంగా ఈ నేలకే ఒక వరం" అని మొదలవుతుంది ఈ కవిత. ఒక్కప్పటి మానవ లోకం ఇంత స్వచ్ఛంగా ఉండేది. కాని మనిషి చేసిన పొరపాట్ల వల్ల కాలుష్యం రెక్క విప్పింది. కాల ప్రవాహం అన్నిటిని మలినీకరించింది. అంటూ మనిషి అకలుషితుడైతే, లోకమంతా మారుతుందని అన్యాపదేశంగా చెబుతున్నారు. "మాటల విలువ తెలియని మనుషులు మృగత్వం వీడని వచస్కులు", అని మాటల విలువ చెబుతుంటే 'వాగ్భూషణమ్ భూషణం' అన్న ఆర్యోక్తి గుర్తుకు వస్తుంది. ఒకవైపు శ్రమైక జీవుల డొక్కలు... ఆ డొక్కల కోసం నక్కిన నక్కలు, కుక్కలు అంటూ సామాజిక వాస్తవికతను, అసమ సమాజంలోని దోపిడిని పాఠకుల ముందు పెడతారు. Poetry is spontaneous overflow of powerful feelings అన్న ఆంగ్ల కవి మాటలు గుర్తుకు తెస్తాయి ఆయన వస్తుధనం కవితలో చెప్పిన మాటలు. "ఆవేశం లేనిది రచన కాదు, అది వట్టి రాళ్ల కుప్ప".

రాయడానికి వస్తువే లేదు అనే మహా విమర్శకులకు ఈయన వస్తుధనం కవిత చూపించాలి.

శివారెడ్డి చేతిలో కవిత్వీకరణ పొందిన ప్రతి వస్తువూ వస్తు పరిధి నుంచి అనేకత వైపుకే విస్తరించింది. ఒక మూలాంశం తో ప్రారంభమైన కవిత, మూలాంశాన్ని అధిగమించి సార్వజనీనకత వైపుకు పయనిస్తుంది.

శివారెడ్డి గారి కవితలలో అద్భుతమైన కవితా వాక్యాలు కొన్ని గమనించండి.
మా మనసుల కాసారంలో పూచిన పద్మాలు మీరు,
నేను సూర్యకిరణంలా వస్తాను,
చంద్రకిరణంలానిష్క్రమిస్తాను,
దీపం ఎంత వెలిగించినా చీకటి దాన్ని జుర్రుకుంటుంది,
మనసే లేకుంటే అనంత బాధల బుల్లెట్లతో శరీరమంతా జల్లెడగా మారేది,
సార్వజనీనక సత్యాలు అనిపించుకోదగిన కొన్ని మాటలు
మంచి చేయడానికి మతాలు అక్కర లేదు,
రాజకీయ నాయకుల మాటలు
రణరంగంలో తూటాలు,
మానవత్వమే మన స్వస్థానం,
ప్రేమించగలిగితే అగ్ని కూడా హాయిగా ఉంటుంది,

ఇంత చక్కగా కొనసాగే కవిత్వం అంత్యప్రాసలతో, పూజా పందిరి , వెలుగుధనం ,లాంటిసమాసాలతో అక్కడక్కడా మనల్ని అటకాయించడం కూడా ఉంది . ఇలాంటివి ఆర్యవ్యవహారంగా స్వీకరించాల్సిందే.



డాక్టర్ .కాంచనపల్లి గోవర్ధన్ రాజు
9676096614


---

## ఓ స్వర్గపు కథాకళి

ప్రతి కొత్త దారి ఆ తీరం చేరింది \
ప్రతి కొత్త పలుకునూ ఆ నేల ఆదరించింది \
........
అనంతమది అవిశ్రాంతమది \నాలుగు దిక్కుల నాహ్వానించే ఆ సముద్ర తీరం \ తెల తెల్లని ఇసుక పరుపుల తొలి ఆతిథ్యం \ ఎకడెక్కడ నుంచో వచ్చిన సాహసికుల సాహచర్యం \చిరుగాలుల వింజామరలయ్యే కొబ్బరి తోపులు .\ అందరినీ రా రమ్మని పిలిచే ప్రకృతి మాత వలువల వివిధ కోపులు . \
తన కాయువు నిచ్చి\ తన తలపై చేయిపెట్టి \
నవ నవన్మేషమై నిరతం వర్ధిల్లమని దీవించే కడలీ\ ఆప్యాయత పొంగి పొరలిన అచ్చన్ \ తన ఒడి నింపిన నిశ్చలమైన నీటి మడుగులు\ తరగని సంపదలై కాచే తోడు నీడగా ;\ సతతం తనతో నడిచే సతత హరితారణ్యాలు \ఆ పశ్చిమ కనుమలు నెచ్చెలిగా\ నింగీ నేలకు మధ్య నిశ్శబ్ద సంభాషణ నెరిపే \మహా మౌన లోయ ఆ సైలెంట్ వాల్లీ\
మహా కాయులైనా మెల మెల్లగ టేక్కడి కొండా\ కోనల కలదిరిగే గజరాజులు\ పగలు రేయీ ఆకాశం వూయలలో సవారించు నీలి మబ్బుల విశ్రాంత గ్రుహమై నిలిచే మున్నార్ కోనా \ఎటు చూస్తే అటు నిర్మలమూ నిర్నిమేషమై నిత్య వసంత సీమై నేల తల్లి విహరించే భూమి అది .\
అచ్చన్ ఇచ్చిన ఈవుల ప్రతిఫలమై \తన ఒడిలో ఆడుకునే పిల్లల్లా నాటు పడవలు , గూటి పడవలు \ కనుచూపు మేర పచ్చదనపు రాసులై విరిసి \నదినీ కడలిని అను నిత్యం కలిపే జీవజాల నిధులు ఆ మడ అడవులు \తీర భూమి తమి తీరా చాకుతున్న ఫల పుష్ప వన వాటికల చల చల్లని నీడల్లో డోలికలూగే నావా కుటీరాలు\ నిశ్చల నీటి మడుగులను , మడ అడవులను పలకరించి రావాలని తమ ప్రేమకు అల్లి బిల్లి పొదలు కొత్త గూడు కావాలని కోరుకునే కొత్త జంటలు\ మట్టీ, మనిషుల బంధం ముచ్చటగా పెనవేసే మున్నీటి సాక్ష్య సీమ ఇది. \
దోబూచులాడుతున్న నీలి నీలి గిరి శిఖరాల\బారు పలు పచ్చల తెరల వెనక \ఎటో వెళిపోతున్న గుర్రాల గుంపు చప్పుడులా కడలి హోరు.\
కనుచూపు మేరా ఎండపొడ మజ్లిన్ \ దిగంతం వైపుకు పరిగెడుతున్న జింకల గుంపులా ఎగిసి పడే పచ్చిక తోపులు . \
అందానికి అణకువ అబ్బినట్టు\ గిరి సానువుల వొడిలో పరిమళ ద్రవ్యాల\పొదలూ, లతలూ .\
శిఖరాలకు హరిత కిరీటాలు పెట్టినట్టు ,\
పచ్చలతో లోయలనలంకరించిన తేయాకు తోటలు .
\
ఆకాశాన్నందుకొనే ఉత్సాహం\ చెమటకు తడిసిన చేతులు చాస్తూ \బరువెక్కిన గాలీ \చేయందిస్తూ జాలు వారుతున్న నల్ల మబ్బులూ; \ జలతారు అంచు నల్ల చీరలో\ వూహల్లో తేలుతూ కదిలే తీగలా\ అలవోకగా నడిచే కలేజా ఉన్న అమ్మాయిలా \ పలు వన్నెల పూల కంచెల నడుమ\ అప్పుడే కురిసి వెలిసిన వానకు తడిసిన వంపుల రోడ్డు.\ తన వళ్ళు మీటుతూ గల గల పారే నీళ్ళు\ ఎటు వెళ్ళినా ఎదురొచ్చే పెరియార్ నదీ !\ పలు పచ్చల ప్రవాహ మార్గాలు\ అక్కడి రహదారులు\ జల జల మని జాలు వారే నీల మణి వాహకులు అక్కడి వాగులు నదులు\ జీవవైవిధ్యపు మేలి ప్రతీక పశ్చిమ కనుమల పద పీఠం\
ఇది కేరళం .\
కొబ్బరి తోపుల నీడల్లో నిశ్చింతగ విహరించే అరేబియా జలధి ప్రియ తనయ\ సహచరిగా నెచ్చెలిగా సతత హరితారణ్యాలు ఆ పశ్చిమ కనుమల చెలియ\ సకల జన సంక్షేమ పథ గామి ఐన వినయ సర్వ స్వార్థ శక్తులనతి ధ్రుఢ దీక్షతో దరి చేరనివని విజయ \సమ భావ తత్వాలనన్నిటిని తన ప్రియ కలిమిగా కాపాడుకుంటున్న సజయ. \
వైవిధ్యం వెల్లి విరిసిన విరి పానుపులా వెలసిన ఈ విశిష్ట భూమి విహంగ వీక్షణమెంత మోహనం !\
వానలో తడిసే మావి, రబ్బరు , వక్క తోపులు పల్లెలు , పట్నాల పూబంతుల తురుముకొని\
ఎడతెగక సాగే వన మాలల్లే ఒదిగిన దారుల వెంబడి సహచరులై వెళ్ళడమంత మనో రంజకం ! \
..................
నేల నాలుగు చెరుగుల నుంచీ నడిచొచ్చారో \
నీటి తూనీగలపై ఈదే వచ్చారో ఇదే ఇన్నాళ్ళుగా \తామెదుకుతున్న చోటనుకొన్నారో \ అలసిన కాళ్ళకు కాస్త విశ్రాంతి కోసమని ఆగారో ! \
నాలుగు దిక్కుల నాలుగు జన సమూహాలు\
ఇది మా వాసం అనుకున్నాయి\ తమ ప్రవాసం ఇకపై ముగిసిందనుకున్నాయి\ మనసుకు నచ్చిన పరిసరమిచ్చిన పనిలో మునిగి పోయాయి . \
ఎవరి తీరు వారిది\ ఐనా ఎవరి పరిధిలో వారే అన్ని రోజులూ\ అందరు కలిసే రోజొకటి రాగానే\
అన్ని రంగులూ కలిసిన కలనేతలా మనం\
అందుకే ఇది మనందరి కేరళం అనుకున్నారు .\
నాలుగు భాషలు నవ్వులు రువ్వే చోటు ఇది\
నాలుగు మతాలు కలిసి నడిచే చోటు ఇది\
స్వచ్చమైన స్వర్గమిది అని అనలేమా ? ఏమో ?\
నకలు లేని నరకమని మాత్రం అననే అనలేం. \
...........
తరాల అంతరాల దారిలో తప్పోయిన \
తల్లిచాలు స్ఫురణ తిరిగి పుంజుకుందో ఏమో !\
తనే తల మానికమైన సమాజ నిర్మాణమిక్కడే మళ్ళీ పురుడు పోసుకుంది\ బాలెంతల అపురూపంగా చూసుకునే ప్రేమ కొత్త చిగుళ్ళు తొడుక్కుంది\
ప్రతి బిడ్డా పసిడి కన్నా ప్రియం\ అమ్మాయికి అబ్బాయికి అభేదమక్కడ ! \
పసి ప్రాయం మగబిడ్డల\ పశు కాపరులను చేయదు\ ఇల్లే సర్వస్వమైన ఇరుకు బ్రతుకు అమ్మాయిలదవలేదు \తొలి పలుకులు రాగానే రారమ్మని చిన్నారుల పొదువుకునే పాఠశాల తలుపులు తెరుచుకునే ఉంటాయెప్పుడు . \చదువంటే మురిపెమున్న వాళ్ళెంత దూరమెళతారో ఎవరి వూహకందదు . \అందరికీ

### దీర్ఘ కవిత

చదువూ , అందరికీ ఆరోగ్యం అలవోకగ అమరిపోయి కుదురుకుంది అక్కడ .\
ఆటపాటలిద్దరికీ సరి సమానమే \
అంతెరగని అందాల తోపులేనాడు అమ్మాయికి ఆపద మూలం కాలేదు .\ వియ్యానికి అబ్బాయే పెద్ద చదువు చదివుండాలను చాదస్తం అంతరించి పోయింది\
అమ్మాయి టీచరైనా డ్రైవర్ని చేసుకుంటుంది \అబ్బాయే ఇల్లు నడపాలను వితండ వాదమెటో వెళ్ళి పోయింది.\
..........
పరిసరాల పరీక్షలకు\ తర తరాల సంప్రదాయ సంకెళ్ళకు వెరవక \ప్రమత్తతెరగని పరోపకారమే ప్రజ్ఞా సంకేతంగా నిలిపిన సాటిలేని సుమనస్కులు \ సమాజ క్షేమమే విధిగా , అలుపెరగని పోరాట పటిమ నిధిగా \సముజ్జ్వల జీవితాలు నెరపిన మహా మనీషలెందరో ఈ నేల బిడ్డలే ! \
ప్రతి స్వరమూ తన భాషలో ఒదగాలని\ సకల ధ్వని సంచయమై సంపూర్ణ అక్షర మాలగా నిలవాలని\ తన పలుకుకు నిండు దనం మెండు దనం సమకూర్చిన ఎళుతచ్చన్ \తన స్వర రాగ మధురిమ సకల జన ప్రియమై సాగాలని గమకాలకు గమ్యం నేర్పిన కేజెట్టన్ \వైవిధ్యం ఆరాధ్యమైన విశిష్ట చల చిత్ర సీమ వెలుగులైన సత్యన్ , శారద , మమ్ముటీ , మోహన లాల్ \కదిలే బొమ్మలు సైతం భావ విప్లవాల ప్రతిధ్వని కావాలని\ నవ కథా కథన విరించిగా విశ్వఖ్యాతి నార్జించిన అదూరు గోపాల క్రిష్ణన్\ జన జీవన శ్రుతులను అతి నేర్పుతో సాహితీ విపంచిపై పలికించిన తక్కాళి శివశంకర పిళ్ళై, వాసుదేవన్ నాయర్ సమ న్యాయం సమాజ స్వరం కావాలని\ అడ్డొచ్చిన సకల బంధనాల తెంచి\ అసందిగ్ధ సరళినే సమయోచిత మార్గంగా ప్రకటించిన ప్రజా పాలకుడు నారాయణన్ \సహకారోద్యమ శిఖర పతాక అమూల్ వర్గీస్ కురియన్ \ప్రపంచ మేటి పరుగుల రాణి పయ్యోలి ఎక్స్ ప్రెస్ పీ టీ వుషా , అంజూ జార్జ్ \
జన జీవన రాగ మెళుకువలు కథాకళి , మోహిని యాట్టం , కలరియ పట్టు , \సిద్ధాయుర్వేద సాధకులై జాతి ఆర్తినావిష్కరించు వళ్ళత్తోల్ నారాయణ మెనన్ ,\ గురు కుంచు కురూప్, క్రిష్ణన్ నాయర్ ,\ కళా మండలం కళ్యాణి కుట్టి అమ్మ, కనక్ రేలే , మీనాక్షి అమ్మ గురుక్కల్ , సీ యెస్ మెనన్ \
...............
స్వర్గం లో సైతం తీర్చనలవి కాని\ కలల దొంతరలు కనబడతాయి \ ఏ ఊతం లేని వూహ దివి సీమల్లో విహరించడమ లవాటైన వాళ్ళకు\
అసలు స్వర్గమగుపిస్తే కళ్ళు బైర్లు కమ్ముతాయేమో !\ తేరుకొని చూసే కొద్దీ ఉత్తుత్తి స్వర్గాలకలవాటైన కళ్ళు పచ్చబడతాయేమో ! \
పచ్చ కళ్ళతో చూసిన ద్రుశ్యం పచ్చి అబద్ధానికి తోబుట్టువు కదా ! \ఆచరణసహిత స్వర్గ సరళిని అభీత కల్పనా ప్రపంచ ప్రహేళికతో నింపాలని కోరుకుంటాయి .\ కుంకుమ పూల రంగుతో కుహనా\ కలలను నింపేస్తాయి\
పచ్చని తోటల్లోనే పాములు దాక్కొని ఉంటాయి\ చల్లటి నీడల్లో కలిసి పోయి ఆదమరచి వున్న వాళ్ళ కాటేస్తాయి. \మొగలి పొదల వాసనలో తమ బుస బుసలను కమ్మేస్తాయి .\
ప్రతి మార్పూ మంచిదేననుకునే వాళ్ళకు\ పై పై మెరుపులు పరవాలేదనిపిస్తాయేమో ! \ కొత్తకు చోటిస్తున్నామనుకొని కూపం లోకి లాగే కుట్రలు గ్రహించలేని సహజ మానవులు \కుహకం నేర్చిన వాళ్ళకు పెద్ద చెట్టు కాసిన చేతికందే పళ్ళ లాంటి వాళ్ళు . \
స్వర్గాన్నెప్పుడో చేజార్చిన వాళ్ళ దారిలో\ నానా రంగులు పూసిన నరకాలే నమ్మబుద్ధేస్తాయి \స్వర్గం లోనే ఎన్నాళ్ళుగనో వున్న వాళ్ళకు \తెలియని నరకం సైతం ఓ మార్పనిపిస్తుందేమో !\ చూడాలిక , దుర్గ్రహణం అంచునున్న వాళ్ళేదారినెంచుకుంటారో !
(కొన్ని పదాలకు అర్థాలు :
1. అచ్చన్ : తండ్రి\ 2. కేజెట్టన్: కే జే యేసుదాసు . కర్నాటక సంగీతం లో విద్వాంసుడు . అన్ని భాషల చిత్రాల్లోనూ పాడిన మధుర గాయకుడు . ఎట్టన్ అంటే మళయాళం లో పెద్దన్న అని. కే జే యేసుదాసు గారిని ప్రేమతో గౌరవ పూర్వకంగా మళయాళీలు కేజెట్టన్ అని పిలుచుకుంటారు . ఇప్పుడు ఆయన వయసు 86 యేండ్లు . ఇప్పటికీ ఆయన స్వరం లో మాధుర్యం, ద్రుఢత్వం తగ్గలేదు. \3. నిశ్చల నీటి మడుగులు : ఇంగ్లీషులో బాక్ వాటర్స్ అనే మాటకు తెలుగు. ఈ నీటి మడుగులు అత్యంత సౌందర్యవంతమైన ప్రదేశాలు. ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులు ఈ నీటి మడుగుల్లో పడవ ప్రయాణం చేయడానికి చాలా ఇష్ట పడతారు. \4. నావా కుటీరాలు : నిశ్చల నీటి మడుగుల్లో తేలియాడుతుండే ఇళ్ళు . హౌస్ బోట్స్ అంటారు. కొన్ని రోజులు మడ అడవుల మధ్యన వుండే నిశ్చల నీటి మడుగుల్లోనే బస చేయాలనుకునే వారికి పచ్చని ప్రకృతి మధ్య ఈ హౌస్ బోట్స్ నావా కుటీరాలుగా అనిపిస్తాయి. \5. మున్నార్ : ఇది కొండ ప్రాంతం .కేరళం రాష్ట్రం లో చాలా ప్రాంతాలు కొండలతో నిండి వుంటాయి. కానీ మున్నారుకు మరో ప్రత్యేకత ఉంది. ఇక్కడ విస్తారంగా తేయాకు తోటలున్నాయి . ఈ తేయాకు తోటల మధ్య ఉండే వసతి గ్రుహాల్లో గడపడం ఆకాశం లో వున్న మబ్బులకు వేలాడుతున్న వూయల్లో వూగుతున్నట్టుగా వుంటుంది. \6. కలరియ పట్టు : ఇది ఒక ప్రాచీన యుద్ధ కళ .కేరళం రాష్ట్రం లో మాత్రమే ప్రత్యేకించి అభ్యసించే యుద్ధ కళ. ఇందులో నిష్ణాతురాలు ఓ 82 సంవత్సరాల మహిళ. ఆమె పేరు కళామండలం కళ్యాణి కుట్టి అమ్మ . \7. ఎళుత్తన్: మళయాళానికీ , తమిళానికీ దగ్గరి సంబంధం ఉండేది.ఇప్పటికీ చాలా ప్రాథమికమైన తమిళ పదాలు మళయాళం లో ఉన్నాయి. ఐతే మళయాళం ప్రత్యేక భాషగా రూపు దిద్దుకునేలా చేసిన వాడు ఎళుత్తన్.అందుకే ఆయన్ను మళయాల భాషా పితామహుడంటారు. మళయాళం లో అత్యున్నత సాహిత్య పురస్కారం ఆయన పేరుతో ఉంది. తమిళం లో ఉన్న పరిమితమైన అక్షర మాలను ఆయన మళయాళం లో 51 అక్షరాలకు విస్తరించాడు . అంతే గాకుండా సంస్కృత పదాలను విస్తృతంగా తన రచనల్లో ఉపయోగించాడు. అప్పటినుంచి మళయాళానికి రెండు ప్రత్యేకతలు వచ్చాయి. తమిళం లో ఒక అక్షరానికే సందర్భాన్ని బట్టి ధ్వని మారుతుంది. అలా కాకుండా మళయాళం లో అన్ని ధ్వనులకూ ప్రత్యేకమైన అక్షరాలున్నాయి, మన తెలుగు, కన్నడం లో లాగా . రెండో ప్రత్యేకత సంస్కృత భాషా ప్రయోగం విస్తృతంగా ఉండడం. దాన్ని మణిప్రవాళ శైలి అంటారు.\8. తల్లి చాలు : పిల్లల గుర్తింపు తల్లి పరంగా ఉంటుంది. ఆస్తి తల్లి నుంచి కూతుళ్ళకు సంక్రమిస్తుంది. ఇంగ్లీషులో ఈ వ్యవస్థను మాట్రిలీనియల్ అంటారు . ఈ సంప్రదాయం ఇప్పటికీ ఈశాన్య భారత దేశం లోని కాసీ , గారో తెగల్లో ఉంది. ఒకప్పుడు అన్ని సమాజాల్లో మాత్రు స్వామ్య వ్యవస్థ ఉండేది. అంటే కుటుంబ పెద్దగా స్త్రీ ఉండేది. నిర్ణయాధికారం స్త్రీకి ఉండేది. అది ఇప్పుడు అన్ని సమాజాల్లో పిత్రుస్వామ్య వ్యవస్థగా మారింది. ఈ వ్యవస్థే ఇప్పటి ప్రపంచం లో అన్ని సామాజిక సమస్యలకూ మూలకారణం . తల్లి చాలు ఆచారం , స్త్రీ స్వామ్య వ్యవస్థ ఒకటి కావు . \9. సత్యన్: మళయాళ సినిమా తొలి రోజుల్లో ప్రముఖ కథా నాయకుడు . ఆయనో క్రిస్టియన్. ఆ తరవాత ప్రముఖ కథా నాయకుడుగా కొన్ని దశాబ్దాలు ంటించిన ప్రేం నజీర్ ఓ ముస్లిం. ఇప్పుడు ప్రముఖ కథా నాయకులుగా ఉన్న మమ్మూటి ( మొహమ్మద్ కుట్టి ఓ ముస్లిం) ; మోహన లాల్ ఓ హిందు. వీళ్ళకెవరికీ మతాల వారీగా గుర్తింపు లేదు . మహా నటులు గానే ! అదీ కేరళం సమాజ ప్రత్యేకత.)



విద్యాసాగర్ అంగలకుర్తి



# జాతీయం-అంతర్జాతీయం



## బహుముఖ ప్రజ్ఞాశాలి ఆశా భోంస్లే మృతిపట్ల ప్రధాని సంతాపం

**అద్భుతమైన ఆమె సంగీత ప్రయాణాన్నీ, ప్రతిభనీ కొనియాడిన పీఎం**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 (వుదయం) :**

భారతదేశం గర్వించదగిన ప్రముఖ గాయని ఆశా భోంస్లే మృతి పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దశాబ్దాల పాటు సాగిన ఆమె సంగీత ప్రయాణం, దేశ సాంస్కృతిక వారసత్వాన్ని సుసంపన్నం చేయటమే కాక, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది హృదయాలను కదిలించిందని ప్రధాని అన్నారు. ఆమె ఆలపించిన మధురగీతాల ద్వారా, శక్తిమంతమైన స్వరకల్పనల ద్వారా ఆమె స్వరంలో ఎప్పుడూ అద్భుతమైన ప్రతిభ కనిపించేదని మోడీ తెలిపారు. ఆమెతో ఉన్న అనుబంధాన్ని ఎప్పటికీ మరిచిపోలేనని అన్నారు. ఆమె కుటుంబసభ్యులకు, అభిమానులకు, సంగీత ప్రియులకు ప్రధాన మంత్రి సానుభూతిని తెలియజేశారు. రాబోయే తరాలకు ఆమె స్ఫూర్తినిస్తూనే ఉంటారని, ఆమె పాడిన పాటలు ప్రజల జీవితాల్లో ఎల్లప్పుడూ ప్రతిధ్వనిస్తాయని ప్రధాని అన్నారు.

భారతదేశం గర్వించదగిన, ప్రముఖ గాయని ఆశా భోంస్లే మరణం... బాధాకరం. దశాబ్దాల పాటు సాగిన ఆమె సంగీత ప్రయాణం, దేశ సాంస్కృతిక వారసత్వాన్ని సుసంపన్నం చేయటమే కాక, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది హృదయాలను కదిలించింది. ఆమె ఆలపించిన మధురగీతాల ద్వారా, శక్తిమంతమైన స్వరకల్పనల ద్వారా ఆమె స్వరంలో ఎప్పుడూ అద్భుతమైన ప్రతిభ కనిపించేది. ఆమెతో ఉన్న అనుబంధాన్ని ఎప్పటికీ మరిచిపోలేను. ఆమె కుటుంబసభ్యులకు, అభిమానులకు, సంగీత ప్రియులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. రాబోయే తరాలకు ఆమె స్ఫూర్తినిస్తూనే ఉంటారు. ఆమె పాడిన పాటలు ప్రజల జీవితాల్లో ఎల్లప్పుడూ నిలిచి ఉంటాయి అని ఆయన ఎక్స్ పై పోస్టు చేశారు.

## ఏప్రిల్ 14న సీఎం పదవికి రాజీనామా చేయనున్న నితీష్



**పాట్నా, ఏప్రిల్ 12 (వుదయం) :**

బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఏప్రిల్ 14న జరగనున్న తన చివరి మంత్రివర్గ సమావేశానికి అధ్యక్షత వహించనున్నారు. ఈ సమావేశం ప్రధాన సచివాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుంది. ప్రతిపాదిత కేబినెట్ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటారని తెలుస్తోంది. దాదాపు 53 రోజుల తర్వాత సమావేశం జరుగుతున్నందున ఇందులో అనేక అంశాలు ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది.

కేబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి లోక్ భవన్ (రాజ్‌భవన్)కు వెళ్లి గవర్నర్ సయ్యద్ అతా హుస్సేన్‌కు తన రాజీనామా సమర్పించవచ్చు. ఇలా ఉండగా, బీహార్‌లో శాసన సభా పక్ష నాయకుడి ఎన్నికకు పార్టీ సీనియర్ నాయకుడు, కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కేంద్ర పరిశీలకునిగా భారతీయ జనతా పార్టీ నియమించింది. ఈ మేరకు పార్లమెంటరీ పార్టీ బోర్డు ఆదివారం నిర్ణయం తీసుకుంది.

బీహార్‌లో బీజేపీ ముఖ్యమంత్రి నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు సంబంధించి ముమ్మర రాజకీయ కార్యకలాపాలు జరుగుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

ఏప్రిల్ 13 తర్వాత రాష్ట్రానికి కొత్త ముఖ్యమంత్రి లభించే అవకాశం ఉంది. మార్చి 30న ముఖ్యమంత్రి నితీష్ కుమార్ బీహార్ శాసన మండలి సభ్యత్వానికి రాజీనామా చేశారని, ఏప్రిల్ 10న రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారని జనతా దళ్ (యునైటెడ్) కార్యనిర్వాహక అధ్యక్షుడు సంజయ్ కుమార్ ఝా తెలిపారు.

నితీష్‌తో కలిసి పాట్నాకు తిరిగి వచ్చిన ఝా, కొత్త ప్రభుత్వాన్ని లాంఛనప్రాయం చేసే ప్రక్రియ ఏప్రిల్ 13 తర్వాత ప్రారంభమవుతుందని మీడియా ప్రతినిధులకు తెలిపారు.

అదే సమయంలో, ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు సమ్రాట్ చౌదరి ఆదివారంనాడు పాట్నాలోని 1 ఆన్నె మార్గ్ వద్ద ఉన్న ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అధికారిక నివాసంలో ఆయనను కలిశారు. ఆ వెంటనే, రాష్ట్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి జెడి (యు) నాయకుడు విజయ్ కుమార్ చౌదరి ముఖ్యమంత్రి నివాసాన్ని సందర్శించారు.

అనంతరం, విలేకరులతో మాట్లాడుతూ, బీజేపీ సిఫార్సు మేరకు ఎన్డీయే శాసనసభ్యులు కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకుంటారని విజయ్ చౌదరి తెలిపారు. కొత్త ప్రభుత్వంలో బీజేపీ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాల్లో వారికి వారిదైన ఒక ప్రక్రియ ఉంది, అని ఆయన తెలిపారు.

బీజేపీ తన ప్రణాళికను రూపొందించుకున్న వెంటనే, తదుపరి చేపట్టాల్సిన చర్యలు వాటంతట అవే జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఇంతలో, మరో బీజేపీ నాయకుడు, రాష్ట్ర మంత్రి అయిన లఖేంద్ర పాశ్వాన్, నితీష్‌ను కలిసేందుకు ముఖ్యమంత్రి నివాసానికి వచ్చారు.

ముఖ్యంగా, ఆయన ముఖ్యమంత్రి నివాసాన్ని సందర్శించడం, పార్టీ ఒక దళిత నాయకుడిని అత్యున్నత పదవికి ప్రతిపాదించే అవకాశం ఉందన్న ఊహాగానాలకు ఆజ్యం పోసింది.

## 12 రాష్ట్రాల వ్యాప్తంగా సర్ ద్వారా
# 5.18 కోట్ల పేర్లు తొలగింపు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 (వుదయం) :**




12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో చేపట్టిన ప్రత్యేక విస్తృత సవరణ (సర్) ప్రక్రియ రెండవ దశ ముగియడంతో, ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాల నుండి సుమారు 5.18 కోట్ల పేర్లను తొలగించింది. కమిషన్ తాజా గణాంకాల ప్రకారం, ఈ ప్రక్రియ ప్రారంభంలో ఓటర్ల జాబితాలో సుమారు 50.99 కోట్ల మంది ఉండగా, ఆ సంఖ్య 45.81 కోట్లకు తగ్గింది. అంటే ఓటర్ల జాబితా నుండి 10.2 శాతం మంది ఓటర్లను తొలగించారన్న మాట.

**66,88,636 మంది మృత ఓటర్లను తొలగించిన ఇసి**

ఎన్నికల సంఘం (ఇసి) ఓటర్ల జాబితా నుండి 66,88,636 మంది మరణించిన ఓటర్లను తొలగించింది. వీరిలో, అత్యధికంగా 25.47 లక్షల మంది మరణించిన ఓటర్లు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు. వీరి తర్వాతి స్థానంలో పశ్చిమ బెంగాల్ నుండి 24.16 లక్షల మంది ఉన్నారు. వీరే కాకుండా, సర్ ప్రక్రియ (జాబితా సవరణ కార్యక్రమం) సమయంలో వచ్చిన అభ్యంతరాల మేరకు జాబితా నుండి మరో 63.16 లక్షల పేర్లను తొలగించారు.

ఉత్తరప్రదేశ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కేరళ, పుదుచ్చేరి, అండమాన్, నికోబార్ దీవులు, లక్షద్వీప్, గుజరాత్, మధ్యప్రదేశ్, గోవా రాష్ట్రాల్లో సర్ ప్రక్రియకు సంబంధించిన రెండవ జాబితా తయారీ పూర్తయింది. ఈ తుది జాబితా వివిధ తేదీల్లో ప్రచురించారు. అంతకుముందు, ఎన్నికల సంఘం (ఇసి) బీహార్‌లో సర్ ప్రక్రియను నిర్వహించింది.

**17 రాష్ట్రాలు, 5 కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ ను అమలు చేయనున్న ఈసీ**

17 రాష్ట్రాలు, ఐదు కేంద్ర పాలిత ప్రాంతాల ఓటర్ల జాబితాలను ఇసి సర్ (ప్రత్యేక సవరణ కార్యక్రమం) పరిధిలోకి తీసుకురానుంది. కేరళ, అసోం, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత దీనికి సంబంధించిన ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అసోం, కేరళ, పుదుచ్చేరిలలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగగా, తమిళనాడులో ఏప్రిల్ 23న పశ్చిమ బెంగాల్‌లో మొదటి దశ పోలింగ్‌తో పాటే ఎన్నిక జరగనుంది. పశ్చిమ బెంగాల్ లో రెండవ దశ పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుంది. నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరికి ఫలితాలను మే 4న ప్రకటిస్తారు. అస్సాంలో సర్ కు బదులుగా ప్రత్యేక సవరణను చేపట్టారు, ఇది ఫిబ్రవరి 10న పూర్తయింది.

## త్రీలైన్ విప్ జారీ చేసిన బిజెపి

**మహిళా రిజర్వేషన్ చట్టంపై పార్లమెంటు ప్రత్యేక సెషన్‌కు సభ్యులంతా తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశం**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 (వుదయం) :**

ఏప్రిల్ 16 నుంచి 18 వరకు జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సెషన్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశిస్తూ, తమ పార్లమెంటు సభ్యులందరికీ భారతీయ జనతా పార్టీ అత్యవసర విప్ (త్రీలైన్ విప్)ను జారీ చేసింది.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక సిట్టింగ్‌లో మహిళా రిజర్వేషన్ చట్టంలో ప్రతిపాదిత సవరణలు సహా కీలక శాసన వ్యవహారాలను చర్చించనున్నారు. పార్టీ సందేశం ప్రకారం, లోక్‌సభ, రాజ్య సభకు చెందిన బిజెపి ఎంపీలందరూ గురువారం నుంచి శనివారం వరకు (1618 ఏప్రిల్) అత్యవసర విప్‌ను జారీ చేస్తున్నాం. పార్టీ దీనికి కఠినంగా కట్టుబడి ఉండాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. కేంద్ర మంత్రులు, సభ్యులు అందరూ కూడా పైన పేర్కొన్న తేదీలలో సభలో ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నామని పేర్కొంది.

సభకు హాజరుకావడం తప్పనిసరి. శలవు ఇవ్వడం జరుగదు. సభ్యులంతా విప్‌కు కట్టుబడి, సభకు నిరాటంకంగా హాజరు కావాలని ఆ సందేశంలో పేర్కొన్నారు.

2029 సార్వత్రిక ఎన్నికలకు ముందుగానే మహిళా రిజర్వేషన్ విధానాన్ని అమలు చేసేందుకు వీలుగా కేంద్ర కేబినెట్ ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపింది. ప్రతిపాదిత సవరణలలో లోక్‌సభ స్థానాలను 816కు పెంచడం, అందులో 273 స్థానాలను మహిళలకు రిజర్వ్ చేయడం ఉన్నాయి.

## జులై 3 నుంచి అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 (వుదయం) :**





దక్షిణ కశ్మీర్‌లో గుహాలయమైన అమరనాథ్‌కు వార్షిక యాత్ర ఈ ఏడాది జులై 3 నుంచి ప్రారంభం కానున్నట్టు జమ్ము కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆదివారం వెల్లడించారు. ఈ యాత్ర 57 రోజులు కొనసాగి, ఆగస్టు 28న ముగియనుంది. గత ఏడాదుల కంటే ఇది స్వల్పంగా ఎక్కువ కాలం.

శ్రీ అమరనాథ్ జీ ష్రైన్ బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

జ్యేష్ఠ పూర్ణిమ సందర్భంగా జూన్ 19న తొలి పూజ జరగనుంది.

**నమోదు ప్రక్రియ, అర్హత నిబంధనలు**

ఈ యాత్రకు ముందస్తు నమోదు ఏప్రిల్ 15 నుంచి ప్రారంభం కానుంది. యాత్రికులందరికీ ఇది తప్పనిసరి. రిజిస్ట్రేషన్ అధికారిక ఆలయ బోర్డు వెబ్‌సైట్‌పై ఆన్‌లైన్‌లో ను, భారతదేశవ్యాప్తంగా 550 అధికారిక/ నిర్దేశిత బ్యాంకు శాఖల ద్వారా ఆఫ్‌లైన్‌లో చేసుకోవచ్చు. ప్రతియాత్రకు రిజిస్ట్రేషన్ ఏడు రోజుల ముందు ముగుస్తుంది. ఈ యాత్రంలో 13 సంవత్సరాల నుంచి 70 ఏళ్ల మధ్య ఉన్నవారిని అనుమతిస్తారు. ఆరునెలలు దాటి గర్భిణులను అనుమతించరు.

**అధికారిక బ్యాంకులు, కోటా విధానం**

ఎస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్ ఎంపిక చేసిన శాఖల ద్వారా నమోదు ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ ప్రక్రియ 'మొదట వచ్చిన వారికి మొదట' అనే పద్ధతిని అనుసరిస్తుంది. ప్రతి మార్గానికి నిర్దేశించిన రోజువారీ కోటాపై ఆధారపడి ఉంటుంది. ప్రక్రియ సజావుగా సాగేలా చూసేందుకు, సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని బ్యాంకులను ఆదేశించడం జరిగింది.

**మార్గాలు, ఆరోగ్య అవసరాలు**

యాత్రికులు రెండు మార్గాలలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు. అనంతనాగ్ జిల్లాలోని 48 కిలోమీటర్ల నున్వాన్ పహల్గామ్ మార్గం సాంప్రదాయ మార్గం. గందర్‌బల్ జిల్లాలోని తక్కువ పొడవైన, కానీ ఎక్కువ వాలుగా ఉండే 14 కిలోమీటర్ల బల్తాల్ మార్గం ప్రత్యామ్నాయం.

యాత్రికులందరూ అధీకృత వైద్యులు లేదా వైద్య సంస్థల నుంచి, ఏప్రిల్ 8, 2026న లేదా ఆ తర్వాత తేదీతో జారీ చేసిన తప్పనిసరి ఆరోగ్య ధృవీకరణ పత్రాన్ని పొందాలి. ప్రతి పర్మిట్‌కు రూ. 150 రుసుము కూడా వసూలు చేయడం జరుగుతుంది.

**పర్మిట్, ధృవీకరణ ప్రక్రియ**

బ్యాంకు శాఖలు వ్యవస్థ ద్వారా రూపొందించిన యాత్ర పర్మిట్ జారీ చేయడానికి ముందు ఆరోగ్య ధృవీకరణ పత్రాన్ని ధృవీకరిస్తాయి. ఈ అనుమతిలో ఎంచుకున్న మార్గం, ప్రయాణ తేదీ ఉంటాయి. బాల్టాల్ మార్గంలోని డొమెల్ వద్ద లేదా పహల్గామ్ మార్గంలోని చందన్‌వారి వద్ద ఉన్న యాక్సెస్ కంట్రోల్ పాయింట్లను యాత్రికులు ఎప్పుడు దాటవచ్చో కూడా ఇందులో పేర్కొంటారు. నమోదు చేసుకునేటప్పుడు సరైన ఆధార్, సంప్రదింపు వివరాలను అందించాలని అధికారులు యాత్రికులను కోరారు.

## అరుణాచల్‌లో చైనా కల్పిత పేర్లు, భారత్ ఖండన

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 (వుదయం) :**



అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు కల్పిత పేర్లను ఆపాదించేందుకు చైనా చేస్తున్న ప్రయత్నాలను భారతదేశం ఆదివారం నాడు ఖండించింది. ఆ ప్రాంతాలు భారత భూభాగాల్లో అంతర్భాగమనే కాదనలేని వాస్తవాన్ని ఇటువంటి వాదనలు ఏమాత్రం మార్చలేవని భారత్ స్పష్టం చేసింది.

భారత భూభాగంలో ఉన్న ప్రదేశాలకు కల్పిత పేర్లు పెట్టేందుకు చైనా చేస్తున్న ఎలాంటి దుశ్చర్యలనైనా భారతదేశం ఖచ్చితంగా తిరస్కరిస్తుంది, అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారని పీటీఐ పేర్కొంది.

తప్పుడు ఆరోపణలు ప్రవేశపెట్టి, నిరాధారమైన కథనాలను సృష్టించడానికి చైనా చేస్తున్న ఇటువంటి ప్రయత్నాల వల్ల ఒరిగేది ఏమీ ఉండదని ఆయన స్పష్టం చేశారు. అరుణాచల్ ప్రదేశ్‌తో సహా ఈ ప్రాంతాలు, భూభాగాలు భారతదేశంలో గతంలోనూ, ఇప్పుడు కూడా అంతర్భాగంగా ఉన్నాయనీ, భవిష్యత్తులోనూ, ఎప్పటికీ అంతర్భాగంగానే ఉంటాయనే కాదనలేని వాస్తవాన్ని మార్చలేవని ఆయన పేర్కొన్నారు.

భారత్‌చైనా ద్వైపాక్షిక సంబంధాలను స్థిరీకరించడానికి, సాధారణీకరించడానికి జరుగుతున్న ప్రయత్నాలకు చైనా పక్షం తీసుకున్న ఈ చర్యలు ఆటంకం కలిగిస్తున్నాయి అని జైస్వాల్ అన్నారు. సంబంధాలలో ప్రతికూలతను నింపే, మెరుగైన అవగాహనను పెంపొందించే ప్రయత్నాలను దెబ్బతీసే చర్యలకు చైనా దూరంగా ఉండాలి, అని ఆయన కోరారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు చైనా పేర్లను బీజింగ్ ప్రకటించిన నేపథ్యంలో న్యూఢిల్లీ ఈ విధంగా స్పందించింది.

## నాసిక్ టిసిఎస్‌లో లైంగిక వేధింపుల కేసులో అరెస్టులు

**రహస్య ఆపరేషన్‌లో పాల్గొన్న ఏడుగురు మహిళా పోలీసు అధికారులు**

**వుదయం డెస్క్, ఏప్రిల్ 12 :**



ఒక భారీ కార్యాలయ వేధింపుల కుంభకోణం నాసిక్‌లో ఉన్న టీసీఎస్ బీపీఓ కార్యాలయంలో వెలుగులోకి వచ్చింది. గత 24 సంవత్సరాలుగా లైంగిక, మానసిక వేధింపులకు గురయ్యామని ఆరోపిస్తూ ఎనిమిది మంది మహిళలు, ఒక పురుషుడు తొమ్మిది ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేశారు. రహస్యంగా జరిపిన ఆపరేషన్‌లో దుష్ప్రవర్తన నిర్ధారణ కావడంతో, టీమ్ లీడర్లు, హెచ్‌ఆర్ హెడ్ నిదా ఖాన్‌తో సహా ఏడుగురిని అరెస్టు చేసినట్లు మహారాష్ట్ర పోలీసులు తెలిపారు. ఈ కేసు అత్యంత దిగ్భ్రాంతికరం అని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ అభివర్ణించారు.

నాసిక్‌లోని టీసీఎస్‌లోని పలువురు మహిళా ఉద్యోగులు, తమ సహోద్యోగులు, సీనియర్ సిబ్బంది రెండు నుంచి నాలుగు సంవత్సరాల కాలంలో లైంగిక, మానసిక వేధింపులు, బలప్రయోగం, లైంగిక దాడి, అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపించారు. సుమారు 300 మంది ఉద్యోగులు పనిచేస్తున్న టీసీఎస్ నాసిక్ బీపీఓ యూనిట్‌లో, ఎనిమిది మంది మహిళల, ఒక పురుష సహోద్యోగి తొమ్మిది ఎఫ్ఐఆర్‌లను దాఖలు చేశారు.

**అసలు ఏం జరిగింది?**

ప్రాథమిక విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం, నిందితులు 18 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల యువ మహిళా ఉద్యోగులను లక్ష్యంగా చేసుకున్నారు. ఉద్యోగ ఇంటర్వ్యూల సమయంలో, వారి కుటుంబ నేపథ్యం, కుటుంబ ఆదాయం గురించిన వివరాలు సేకరించి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని ఉద్దేశపూర్వకంగా గుర్తించారు. వారి బలహీనతను ఆసరాగా చేసుకొని, వారిపై వేధింపులు ప్రారంభించారు. అసభ్యకరమైన వ్యాఖ్యలు, లైంగిక వేధింపులు, ఒక సందర్భంలో అత్యాచారం వంటి చర్యలకు కూడా పాల్పడినట్టు ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. జీతం పెంపు లేదా ఉద్యోగ భద్రతకు బదులుగా బాధితులను నమాజ్ చేయమని, గోమాంసం తినమని కూడా బలవంతం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**రహస్య ఆపరేషన్, అరెస్టులు**


ఏడుగురు మహిళా పోలీసు అధికారులు మారువేషంలో కంపెనీలోకి ప్రవేశించి, కార్యాలయంలో చేరారు. అక్కడ నిందితులలో ఒకరు మహిళా ఉద్యోగుల పట్ల అనుచితంగా ప్రవర్తించడాన్ని వారు గమనించారు. నిందితుడు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటంతో, ఫిర్యాదులు నిజమని నిర్ధారణ కావడంతో పాటు పలువురి అరెస్టులకు దారితీసింది. అరెస్టు అయిన వారిలో ఆరుగురు టీమ్ లీడర్లు ఆసిఫ్ అన్సారీ, షఫీ షేక్, షారుఖ్ ఖురేషి, రజా మెమన్, తౌసిఫ్ అత్తర్, మహమ్మద్ డానిష్ షేక్‌లతో పాటు, పూణేకు చెందిన కంపెనీ హెచ్‌ఆర్ హెడ్ నిదా ఖాన్ కూడా ఉన్నారు.

**ఇంతవరకూ స్పందించిన టిసిఎస్ యాజమాన్యం**

కాగా, ఇన్ని ఘోరాలు చోటు చేసుకుంటూ, ఆ యూనిట్ మూతపడే స్థితికి వచ్చిన నేపథ్యంలో కూడా టిసిఎస్ యాజమాన్యం స్పందించడం కానీ, బాధితుల పట్ల సానుభూతి ప్రకటించడం కానీ ఇంతవరకూ జరుగకపోవడం విచిత్రం. కాగా, ఇటువంటి బిపిఓలు అనేకంలో పరిస్థితి ఇలాగే ఉందని అనేకమంది పేర్కొనడం గమనార్హం.

## ఏప్రిల్ 14 నుంచి భారత నౌకాదళ కమాండర్ల సదస్సు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 (వుదయం) :**





ఏప్రిల్ 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు భారత నౌకాదళ తొలి ద్వైవార్షిక కమాండర్ల సమావేశం 2026 న్యూఢిల్లీలోని నవసేనా భవన్‌లో నిర్వహించనున్నారు. జాతీయ సముద్ర ప్రయోజనాలను కాపాడేందుకు నౌకాదళ సంసిద్ధతను సమగ్రంగా సమీక్షించటం, సామర్థ్య అభివృద్ధి, జాతీయ భద్రతా లక్ష్యాలకు అనుగుణంగా వ్యూహాత్మక ప్రణాళికను రూపొందించటంపై ఈ అత్యున్నత స్థాయి సమావేశం దృష్టిసారిస్తుంది.

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలు, హిందూ మహాసముద్ర ప్రాంతంలో అంతర్జాతీయ దళాల మోహరింపు నేపథ్యంలో భారత ఇంధన భద్రతను కాపాడేందుకు చేపట్టిన వేగవంతమైన నౌకాదళ కార్యాచరణ దృష్ట్యా ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత నౌకాదళ కార్యాచరణ సిద్ధాంతాన్ని స్పష్టం చేయటానికి, త్రివిధ దళాల మధ్య సమన్వయం, సాంకేతికత ఆధారంగా ప్రతిస్పందన వ్యవస్థలను బలోపేతం చేయటానికి కీలకంగా ఈ సమావేశం నిలుస్తుంది.

ఈ సదస్సులో భాగంగా త్రివిధ దళాధిపతి, హోంశాఖ కార్యదర్శి ప్రసంగాలతో పాటు నౌకాదళం సీనియర్ అధికారుల స్థాయిలో చర్చలు జరుగనున్నాయి. త్రివిధ దళాల మధ్య పరస్పర సహకారాన్ని, సమగ్రతను పెంపొందించటం ఈ చర్చల ప్రధాన లక్ష్యం. జాతీయ స్థిరత్వం, భద్రతా వ్యవస్థ, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను సమష్టిగా ఎదుర్కొనే విధానాలపై విస్తృత అవగాహనను పెంపొందించుకోవటానికి ఈ చర్చలు సహకరిస్తాయి. ఈ సదస్సు జాతీయ నాయకత్వంతో సన్నిహిత సంభాషణలకు వేదికగా నిలుస్తూ, నౌకాదళ ప్రణాళికలకు వ్యూహాత్మక దిశానిర్దేశం చేస్తుంది.

ప్రస్తుత భౌగోళిక వ్యూహాత్మక వాతావరణంలోని వివిధ సవాళ్లను ఎదుర్కోవటానికి అవసరమైన ప్రణాళికలను నౌకాదళాధిపతి, కార్యాచరణ కమాండర్లు, సీనియర్ నౌకాదళ నాయకత్వంతో కలిసి రూపొందిస్తారు. భద్రతతో పాటు నిర్ణయాత్మక కార్యాచరణ విజయాన్ని సాధించటం, మహాసముద్రంలో సామర్థ్యాన్ని పెంపొందించటం, శిక్షణ, మానవ వనరుల నిర్వహణ, స్థిర నిర్వహణ పద్ధతులు, మానవ రహిత వ్యవస్థల సమర్థవంతమైన వినియోగం, కార్యాచరణ నిర్వహణ, యుద్ధ సంసిద్ధతను పెంచే కీలక అంశాలపై ఈ చర్చలు ప్రధానంగా దృష్టి సారించనున్నాయి. నౌకాదళంలో సమస్యల పరిష్కారానికి ఏఐ రోడ్‌మ్యాప్ అమలు, నిరంతర కార్యకలాపాల కోసం డేటా ఆధారిత సాంకేతికతపైనా చర్చలు జరుగుతాయి.

భారత నౌకాదళ సిద్ధాంతం (ఐఎండీ)లో వివరించిన నావికాదళ నాలుగు కీలక పాత్రలకు అనుగుణంగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు సైనిక విజయాన్ని అందించేందుకు సన్నద్ధతను నౌకాదళ అగ్ర నాయకత్వం సమీక్షిస్తుంది. నిరంతర కార్యకలాపాలు, అంతర్జాతీయ సహకారాన్ని విస్తరించటం, భారత ప్రభుత్వ విజన్ మ్యూచువల్ అండ్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ సెక్యూరిటీ ఎక్రాస్ రీజియన్స్ (మహాసాగర్)ను ముందుకు తీసుకెళ్లటం, స్వదేశీ పరిజ్ఞానం, ఆవిష్కరణల వైపు సాగించే ప్రయత్నాలపై దృష్టి సారిస్తుంది. ఐఓఆర్, ఇండోపసిఫిక్ ప్రాంతంలో అత్యంత ప్రాధాన్యత గల భద్రతా భాగస్వామిగా భారత నౌకాదళాన్ని నిలబెట్టటమే లక్ష్యంగా ఈ సదస్సులో చర్చలు జరుగుతాయి



## మాజీ ఎమ్మెల్సీ సామినేని హిమవంతరావు సేవలు మరువలేనివి

### మంత్రి తుమ్మల నాగేశ్వర్రావు



**ఖమ్మం ,ఏప్రిల్ 12 (ఉదయం బ్యూరో):**

పీ ఆర్.టి. యు వ్యవస్థాపక సభ్యుడు సామినేని హిమవంతరావు ఖమ్మం జిల్లాలో తనదైన ముద్ర వేశారుఉపాధ్యాయుడుగా క్రమశిక్షణకు మారు పేరుతో నిబద్ధత నిజాయితీ గా నిలిచారు.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి బాటలు వేశారు.తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గా ఎన్టీఆర్ గారి ఆశయాలకు అనుగుణంగా పని చేసిన నిజాయితీ గల నాయకుడు ఖమ్మం మార్కెట్ చైర్మన్ గా రైతాంగానికి అండగా నిలిచారు. సామినేని హిమవంతరావు విగ్రహావిష్కరణ చేయడం ఎంతో గౌరవంగా ఉంది.

## కలెక్టరేట్ లో ప్రజావాణి - గిరివాణి కార్యక్రమం




**– జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**ములుగు, ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి) :**

ములుగు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో సోమవారం రోజున ప్రజావాణి గిరివాణి (గిరిజన దర్బార్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఒక ప్రకటన లో తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం ఐటీడీఏ ఏటూరు నాగారం లో నిర్వహించే గిరివాణి (గిరిజన దర్బార్) కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఈనెల 13వ తేదీన కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని గిరిజనులు, గిరిజనేతరులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకొని తమ అర్జీలను సమర్పించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## సమ్మె చేస్తున్న విద్యుత్ కార్మికులు



**ఐదవ రోజు కూడా కొనసాగిన విద్యుత్ కార్మికుల సమ్మె**

**మధిర, ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి )**

విద్యుత్ శాఖలో సుదీర్ఘకాలంగా కనీస వేతనాలు లేకుండా పనిచేస్తున్న సబ్ స్టేషన్ ఆపరేటర్లు,కంప్యూటర్ ఆపరేటర్లు, ఆఫీస్ అసిస్టెంట్లు, వాచ్మెన్లు తదితర విభాగాల్లో పనిచేస్తున్న ఆర్టిజన్స్, అన్మ్యాన్, పీస్ రేట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని చేస్తున్న సమ్మె ఆదివారం ఐదవ రోజుకు చేరింది. మధిర విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయ ప్రాంగణం బయట ఏర్పాటు చేసిన శిబిరంలో విధులను బహిష్కరించి నిరవధిక సమ్మెను కొనసాగించారు. కార్మికులు తమకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.ఈ సందర్భంగా సమ్మెలో పాల్గొంటున్న ఆర్టిజన్స్ అన్మ్యాన్ కార్మికులకు మద్దతుగా విద్యుత్ శాఖలో ప్రధాన ట్రేడ్ యూనియన్లు అయిన 327 యూనియన్ మరియు 1104 యూనియన్ నాయకులు హాజరై సంఘీభావం తెలిపారు.

వారు కార్మికుల న్యాయమైన డిమాండ్లకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఇంటర్ ఫలితాల్లో 'రెజోనెన్స్' విజయదుంధుభి స్టేట్ ర్యాంకులతో విద్యార్థుల హవా



**హనుమకొండ, ఏప్రిల్ 12 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

రాష్ట్రవ్యాప్తంగా విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో వరంగల్ హన్మకొండలోని రెజోనెన్స్ విద్యాసంస్థలు ఘనవిజయం సాధించాయి. విద్యార్థులు స్టేట్ ర్యాంకులతో మెరిసి, సంస్థ ప్రతిష్టను మరోసారి చాటారు.

**ప్రధాన ఫలితాలు,**

ఇంటర్ మొదటి సంవత్సరం (ఎంపీసీ): ముగ్గురు విద్యార్థులు 468/470 మార్కులతో స్టేట్ సెకండ్ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. పొన్నాల వరుణ్ (2638101723) కంపెల్లి తనుశ్రీ (2638105044) దొనికెల సహస్ర (2638102106) ఇంటర్ మొదటి సంవత్సరం (బైపిసి): గుమ్మడవల్లి మహతి 438/440 మార్కులతో టాపర్గా నిలవగా, బంక వైష్ణవి, సఫియా కౌసర్, ధరావత్ లక్ష్మీప్రసన్న అత్యుత్తమ మార్కులు సాధించారు.ఇంటర్ ద్వితీయ సంవత్సరం: ఎంపీసీ విభాగంలో జి. సాయి కీర్తన (995/1000), నార్రోజు హర్షల్ (994), దండె వర్ష (994) అద్భుత ప్రతిభ కనబర్చారు. బైపిసి విభాగంలో గండ్ర శ్రీజ (991), సుఫయా తబస్సుమ్ (989) అత్యుత్తమ మార్కులు సాధించారు.సంస్థ నుండి 11 మంది విద్యార్థులు స్టేట్ థర్డ్ ర్యాంకులు సాధించగా, 63 మంది విద్యార్థులు 465 కంటే ఎక్కువ, 241 మంది విద్యార్థులు 460 కంటే ఎక్కువ మార్కులు సాధించి రికార్డు సృష్టించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో రెజోనెన్స్ చైర్మన్ లెక్కల రాజిరెడ్డి మాట్లాడుతూ..క్రమశిక్షణతో కూడిన బోధన వల్లే విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన జేఈఈ, నీట్ లతో పాటు ఇంటర్ ఫలితాల్లోనూ టాపర్లుగా నిలుస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే పోటీ పరీక్షల్లోనూ ఇదే స్ఫూర్తి ని కొనసాగించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, సీఏఓ లెక్కల రమ్యరాజిరెడ్డి, అకడమిక్ డీన్ బి.ఎస్. గోపాలరావు, వివిధ విభాగాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గత పదేళ్లలో ఒక్క రూపాయి తేలేదు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**అవినీతి, కబ్జాలకు పాల్పడితే సొంత పార్టీ వారైనా ఉపేక్షించేది లేదు. మేయర్ సుధారాణితో కలిసి న్యూ శాయంపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**హనుమకొండ, ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి):**



వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ప్రజా పాలనలో భాగంగా అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం రోజున నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి 31వ డివిజన్ న్యూ శాయంపేట, సుభాష్ వీధిలో సైడ్ డ్రైన్లు, అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ...ప్రతిపక్షాల వైఫల్యం గత పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు వరంగల్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని విమర్శించారు. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులపై ఆ పార్టీలు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.అవినీతిపై ఉక్కుపాదం నగరంలో భూకబ్జాలు, అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా సహించేది లేదని హెచ్చరించారు. తమ పార్టీ పేరు వాడుకుని అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, బాధితులు నేరుగా తనను సంప్రదించాలని కోరారు.ఇందిరమ్మ ఇళ్లు గత ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, కానీ ప్రస్తుత ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని గుర్తు చేశారు.శాయంపేట అభివృద్ధి, గ్రామీణ నేపథ్యం ఉన్న శాయంపేటను మోడల్ ఏరియాగా తీర్చిదిద్దుతామని, ఇప్పటికే ఈ ప్రాంతంలో ఎస్సీ కాలనీలు, రోడ్లు, డ్రైనేజీ పనుల కోసం భారీగా నిధులు కేటాయించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, నాయకులు సత్తు రమేష్, వేణు, ఇంజినీరింగ్ అధికారులు రవి కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## బాలికల ఆరోగ్య భవిష్యత్తుకు రక్షణ కవచం

**హెచ్.పి.వి. వ్యాక్సినేషన్‌లో ఖమ్మం అగ్రగామి**

**హెచ్.పి.వి. టీకా తీసుకొని గర్భాశయ క్యాన్సర్ ను దూరం చేద్దాం**

**సర్వికల్ క్యాన్సర్ నివారణ వాక్సినేషన్ లో ఖమ్మం ముందంజ – ప్రజారోగ్య రంగంలో మైలురాయి**

**ఖమ్మం ,ఏప్రిల్ 12 (ఉదయం బ్యూరో):**



మహిళల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే వ్యాధుల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఒకటి. ఈ వ్యాధి కారణంగా ప్రతి సంవత్సరం అనేక కుటుంబాలు బాధను అనుభవిస్తున్నాయి. హెచ్.పి.వి. వ్యాక్సిన్ అందించడం ద్వారా ఈ ప్రమాదాన్ని ముందుగానే తగ్గించే దిశగా ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చేపట్టిన కార్యక్రమం ప్రజారోగ్య రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. బాలికల ఆరోగ్య రక్షణను ప్రధాన లక్ష్యంగా తీసుకుని అమలు చేస్తున్న ఈ కార్యక్రమం సమాజంలో అవగాహన పెంచడంలో కూడా కీలక పాత్ర పోషిస్తోంది.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమర్థ నాయకత్వం, నిరంతర పర్యవేక్షణతో ఖమ్మం జిల్లాలో హెచ్.పి.వి. వ్యాక్సినేషన్ కార్యక్రమం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ప్రతి అర్హత కలిగిన బాలికను గుర్తించి, వారికి వ్యాక్సిన్ అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయడం, ప్రతి దశలో పర్యవేక్షణ జరగడం వల్ల కార్యక్రమం విజయవంతమైంది. ఈ క్రమంలో ఖమ్మం జిల్లా రాష్ట్రంలోనే "జిల్లా ఫస్ట్"గా నిలిచి ప్రత్యేక గుర్తింపు పొందింది.ఏప్రిల్ 10 నాటి నివేదిక ప్రకారం జిల్లాలో ఇప్పటి వరకు 3,040 మంది బాలికలకు వ్యాక్సిన్ అందించడం ద్వారా లక్ష్య సాధన దిశగా దృఢంగా అడుగులుపడుతున్నాయి. ఒకే రోజులో 33 మంది బాలికలకు వ్యాక్సిన్ అందించడం కూడా ఆరోగ్య శాఖ సిబ్బంది కృషిని ప్రతిబింబిస్తోంది. ప్రతి బాలిక ఆరోగ్య భద్రత కోసం పని చేసిన సమిష్టి కృషి.హెచ్.పి.వి. వైరస్ వల్ల గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ మాత్రమే కాకుండా మరికొన్ని ప్రమాదకర క్యాన్సర్లు కూడా తగ్గుతాయి. ఈ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ ను మాత్రమే కాకుండా అనల్, వజైనల్, గొంతు క్యాన్సర్ వంటి సుమారు ఆరు రకాల క్యాన్సర్లు నుంచి రక్షణ పొందవచ్చు. చిన్న వయస్సు (14లేక 15 ఏళ్లలో)లోనే ఈ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల శరీరంలో బలమైన యాంటీబాడీలు ఏర్పడి దీర్ఘ కాలిక రోగనిరోధక శక్తి లభిస్తుంది. దీని వల్ల భవిష్యత్‌లో క్యాన్సర్ ముప్పును గణనీయంగా తగ్గించవచ్చు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయడంలో ఖమ్మం జిల్లా ఆరోగ్య శాఖ సమర్థవంతంగా పని చేసింది.ప్రపంచవ్యాప్తంగా అనేకమంది బాలికలు ఈ వ్యాక్సిన్ తీసుకున్న నేపథ్యంలో, ఇది పూర్తిగా సురక్షితమైనదని వైద్యపరంగా నిరూపితమైంది. ఈ విశ్వాసాన్ని ప్రజల్లో పెంపొందించడంలో ఖమ్మం జిల్లా ఆరోగ్య సిబ్బంది కీలక పాత్ర పోషించారు. ప్రారంభంలో ఉన్న సందేహాలను తొలగిస్తూ తల్లిదండ్రులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. వ్యాక్సిన్ తీసుకునే ముందు భోజనం చేయడం తప్పనిసరి చేయడం, తల్లిదండ్రుల సమక్షంలోనే వ్యాక్సిన్ ఇవ్వడం వంటి నియమాలను ఖచ్చితంగా అమలు చేస్తున్నారు.ఈ వ్యాక్సిన్ పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉండటం ఒక ముఖ్యమైన అంశం. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రితో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ లలో, 24 గంటల వైద్య కేంద్రాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బాలికలు కూడా ఎటువంటి ఆర్థిక భారం లేకుండా ఈ సేవలను పొందగలుగుతున్నారు. ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది. హెచ్.పి.వి. వ్యాక్సినేషన్ కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికి మాత్రమే కాకుండా సమాజ ఆరోగ్యానికి కూడా ఎంతో ఉపయోగకరమైనది. ఎక్కువ మంది వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల క్యాన్సర్ భారాన్ని తగ్గించి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చు. ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్ తరాలకు రక్షణ కల్పించడం సాధ్యమవుతోంది. ఖమ్మం జిల్లా ఈ దిశగా తీసుకున్న చర్యలు ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. "నివారణ చికిత్స కంటే మిన్న" అనే సూత్రాన్ని ఆచరణలో చూపిస్తూ ఖమ్మం జిల్లా హెచ్.పి.వి. వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయవంతంగా ముందుకు సాగుతోంది. బాలికల ఆరోగ్య భద్రతను ప్రధాన లక్ష్యంగా తీసుకుని చేపట్టిన ఈ కార్యక్రమం ప్రతి కుటుంబానికి నమ్మకాన్ని, భరోసాను అందిస్తోంది. తల్లిదండ్రులు తమ ఆడబిడ్డల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ విజ్ఞప్తి చేస్తోంది.

## నేడు మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు నియోజకవర్గంలో పర్యటన

**జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 12 (వుదయం జిల్లా ప్రతినిధి):**



నేడు ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మంథని నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు మంత్రి క్యాంప్ కార్యాలయం నుండి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు సోమవారం 8 గంటలకు మంథని శ్రీ పాద చౌక్ వద్ద శ్రీపాద రావు వర్ధంతి సందర్భంగా శ్రీపాద రావు విగ్రహం వద్ద పూలమాల వేసి నివాళులు అర్పించనున్నారు అని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారని ఉచిత చల్ల కేంద్రాన్ని ప్రారంభోత్సవం చేయనున్నారు అని పేర్కొన్నారు అదే క్రమంలో ఉదయం 9గంటలకు మంథని మంత్రి క్యాంప్ కార్యాలయంలో శ్రీపాద రావు వర్ధంతి సందర్భంగా ప్రతిమ హాస్పిటల్ వాళ్ళు నిర్వహిస్తున్న బ్లడ్ డొనేషన్ క్యాంపును ప్రారంభోత్సవ చేయనున్నారు అని స్కూల్ పిల్లలకు వర్ధంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు ప్రధానోత్సవం చేయనున్నారు ఉదయం 10 గంటలకు మంథని లక్ష్మీనారాయణ టెంపుల్ వద్ద 13 వార్డు సంబంధించి వార్డు కార్యాలయం ప్రారంభోత్సవం చేయనున్నారు,రావుల చెరువు కట్ట వద్ద శ్రీపాదరావు విగ్రహానికి పూల మాల వేయనున్నారు,టూరిజం నుండి 1 కోటి 98 లక్షలతో రావుల చెరువు కట్ట డెవలప్మెంట్ పనులకు శంకుస్థాపన చేయనున్నారు, ఉదయం 11 గంటలకు మంథని మున్సిపాలిటీ లోని శ్రీపాద కాలనీలోని శ్రీపాద రావు విగ్రహాన్ని ఆవిష్కరణ చేయనున్నారు మధ్యాహ్నం 12 గంటలకు మంథని మున్సిపాలిటీ పరిధిలో ప్రాథమిక వ్యవసాయం మార్కెట్ మంథని లోని వరి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి చేతుల మీదుగా ప్రారంభం చేయనున్నారు మధ్యాహ్నం 1230 నిమిషాలకు ముత్తారం మండలంలో కేశనపల్లి శ్రీపాద రావు విగ్రహం వద్ద పూలమాలవేసి వెంకట లక్ష్మి గార్డెన్ వద్ద శ్రీపాద రావు వర్ధంతి సందర్భంగా ముత్తారం మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు నిర్వహించిన ఉచిత కంటి పరీక్షలు ఆపరేషన్ క్యాంపులకు సంబంధించి ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేసి అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొననున్నారు మధ్యాహ్నం 3 గంటలకు మచ్చుపేట బస్టాండ్ వద్ద శ్రీపాద చలివేంద్రాన్ని ప్రారంభోత్సవం చేయనున్నారు, బేగంపేట గ్రామంలో శ్రీపాద బస్టాండ్ ను ప్రారంభోత్సవం చేయనున్నారు,మధ్యాహ్నం 330 నిమిషాలకు రామగిరి ఐ ఎన్ టి యు సి, ఆఫీస్ వద్ద ఇతర పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరిక కార్యక్రమం పాల్గొననున్నారు సాయంత్రం 4 గంటలకు కమాన్ పూర్ మండలంలోని కమాన్ పూర్ లో శ్రీపాద కప్ ప్రారంభోత్సవం చేయనున్నారు సాయంత్రం 6 గంటలకు మలహర్ రావు మండలం తాడిచర్ల గ్రామంలో శ్రీపాద వర్ధంతి సందర్భంగా నిర్వహించిన శ్రీపాద కప్ విజేతలకు బహుమతి ప్రధానోత్సవం చేయనున్నారు అని ప్రకటనలో వెల్లడించారు.

## ఆపదలో అండగా నిలిచిన కానిస్టేబుల్ దినేష్

**మృతుని కుటుంబానికి రూ.3 వేల ఆర్థిక సహాయం.**

**పరకాల ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి):**



శాయంపేట మండలం పెద్ద కొడపాక గ్రామానికి చెందిన కానిస్టేబుల్ కోగిల దినేష్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. అదే గ్రామానికి చెందిన కోకిల రాజు (జానీ) అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి, ఆదివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా దినేష్ తన వంతుగా రూ.3 వేల ఆర్థిక సహాయం అందజేసి, అంతేకాకుండా, మృతుని పిల్లల చదువుకు భవిష్యత్తులో కూడా సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు.కష్టాల మధ్య నుంచి ఎదిగిన దినేష్, తన స్వగ్రామంలో ఎవరైనా ఆపదలో ఉన్నారంటే ముందుండి సహాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన సేవాభావాన్ని గ్రామస్థులు ప్రశంసిస్తూ "శభాష్ పోలీస్" అంటూ అభినందిస్తున్నారు.

## కాళోజీ కళాక్షేత్రంలో 'అరైవ్ అలైవ్' ప్రారంభం

**పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు**

**హనుమకొండ, ఏప్రిల్ 13 (వుదయం జిల్లా ప్రతినిధి) :**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు "అరైవ్ అలైవ్" కార్యక్రమం సోమవారం ప్రారంభం కానుంది.

హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, హనుమకొండ మరియు వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయ్, డాక్టర్ సత్య శారద, ప్రజాప్రతినిధులు ముఖ్య అతిధులు గా పాల్గొంటారు.ఈ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను డిసిపి సెంట్రల్ జోన్ ధార కవిత, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీలు నరసింహారావు, సత్యనారాయణ తదితర అధికారులు ఆదివారం ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కార్యక్రమం సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.రోడ్డు ప్రమాదాల నివారణ ప్రధాన లక్ష్యంగా ఈ "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ఏప్రిల్ 13 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని వివిధ వర్గాల ప్రజలతో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించి, ప్రమాదాలను తగ్గించడం లక్ష్యంగా అధికారులు తెలిపారు.సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో సర్పంచులు, వార్డు సభ్యులు, కార్పొరేటర్లు, ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు మరియు ఇతర వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొననాలని కోరారు.

## గిరిజన దర్బార్‌కు సమగ్ర ఏర్పాట్లు – అధికారులందరూ హాజరు కావాలి

**ఫిర్యాదులను లిఖితపూర్వకంగా స్వీకరించి తక్షణ పరిష్కారానికి చర్యలు : ఐటిడిఏ పీఓ బి. రాహుల్**

**భద్రాచలం, ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి):**



భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో తేదీ 13042026 సోమవారం నాడు నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటిడిఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ స్పష్టంగా ఆదేశించారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఉదయం 10.30 గంటలకు ఐటిడిఏ సమావేశ మందిరంలో కార్యక్రమం ప్రారంభం కానుండగా, సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరై తమ తమ శాఖలకు సంబంధించిన సమస్యలపై పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించారు. గిరిజన దర్బార్ ద్వారా గిరిజనులకు నేరుగా ప్రభుత్వ సేవలు అందించడం, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వెంటనే పరిష్కార మార్గాలు చూపించడం ముఖ్యఉద్దేశమని తెలిపారు. భూమి హక్కులు, ఆదాయ ధృవపత్రాలు, కుల ధృవపత్రాలు, పింఛన్లు, ఆరోగ్య సేవలు, విద్య, ఉపాధి, గిరిజన సంక్షేమ పథకాల అమలు వంటి అనేక అంశాలపై గిరిజనులు తమ ఫిర్యాదులను లిఖితపూర్వకంగా సమర్పించాలని కోరారు.కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా నమోదు చేసి, సంబంధిత శాఖలకు అప్పగించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకునే విధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు వాటిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని పేర్కొన్నారు. అవసరమైన పత్రాలు, ఆధారాలు వెంట తీసుకురావాలని గిరిజనులకు సూచించారు. ప్రతి శాఖ అధికారి తమ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై సమగ్ర వివరాలు తీసుకుని రావాలని, ప్రజలకు అక్కడికక్కడే స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి శాఖల మధ్య సమన్వయం ఎంతో అవసరమని, అందరూ బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు. దూర ప్రాంతాల నుండి వచ్చే గిరిజనులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన సదుపాయాలు కల్పిస్తున్నామని, కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని ఐటిడిఏ పీఓ బి. రాహుల్ విజ్ఞప్తి చేశారు. ఈ గిరిజన దర్బార్ కార్యక్రమంలో ఐటిడిఏ పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని గిరిజనుల సంక్షేమానికి కట్టుబడి పని చేయాలని ఆయన పునరుద్ఘాటించారు.

## జర్నలిస్టులు విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి

**– జిల్లా పౌర సంబంధాల అధికారి పి. రాజేంద్రప్రసాద్**

**రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సీనియర్ జర్నలిస్టు వీరాంజనేయులు పరామర్శ**

**హెల్మెట్ ధరించడం ప్రాణరక్షణకు మార్గం**

**మహబూబాబాద్, ఏప్రిల్ 12(వుదయం ప్రతినిధి) :**



వార్తల సేకరణ కోసం వెళ్లే క్రమంలో జర్నలిస్టులు ప్రతి ఒక్కరూ రక్షణ చర్యలు పాటించాలని, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మహబూబాబాద్ జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి (డిపిఆర్ఓ) పసునూరి రాజేంద్రప్రసాద్ కోరారు.

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన తొర్రూరు పట్టణానికి చెందిన బిఆర్కె న్యూస్ సీనియర్ జర్నలిస్టు దురుసోజు వీరాంజనేయులును ఆదివారం ఆయన స్వగృహంలో డిపిఆర్ఓ పరామర్శించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు ఆరోగ్య పరిస్థితిని ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అవగాహన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టిజిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్, ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆదేశాల మేరకు జిల్లాలో హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డిపిఆర్ఓ తెలిపారు. మండలాల వారీగా ప్రజల్లో బాధ్యతను పెంపొందించేందుకు యంత్రాంగం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ..ప్రాణ రక్షణ కోసం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు వార్తల కోసం నిరంతరం ప్రయాణాలు చేస్తుంటారని, ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు ఖచ్చితంగా హెల్మెట్, కార్లలో వెళ్లేవారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు.

ప్రస్తుత వేసవి తీవ్రత దృష్ట్యా జర్నలిస్టులు తగిన ఆరోగ్య నియమాలు పాటించాలని, ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్త వహించాలని కోరారు.ఈ పరామర్శ కార్యక్రమంలో జర్నలిస్టులు గిరికత్తుల శ్రీనివాస్ గౌడ్, కొండ సతీష్, పోల్ రాజు, బజ్జూరి వాసు, కందికొండ కుమార్, పి.బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వర్ణగిరిలో గిరి ప్రదక్షిణ

**భక్తుల సౌకర్యార్థం దేవాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు**

**ఘనంగా స్వర్ణగిరిషుని దివ్య విమాన రథోత్సవం**

**యాదాద్రి భువనగిరి / ఏప్రిల్ వుదయం జిల్లా ప్రతినిధి :**



తెలంగాణ ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన యాదాద్రి తిరుమల స్వర్ణగిరి దేవస్థానంలో ఆదివారం రోజు శ్రవణా నక్షత్రం వెంకటేశ్వర స్వామి వారి జన్మ



నక్షత్రాన్ని పురస్కరించుకొని ఉదయం 6 గంటల 30 నిమిషాలకు స్వర్ణగిరి క్షేత్రంలోని స్వామివారి పాదాల వద్ద ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు, చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ గోపి కృష్ణల ఆదేశాల మేరకు గిరి ప్రదక్షణ యొక్క విశిష్టతను విచ్చేసిన భక్తులకు వివరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి సుమారు 250 మంది భక్తులు పాల్గొని స్వామివారి గోవింద నామాలను స్మరిస్తూ గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకోని దివ్యానుభూతిని పొందారు. సాయంత్రం 6:30 నిమిషాలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య విమాన రథోత్సవానికి ఆలయ ఈవో అమర్నాథ్, ఆలయ సిపిఆర్ఓ సాయిబాబా, సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాస్ కొబ్బరి కాయలు కొట్టి రథోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి రథాన్ని లాగి మహతానందాన్ని పొంది ఆనంద పరవశులయ్యారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గిరి ప్రదక్షణ చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మంచి నీరు, మజ్జిగను పంపిణీ చేశారు. అలాగే వచ్చేది వేసవికాలం దృశ భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో చలువ పందిర్లను ఏర్పాటు చేయడంతో పాటు చంటిపిల్ల తల్లులకు ఫీడింగ్ రూమ్స్, ఆలయ ప్రాంగణం చుట్టూ భక్తులకు కాళ్ల మంటలు రాకుండా చల్లగా ఉండే విధంగా పెయింట్ ను ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# విలేకరి ముసుగులో వసూళ్లు

**కత్తితో బెదిరించి ఫోన్ పే ద్వారా నగదు వసూలు**
**వేములవాడలో నకిలీ జర్నలిస్టు రిమాండ్**
**బాధితులను బెదిరిస్తే కఠిన చర్యలు తప్పవు**
**వేములవాడ టౌన్ సీఐ వీర ప్రసాద్ హెచ్చరిక**




**వేములవాడ, వుదయం ప్రతినిధి:** విలేకరుల ముసుగు లో కొంత మంది నకిలీ జర్నలిస్టు లు వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారు.తాజా గా వేములవాడ పట్టణం లోని ఓ సూపర్ మార్కెట్ యజమానిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన నిందితుడిని వేములవాడ టౌన్ పోలీసులు ఆది వారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు వేములవాడ టౌన్ సీఐ బి. వీర ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేటకు చెందిన గోడిశేల మహేష్ అనే వ్యక్తి జర్నలిస్టుగా పరిచయం చేసుకుని, సూపర్ మార్కెట్ యజమానిని భయభ్రాంతులకు గురిచేశాడు. అధికారులతో తనిఖీలు చేయిస్తానని, పత్రికల్లో వ్యతిరేక వార్తలు రాస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. కత్తితో ప్రాణహాని తలపెడతానని హెచ్చరించి బాధితుడి నుండి ఫోన్ పే ద్వారా రూ. 42,000 వసూలు చేశాడు. నిందితుడు మళ్లీ డబ్బుల కోసం వేధిస్తుండటంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.ఎస్ఐ రామ్మోహన్, కానిస్టేబుల్ గోపాల్ దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేసి సాక్ష్యాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా మీడియా ముసుగు , అధికారుల పేరుతో బెదిరింపులకు పాల్పడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిందితుడు మహేష్ చేతిలో మరెవరైనా మోసపోయి ఉంటే స్టేషన్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

# బాలికలదే పై చేయి.. ఇంటర్ 66.19 ఉత్తీర్ణత..

**నిజామాబాద్, వుదయం ప్రతినిధి:** 202526 విద్యా సంవత్సరానికి గాను నిజామాబాద్ జిల్లాలో ఫిబ్రవరి మార్చి నెలలో నిర్వహించిన వార్షిక పరీక్షలలో జనరల్ విభాగంలో రెండవ సంవత్సరం విద్యార్థులు 66.19% ఉత్తీర్ణత సాధించారు. కాగా మొదటి సంవత్సరం విద్యార్థులు 56.64% ఉత్తీర్తో సాధించారు. అలాగే జిల్లాలో ఒకేషనల్ విభాగంలో రెండవ సంవత్సరంలో 67.68% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ మొదటి సంవత్సరం లో 49.65% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో ఫిబ్రవరి, మార్చ్ నెలలో నిర్వహించిన ఇంటర్ వార్షిక పరీక్షలలో మొత్తం రెండవ సంవత్సరం జనరల్ విద్యార్థులు మొత్తం 13,876 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 9,187 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలికలు 7,606 మంది పరీక్షలకు హాజరుకాగా 5,823 మంది బాలికలు ఉత్తీర్ణత కాగా 76.56% శాతం తో బాలుర పై చేయి సాధించారు.రెండవ సంవత్సరం బాలురు 6 ,273 మంది విద్యార్థులు హాజరు కాగా వీరిలో 3,364 మంది విద్యార్థులు పాసై 53.63% సాధించారు. మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో మొత్తం విద్యార్థులు 15,547 మంది పరీక్షలకు హాజరు కాగా 8,806 మంది విద్యార్థులు పాస్ కాగా 56.64% సాధించారు. వీరిలో బాలికలు 8,711 మంది పరీక్షలకు హాజరుకాగా వీరిలో 5,868 మంది బాలికలు ఉత్తీర్ణులై 67.36% పాస్ సాధించారు. అలాగే మొదటి సంవత్సరం జనరల్ బాలురు 6,836 మంది పరీక్షలకు హాజరు కాగా వీరిలో 2,938 మంది ఉత్తీర్ణులై 42.98% పాస్ సాధించారు.

**ఒకేషనల్ విభాగం....**

జిల్లాలో ఒకేషనల్ విభాగంలో మొత్తం రెండవ సంవత్సరం విద్యార్థులు 2,345 మంది పరీక్షలకు హాజరు కాగా వీరిలో 1,587 మంది విద్యార్థులు పాసై 67.68% ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలికలు 1,002 పరీక్షలకు హాజరు కాగా, 843 మంది బాలికలు పాసై 84.13% సాధించారు. అలాగే బాలురూ 1,343 మంది పరీక్షలకు హాజరు కాగా వీరిలో 744 మంది ఉత్తీర్ణులై 55.40% సాధించారు. ఒకేషనల్ మొదటి సంవత్సరం విద్యార్థులు మొత్తం 2,562 మంది పరీక్షలకు హాజరు కాగా వీరిలో 1,272 మంది విద్యార్థులు పాసై 49.69% సాధించారు. వీరిలో బాలికలు 1,096 మంది పరీక్షలకు హాజరు కాగా 789 మంది పాసై 71.99% సాధించారు. అలాగే బాలురు 1,466 మంది పరీక్షలకు హాజరుకాగా 4 183 మంది బాలురు పాసై 32.95% సాధించారు.

**గత సంవత్సరం కన్నా పెరిగిన ఉత్తీర్ణత శాతం....**

2024_25 విద్యా సంవత్సరంలో రెండవ సంవత్సరం లో 58.21% ఉత్తీర్ణత సాధించగా 2025_26 విద్యా సంవత్సరంలో 66.19% ఉత్తీర్ణత సాధించారు. అలాగే మొదటి సంవత్సరంలో 2024_25 విద్యా సంవత్సరంలో 53.37శాతం ఉత్తీర్ణత సాధించగా 2025_26 విద్యా సంవత్సరంలో 56.64% ఉత్తీర్ణత సాధించారు.

## రాష్ట్రస్థాయి మార్కులతో..

# క్షత్రియ విద్యార్థుల ప్రభంజనం




**ఆర్మూర్, (వుదయం ప్రతినిధి )** ఇంటర్ ఫలితాలలో రాష్ట్ర స్థాయి మార్కులతో క్షత్రియ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనిపించారు ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ గ్రూప్ నందు ఎస్ నిర్ణయ శ్రీ 1000 మార్కులకు గాను 994, ఏ వైష్ణవి 990 ఎస్ రిషిక 990, బైపీసీ విభాగంలో మసియా ఫాతిమా 987 సిహెచ్ సంతోషిని 985 మరియు సి ఈ సి లో తనిష్క కుమారి 986 మార్కులు సాధించారు...

అదేవిధంగా ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 469 మార్కులు సాధించి రాష్ట్రంలో మొదటి స్థానం మార్కులు సాధించారు. అభినయ 465 సానియా 465 సుమయ్య మహావిశ్ 465 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో అబ్దుల్ ముదస్సిర్ 436 నిస్సి 436 ఈ ప్రాణం 436 కే అనిష్ 435 మరియు కె శ్రీ వల్లి 435 మార్కులు సాధించారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం సిఈసి విభాగంలో 500 మార్కులకు గాను కే ఇలిషా రాణి 485 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారి తల్లిదండ్రులను సన్మానించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ సెక్రెటరీ అల్జాపూర్ దేవేందర్ వైస్ చైర్మన్ అల్జాపూర్ లక్ష్మీనారాయణ కోశాధికారి గంగాధర్ డైరెక్టర్ వీరేంద్ర ప్రిన్సిపల్ ఎస్ నాగేశ్వరరావు మరియు అధ్యాపక బృందం పాల్గొని విద్యార్థులను అభినందించడం జరిగింది.

# ఇంటర్ ఫలితాల్లో ట్రినిటీ ప్రభంజనం




**పెద్దపల్లి (వుదయం ప్రతినిధి)** నేడు విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ట్రినిటీ గ్రూప్ ఆఫ్ కాలేజెస్ (పెద్దపల్లి, కరీంనగర్) విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా ట్రినిటీ గ్రూప్ ఆఫ్ కాలేజెస్ వ్యవస్థాపకులు, పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు శ్రీ దాసరి మనోహర్ రెడ్డి గారు స్టేట్ టాపర్స్ మరియు జిల్లా టాపర్స్ గా నిలిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు.దాసరి మనోహర్ రెడ్డి గారు మాట్లాడుతూ,"ట్రినిటీ కాలేజీలలో చదువుకున్న విద్యార్థులు ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా అద్భుతమైన ఫలితాలు సాధించడం చాలా ఆనందంగా ఉంది. ట్రినిటీ పేరు రాష్ట్రస్థాయిలో నిలబెట్టిన విద్యార్థులకు, వారికి సహకరించిన తల్లిదండ్రులకు మరియు అధ్యాపకులకు హృదయపూర్వక అభినందనలు" అని తెలిపారు. ఫలితాల ముఖ్యాంశాలు:

MPCలో గరిష్టంగా 468 మార్కులు
BiPCలో గరిష్టంగా 438 మార్కులు
CECలో గరిష్టంగా 495 మార్కులు
MPCలో 466 మార్కులు సాధించిన వారు - 46 మందిసీనియర్ MPCలో గరిష్టంగా 996 మార్కులు450 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారు990 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఈ ఫలితాలు ట్రినిటీ గ్రూప్ ఆఫ్ కాలేజెస్ విద్యా ప్రమాణాలు మరియు నాణ్యతను మరోసారి నిరూపించాయని యాజమాన్యం తెలిపింది.

# ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు

**రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



**కరీంనగర్ (వుదయం ప్రతినిధి):** రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలనీ, గ్రామ గ్రామానా పెద్ద ఎత్తున ఈ పంటను సాగు చేయాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆయిల్ ఫామ్ పంట పండించడం ద్వారా రైతులు అధిక లాభాలు సాధించవచ్చని ఈ విషయంలో తను గ్యారంటీ ఇస్తానని స్పష్టం చేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రాయితీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను మంత్రి రైతులకు పంపిణీ చేశారు. 24 మంది రైతులకు 40.80 లక్షల రూపాయల విలువైన అధునాతన వ్యవసాయ పనిముట్లను అందజేశారు. 15 రోటావేటర్లు, బెయిలర్లు, పవర్ స్ప్రేయర్లు, తదితర పరికరాలు ఇందులో ఉన్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ చిన్న గ్రామంలో 50 ఎకరాలు పెద్ద గ్రామంలో 100 ఎకరాలు ఆయిల్ ఫామ్ సాగును చేపట్టాలని సూచించారు. పెద్ద ఎత్తున ఈ పంటను సాగు చేయడం వల్ల మంచి లాభాలు పొందవచ్చని అంతర పంటలు కూడా వేసుకోవచ్చని తెలిపారు. అత్యధికంగా ఈ పంటను సాగు చేసే గ్రామాలను మరింత పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామని చెప్పారు. నంగునూరు మండలం నర్మెట్టలో ఆయిల్ ఫ్యాక్టరీని ఇటీవల ప్రారంభించుకున్నామని అక్కడ కొనుగోలు చేపడతారని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగులో అశ్వరావుపేట ఆదర్శంగా నిలుస్తున్నదని తెలిపారు. వ్యవసాయ పనిముట్లు అవసరం ఉన్న రైతులు వ్యవసాయ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారుల ద్వారా ప్రతిపాదనలు వచ్చిన వెంటనే అదనంగా పరికరాలు మంజూరు చేయించి రైతులకు అందిస్తామని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ తరుపున చాలా సంవత్సరాల తరువాత ప్రజా ప్రభుత్వంలో పనిముట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గడ్డి మోపులు కట్టే బేయిలర్లు ఎక్కువగా అవసరం ఉన్నాయని చెబుతున్నారు. వాటిని ఇప్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, ఎక్కడా ఇబ్బందులు లేవని చెప్పారు. తాను కూడా ఆయిల్ ఫామ్ పంటను చేసేందుకు వ్యవసాయ భూమిని చూస్తున్నానని తెలిపారు. అనుకూలంగా దొరుకుతే పంటను సాగు చేస్తానని పేర్కొన్నారు. 5 ఎకరాల పైన ఉన్న వారు ఆయిల్ ఫాం సాగు చేయాలనీ కోరారు. ఆయిల్ ఫాం సాగు వల ప్రకృతి ఇబ్బందులు, కోతుల సమస్యతో పాటు ఏ ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. దానిపై నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ విజిట్ చేయాలని సూచించారు. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా సాగునీటి కాలువల నిర్మాణానికి అందరూ సహకరించాలని పేర్కొన్నారు. ఇటీవల గౌరవెల్లి ప్రాజెక్ట్ పై సమావేశం జరిగిందనీ త్వరలోనే కాలువల పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే పేమెంట్ ఇప్పిస్తామని అందరూ కాలువల నిర్మాణానికి అవసరమైన భూములు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.. అదేవిధంగా కొత్తపెల్లి నుంచి హుస్నాబాద్ కు ఫోర్ లైన్ రోడ్ నిర్మాణ పనులకు అందరూ సహకరించాలని కోరారు. కళ్యాణ లక్ష్మి చెక్కులు ఆలస్యం చేయకుండా వెంటవెంటనే అందిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, ఆర్డీఓ కే.మహేశ్వర్ సర్పంచ్ ఆకవరం భవానీ, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి తహసిల్దార్ రమేష్, ఎంపీడీవో విజయ్ కుమార్, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొప్పుల ఆరోపణలు అర్థరహితం



**ధర్మపురి, (వు దయం ప్రతినిధి ):** రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేసిన విమర్శలు అర్థరహితమని ధర్మపురి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఆదివారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్,నిశాంత్ రెడ్డి, శైలేందర్ రెడ్డి తదితరులు మాట్లా డారు.పదేళ్ల పాటు మంత్రిగా ఉండి ధర్మపురి పట్టణానికి తలా పునే గోదావరి ఉన్నా, ప్రజలకు గుక్కెడు మంచినీళ్లు ఇవ్వలేని అసమర్థ నేత కొప్పుల అని వారు ఎద్దేవా చేశా రు.మంత్రి అడ్లూరి బాధ్యతలు చేపట్టిన రెండు ఏళ్ల లోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొ న్నారు.రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మా ణం,మూతపడిన సంస్కృ తాంధ్ర కళాశాల పునరుద్ధరణ, కొత్తగా డిగ్రీ కళాశాల ఏర్పాటు. అమృత్ పథకం కింద రూ. 22 కోట్లతో మంచినీటి ట్యాంక్,రూ. 2 కోట్లతో బోర్ వెల్స్. పట్టణ అభివృద్ధి కోసం టీయూఎఫ్ఐడి ద్వారా రూ. 15 కోట్ల పనులు పూర్తి, మురుగునీటి శుద్ధి కోసం రూ. 7 కోట్లతో సీవరేజ్ ప్లాంట్.ఇందిరమ్మ పథకం ద్వారా 3,500 ఇళ్ల మంజూరు, కుల సంఘాల భవనాలకు రూ. 2 కోట్లు. మంత్రి అడ్లూరి పనితీరుకు నిదర్శనం ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 70 శాతం స్థానాలు కైవసం చేసుకోవడమే నని వారు గుర్తు చేశారు. భయంతోనే కొప్పు ల ఈశ్వర్ అసత్య ప్రచారాలు చేస్తున్నా రని, కొప్పుల 10 ఏళ్ల పాలన అడ్లూరి 2 ఏళ్ల పాలనపై చర్చకు తాము సిద్ధమని సవాల్ విసిరారు. నాగారం సర్పంచ్ చిలుముల లక్ష్మణ్, ధర్మపురి మండల పార్టీ ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, పట్టణ అధ్యక్షులు చీపురిశెట్టి రాజేష్, వెల్గటూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి,జె.సుముఖ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నాగిరెడ్డిపేట్ మోడల్ జూనియర్

# కళాశాల విద్యార్థుల ప్రతిభ

**నాగిరెడ్డిపేట్,వుదయం** ఇంటర్మీడియట్ ఫలితాలలో నాగిరెడ్డిపేట్ మండలంలోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి మార్కులు సాధించారు. ఆదివారం ఇంటర్మీడియట్ బోర్డ్ ప్రకటించిన ఫలితాలలో నాగిరెడ్డిపేట్ మోడల్ స్కూల్ కళాశాల ఫస్ట్ ఇయర్ ఎంపీసీ కుమారి కావ్య 438/470, కొంసాని సాత్విక్ రెడ్డి 416/470, బైపిసి వడ్ల జగదీశ్వర్ 380/470, చాకలి హన్సిక 360/440, సిఈసి వికాసిని 372/500, దివ్య 363/500, ఎంఈసి శ్రావణి 480/500, హరి చరణ్య న 410/500, ఇంటర్మీడియట్ సెకండియర్ ఎంపీసీ కాత్రోత్ హారిక 970/1000,చిన్నమీదికుంది భవాని 896/1000, బైపీసీ నాగంపల్లి సంగీత 878/1000,గిరిజేష్ దీక్షిత858/1000,సిఈసి మహమ్మద్ ఇలియాస్ 716/1000,కొండారి రాఘవేంద్ర 699/1000 వీరితో పాటు చాలామంది విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ రాంప్రసాద్ అభినందనలు తెలియజేశారు. ఇంతటి ప్రతిభ కనబరచడానికి దోహదం చేసినటువంటి కళాశాల అధ్యాపకులకు,విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. నాగిరెడ్డిపేట్ మండలం మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మొత్తం 126 అప్పియరెన్స్ 56 పాస్డ్,44 శాతం పర్సంటేజ్ రాగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 66 అప్పియరెన్స్,50 పాస్డ్,75.75/ శాతం పర్సంటేజ్ వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ రాంప్రసాద్ తెలిపారు.




# రాష్ట్రస్థాయిలో దీక్ష విద్యార్థుల ప్రతిభ



**నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి)** ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని దీక్ష జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు అని కళాశాల ప్రిన్సిపాల్ చిన్నాడి వెంకట్ రెడ్డి తెలిపారు. కళాశాలను ప్రారంభించినప్పటి నుంచి ప్రతి ఏటా వస్తున్న అద్భుత ఫలితాల పరంపరను కొనసాగిస్తుంది. ఈ క్రమంలోనె ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లాకు ఖ్యాతిని తీసుకొచ్చారు. మొదటి సంవత్సరం బైపిసి విభాగంలో మరియా మహిన్ 439, పెలియ మీనాక్షి శేషాద్రి 438, ఠాకూర్ లోకేష్ సింగ్ 435, ఐయేషా సిద్దికా 429, మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో హజ్రఖానం 464, జి తేజస్విని 463, బి సాయికిరణ్ 462, మహీన్ తస్కిన్ 462, ఈ. హరిణి 460, మొదటి సంవత్సరం ఎం ఈ సి విభాగంలో గుమ్మిడియాల సాయి జాహ్నవి 492, సిసివి భాగంలో సయ్యద్ తుబా మహీన్ 492, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో గాడే శ్రీ నిత్య 988, ఎం రుచిత 988, మహినూర్ పిర్దోస్ 985, బైపీసీలో సమీహ సదాఫ్ 982, తోకల దీపిక 977, సీఈసీ లో ఎం రిమ్ జిమ్ 955, ఎం ఈ సి లో సమీహ సదాఫ్ 982, తోకల దీపిక 977 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల యజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రమోద్ రావు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## రెబ్బెనలో గ్రంథాలయం, ఆసిఫాబాద్ లో

# హెల్మెట్ చౌక్ ప్రారంభించిన డిజిపి శశిధర్ రెడ్డి





**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆదివారం రోజున తెలంగాణ రాష్ట్ర డిజిపి బి. శశిధర్ రెడ్డి పర్యటించారు. జిల్లాలోని రెబ్బెన మండలంలో పాత పోలీస్ స్టేషన్ పోటీ పరీక్షల అభ్యర్థుల కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని డిజిపి శశిధర్ రెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉద్యోగం పోటీ పరీక్షల్లో విజయాన్ని సాధించేందుకు అవసరమైన వనరులు అందించడం లక్ష్యంగా గ్రంథాలయం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు.జిల్లా కేంద్రంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు అలివ్ అలివ్ కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హెల్మెట్ చౌక్ ను డిజిపి శశిధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంచేందుకు ఈ హెల్మెట్ చౌక్ ఒక ప్రతీకగా నిలుస్తుందని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తమ భద్రతకు అత్యవసరమని అన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించడం ద్వారా మన ప్రాణాలను మాత్రమే కాకుండా ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చని అన్నారు. హెల్మెట్ వినియోగం ప్రాణ రక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితికా పంత్, ఆసిఫాబాద్ ఎఎస్పీ చిత్తరంజన్ మరియు రెబ్బెన సీఐ సంజయ్, ఎస్ ఐ వెంకటకృష్ణ ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఇంటర్ ఫలితాల్లో..

# మగ్గిడి మోడల్ స్కూల్ ప్రభంజనం

**ధర్మపురి, (వుదయం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు ఆదివారం విడుదల చేసిన ఫలితాల్లో మండల కేంద్రంలోని మగ్గిడి తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ద్వితీయ సంవత్స రంలో దాదాపు వంద శాతం ఉత్తీర్ణత సాధించి కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారు.ద్వితీయ సంవత్సరంలో 99.28 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో మొత్తం 140 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, ఏకంగా 139 మంది ఉత్తీర్ణులయ్యారు. తద్వారా 99.28 శాతం ఫలితాలు సాధించి రికార్డు సృష్టించారు. ప్రథమ సంవత్సరంలో 104 మంది విద్యార్థు లకు గాను 89 మంది ఉత్తీర్ణులై 85.57 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.వివిధ విభాగా ల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు ఇంటర్ ద్వితీ య సంవత్సరం ఎంపిసి వి. వైష్ణవి974, బైపిసి జి.కీర్తన 966,సీఈసి పి.స్పంద న 923,ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపిసి జి. వైష్ణవి 461,బైపిసి ఎస్. శ్రీవిద్య 388,సీఈసీ పి.వైష్ణవి 451 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల ను, వారికి దిశానిర్దేశం చేసిన అధ్యాపక బృందాన్ని కళాశాల ప్రిన్సిపాల్ వై. మహేష్ ప్రత్యేకంగా అభినందించారు. క్రమశిక్షణతో కూడిన చదువు, ప్రణాళికాబ ద్ధమైన కృషితోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదం డ్రులు కూడా తమ పిల్లల ప్రతిభ పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# స్టేట్ సెకండ్ ర్యాంకర్ గా లేఖశ్రీ

- ఇంటర్ ఫలితాల్లో దీక్ష జూనియర్ కళాశాల ప్రభంజనం
- విద్యార్థులను అభినందించిన కళాశాల యాజమాన్యం
- -హర్షం వ్యక్తం చేసిన ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి, మధుసూదన్ రెడ్డి










**సిద్దిపేట , ఏప్రిల్ 12 ( వు దయం ప్రతినిధి):**

ఆదివారం వెలువడిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో సిద్దిపేట జిల్లాలోని దీక్ష జూనియర్ కళాశాల ప్రభంజనం సృష్టించినట్లు ప్రిన్సిపాల్స్ బ్రహ్మానందరెడ్డి, మధుసూదన్ రెడ్డి తెలిపారు.ఈ మేరకు కళాశాలలో పత్రిక విలేకర్లతో వారు మాట్లాడారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో లేఖ శ్రీ 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించి స్టేట్ రెండవ ర్యాంక్ సాధించగా మరో 75 మంది విద్యార్థులు 400 మార్కులు సాధించి వారి ప్రతిభను చాటారన్నారు. జూనియర్ బైపీసి విభాగంలో గోనేపల్లి శ్రీజ 440 మార్కులకు గానూ 436 మార్కులు సాధించింది. అదే విభాగంలో 15 మంది పైగా 434 నుండి మొదలుకొని 421 మార్కులు సాదించారని పేర్కొన్నారు.

ఇక సీనియర్ ఎంపీసీ విభాగంలో లింగంపల్లి శిరీష 1000 మార్కులకు గానూ 992 మార్కులు సాధించింది. ఆమెతో పాటు మరో 10 మంది విద్యార్థులు మంచి మార్కులు

సాధించారని తెలిపారు. సీనియర్ బైపీసి విభాగంలో కోర్మాణి భవాని 1000 మార్కులకు గానూ 984 మార్కులు సాధించడంతో పాటు మరో 8 మంది విద్యార్థులు చక్కటి ఫలితాలు సాధించి జిల్లాలో అగ్రగామిగా నిలిచినట్లు పేర్కొన్నారు. తమ కళాశాలలో చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం తరుపున శుభాకాంక్షలు తెలియజేశారు.

# ముంగిట్లోకి వైద్యం

## గోవిందపూర్‌లో పల్లె దవాఖానకు భూమి పూజ

- * 20 లక్షల రూపాయలతో ఆధునిక హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణం ప్రారంభం
- * పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం
- * సర్పంచ్ ఉప్పల దాస్

**దుబ్బాక , ఏప్రిల్ 12 (వుదయం)**





గోవిందపూర్ గ్రామ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు నిర్మించనున్న హెల్త్ సబ్ సెంటర్ (పల్లె దవాఖాన) భవనానికి గ్రామ సర్పంచ్ ఉప్పల దాస్ భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా విలేకరులతో

నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ ఉప్పల దాస్ మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పల్లె దవాఖానలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, చిన్న ఆరోగ్య సమస్యలకే పెద్ద ఆసుపత్రులకు వెళ్లే అవసరం లేకుండా ఈ కేంద్రాలు సహాయపడతాయని ఆయన పేర్కొన్నారు.అలాగే కొంతమంది బ్రోకర్లు స్వార్థ ప్రయోజనాల కోసం అమాయక ప్రజలను ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి, చిన్న సమస్యలకే భారీ బిల్లులు వసూలు చేయిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు అలాంటి పరిస్థితులకు లోనుకాకుండా, స్థానిక ప్రభుత్వ వైద్య కేంద్రాలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.గోవిందపూర్‌లో నిర్మించనున్న ఈ హెల్త్ సబ్ సెంటర్‌ను సుమారు 20 లక్షల రూపాయల వ్యయంతో ఆధునిక టెక్నాలజీతో నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కేంద్రం ద్వారా గ్రామ ప్రజలకు ఉచిత పరీక్షలు, అవసరమైన మందులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పి. రాజు, గ్రామ పెద్దలు ఎం. మల్లేష్, జి. ప్రభాకర్, జి. చంద్ర మౌళి, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపిని బూత్ స్థాయి నుండి పటిష్టం చేయాలి



- రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురావ్ నామాజీ

**నారాయణపేట టౌన్ ఏప్రిల్ 12(వుదయం ప్రతినిధి)**

బిజెపిని బూత్ స్థాయి నుండి పటిష్టం చేయాలని బిజెపి రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ అన్నారు.కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయి ప్రజలకు అందేలా పని చేసి రాష్ట్రంలో బిజెపి అధికారమే లక్ష్యంగా పని చేయాలని

పిలుపు నిచ్చారు.నారాయణపేట జిల్లా కేంద్రంలో పండిత్ దిన్ దయాళ్ ఉపాధ్యాయ మహా ప్రశిక్షణ అభియాన్ 2026 నా రెండు రోజుల కార్యశాల సమావేశం

జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్ గారి ఆధ్వర్యంలో సరస్వతి శిశు మందిర్ లో నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు పగడకుల శ్రీనివాస్, ముఖ్య వక్తలు, మున్సిపల్ చైర్మన్ శ్వేతా యాదవ్ , వైస్ చైర్మన్ మంజులా జి ఆర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి , పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు, సర్పంచ్, ఉపసర్పంచ్, రాష్ట్ర, జిల్లా, నాయకులు, బూత్ అధ్యక్షులు,

ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో గజ్వేల్ 'గర్ల్స్ హబ్' జోరు

- ఫస్ట్ ఇయర్ 74%, సెకండ్ ఇయర్ 76 శాతం ఉత్తీర్ణత
- సత్తా చాటిన స్పందన, ఆకాంక్ష
- విద్యార్థినులను అభినందించిన ప్రిన్సిపల్ జ్యోతిర్మయి

**గజ్వేల్, ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి)**




సిద్దిపేట జిల్లా గజ్వేల్ గర్ల్స్ ఎడ్యుకేషన్ హబ్ లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి తమ సత్తా చాటారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో కళాశాల ఓవరాల్‌గా 75 శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డు సృష్టించింది. కళాశాల నుంచి పరీక్షలు రాసిన విద్యార్థినులలో ప్రథమ సంవత్సరంలో 74 శాతం, ద్వితీయ సంవత్సరంలో 76 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ముఖ్యంగా సీఈసీ (CEC) విభాగంలో విద్యార్థినులు అత్యుత్తమ మార్కులు సాధించి కళాశాల పేరును నిలబెట్టారు.

**ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు:**

మర్కుక్ స్పందన (CEC ద్వితీయ సంవత్సరం): 1000 మార్కులకు గాను 936 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది.నీరడి ఆకాంక్ష (CEC ప్రథమ సంవత్సరం): 500 మార్కులకు గాను 461 మార్కులతో ప్రతిభ చాటింది.

వీరితో పాటు మెజారిటీ విద్యార్థినులు అత్యుత్తమ గ్రేడ్లతో పాస్ కావడంతో గర్ల్స్ హబ్‌లో పండగ వాతావరణం నెలకొంది. తమ బిడ్డల విజయంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జ్యోతిర్మయి మాట్లాడుతూ.. విద్యార్థినుల కృషితో పాటు అధ్యాపకుల నిరంతర పర్యవేక్షణ వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని అన్నారు. గర్ల్స్ ఎడ్యుకేషన్ హబ్ లో బాలికలకు అత్యుత్తమ విద్యను అందించడమే లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామని ఆమె పేర్కొన్నారు. విజేతలను ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించింది.

# డైరీ ఫామ్‌లో రాణిస్తున్న యువ రైతు ఇట్టిరెడ్డి మహేశ్వర్ రెడ్డి

**కోహెడ ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి)**

గ్రామీణ ప్రాంతంలో రైతు వృత్తికి కొత్త అర్థం చెబుతున్న సిద్దిపేట జిల్లా కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామానికి చెందిన యువ రైతు ఇట్టిరెడ్డి మహేశ్వర్ రెడ్డి, తన డైరీ ఫార్మ్ ద్వారా ఆదర్శంగా నిలుస్తున్నారు. వ్యవసాయం పట్ల ఆసక్తితో పాటు ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ, పశుసంవర్ధక రంగంలో విజయవంతంగా ముందుకు సాగుతున్నారు . సాంప్రదాయ వ్యవసాయంతో పాటు డైరీ ఫార్మింగ్‌ను చేపట్టిన మహేశ్వర్ రెడ్డి, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే విధంగా ప్రణాళిక రూపొందించారు. గోవుల సంరక్షణలో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తూ, మంచి నాణ్యత గల పాలు ఉత్పత్తి చేస్తున్నారు. రోజుకు లీటర్ల కొద్దీ పాలను ఉత్పత్తి చేసి సమీప మార్కెట్లకు సరఫరా చేస్తూ స్థిరమైన ఆదాయం సంపాదిస్తున్నారు.పశువులకు పోషకాహారం, పరిశుభ్రత, సమయానికి వైద్య పరీక్షలు వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపడం వల్ల ఆయన ఫార్మ్‌లో ఉత్పత్తి పెరిగింది. యువత వ్యవసాయం వైపు రావాలని సూచిస్తూ, డైరీ ఫార్మింగ్‌లో మంచి అవకాశాలు ఉన్నాయని ఆయన చెబుతున్నారు."ఉద్యోగాల కోసం తిరగడం కంటే స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది" అని మహేశ్వర్ రెడ్డి యువతకు సందేశం ఇస్తున్నారు.

ఇలా గ్రామంలోనే ఉండి స్వయం ఉపాధితో ఎదిగిన ఇట్టిరెడ్డి మహేశ్వర్ రెడ్డి, ఇతర రైతులకు కూడా ప్రేరణగా నిలుస్తున్నారు.



# ఆలయాలే ఆధ్యాత్మిక కేంద్రాలు

- నూతన దేవాలయం నిర్మాణానికి సంపూర్ణ సహకారం
- పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

**అమీన్పూర్ , ఏప్రిల్ 12 ( వు దయం ప్రతినిధి):**

ఆలయాలు మనసుకు శాంతి, ఆత్మకు ఆహ్లాదం, జీవనానికి దారి చూపే ప్రదేశాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని నవ్య రోడ్డులో శ్రీ అష్టలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ ఆలయ నిర్మాణ పనులకు ఆదివారం ఉదయం వేద పండితుల సమక్షంలో నిర్వహించిన భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాలు మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. నూతన దేవాలయం నిర్మాణానికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, సీనియర్ నాయకులు గోపాల్, ఉపేందర్ రెడ్డి, బాలరాజు, రాములు, దాసు, రుశ్వంత్ రెడ్డి, ఆలయ కమిటీ

సభ్యులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ ఫలితాల్లో

# సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాల సత్తా

**సంగారెడ్డి, ఏప్రిల్ 12 ( వు దయం ప్రతినిధి):**





శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచి అద్భుత విజయాలు సాధించారు.ఎంపీసీ ప్రథమ సంవత్సరం:470 మార్కులకు గాను డి. శృతి 467 మార్కులతో ప్రథమ స్థానం సాధించింది. కే. విద్యార్థి 465 మార్కులతో ద్వితీయ స్థానం, పి. విద్యార్థి 464 మార్కులతో తృతీయ స్థానం దక్కించుకున్నారు.ఎంపీసీ ద్వితీయ సంవత్సరం:కే. నిఖిత 490/1000 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, ఏ. విద్యార్థి 987/1000 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు.బైపీసీ ప్రథమ సంవత్సరం:కే. విద్యార్థి 437/440 మార్కులతో ప్రథమ స్థానం, ఉర్జి మెహనీష్ 436 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు.బైపీసీ ద్వితీయ సంవత్సరం:కే. నందిని 995/1000 మార్కులతో ప్రథమ స్థానం, ఫరియా తస్నీమ్ 994 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు.సీఇ సీ ప్రథమ సంవత్సరం:భాను రాథోడ్ 492 మార్కులతో ప్రథమ స్థానం, సిద్రా ఫాతిమా 488 మార్కులతో ద్వితీయ స్థానం, మెహవీన్ అజార్ 475 మార్కులతో తృతీయ స్థానం సాధించారు.సీఇ సి ద్వితీయ సంవత్సరం:కే. నిషిత 960 మార్కులతో ప్రథమ స్థానం, పి. వైశాలి 945 మార్కులతో ద్వితీయ స్థానం, పి. చరణ్యతేజ 941 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. ఎమ్ ఇ సి ప్రథమ సంవత్సరం:శ్రీజ 444 మార్కులతో ప్రథమ స్థానం సాధించింది.ఎమ్ ఇ సి ద్వితీయ సంవత్సరం:ఎన్. పావని 966 మార్కులతో ప్రథమ స్థానం సాధించింది.ఈ అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ఫౌండర్ చైర్మన్ ఈదర సాల్మన్ రెడ్డి అభినందించారు. అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ జయబాల రెడ్డి, ప్రిన్సిపల్ జ్యోతిరెడ్డి విద్యార్థుల కృషిని ప్రశంసిస్తూ, ఈ విజయాల్లో భాగస్వాములైన అధ్యాపకుల సేవలను కొనియాడారు.

# వధూవరులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి

**వికారాబాద్ ,ఏప్రిల్ 12(వుదయం ప్రతినిధి)**

వివాహ వేడుక నిమిత్తం సొంత నియోజకవర్గం లోని దౌల్తాబాద్ కు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి కి వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రా, పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. నియోజక వర్గ పరిధిలోని దౌల్తాబాద్ మండలం గోక ఫస్ల బాద్ గ్రామానికి చెందిన నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రెడ్డిశీను వివాహ వేడుక దౌల్తాబాద్ మండల కేంద్రం లోని చెన్నకేశవ ఫంక్షన్ హాల్లో జరుగగా సీఎం హాజరై వధూవరులను ఆశీర్వదించారు.సీఎం తో పాటు మంత్రి వాకిట శ్రీహరి, ఎమ్మెల్యేలు తదితరులున్నారు.ఈ సందర్భంగా సీఎం ను కలిసేందుకు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.





ముఖ్యమంత్రికి ఘన స్వాగతం


## ఆర్టిజన్ కార్మికులకు

# 1104 యూనియన్ మద్దతు

## యూనియన్ డివిజన్ సెక్రెటరీ శ్రీధర్ రెడ్డి

- 1104 యూనియన్ డివిజన్ సెక్రెటరీ శ్రీధర్ రెడ్డి

**నారాయణపేట టౌన్ ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి)**




విద్యుత్ ఆర్టిజన్లు గత 5 రోజుల నుండి చేస్తున్న సమ్మె కు ఆదివారం 1104 యూనియన్ నారాయణపేట డివిజన్ సెక్రెటరీ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో సర్కిల్ ప్రెసిడెంట్ గోవిందరాజు, సర్కిల్ అడిషనల్ సెక్రెటరీ జీ. రవీంద్ర చారి, ఎల్.ఎమ్. అచ్యుత రెడ్డి, భీమ్ రెడ్డి, రమేష్, శాంతకుమార్ లు మద్దత్తు తెలిపారు. ఈ సందర్భంగా 1104 యూనియన్ డివిజన్ సెక్రెటరీ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులకు శాశ్వత ఉద్యోగులతో సమానంగా ఏపిఎస్ఈబి రూల్స్ సాధించేవరకు రాష్ట్ర నాయకత్వం 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబా నాయకత్వం లో రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు ఆర్టిజన్ కార్మికుల సమ్మె కు అండగా ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆర్టిజన్ కార్మికులు ఎవ్వరూ అధైర్య పడవద్దని మీ వెంబడే 1104 యూనియన్ అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని శ్రీధర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నిన్న కేటి. పి.ఎస్. లో సమ్మె నిర్వహిస్తున్న కార్మికులపై యాజమాన్యం టర్మినేషన్ నోటీసులు వాట్సాప్ లో పంపించగా, అట్టి కార్మికులకు 1104 యూనియన్ అండగా నిలిచి, ప్రభుత్వంతో చర్చలు జరిపి వారికి న్యాయం జరిగే విధంగా కృషి చేసిందని శ్రీధర్ రెడ్డి ఈ సభలో తెలిపారు. కావున ఆర్టిజన్ కార్మికుల న్యాయమైన కోరికలు నెరవేర్చే వరకు తమ యూనియన్ ఎప్పుడు కార్మిక పక్షాన పోరాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం వంటవార్పు కార్యక్రమంలో నాయకులు పాల్గొని కార్మికులలో మనోధైర్యం నింపారు. మీ వెంట మేముంటామని భరోసా కల్పించారు. అవసరమైతే ఈ సమ్మెలో తాము సైతం విధులు బహిష్కరించేందుకు వెనకాడబోమని అభిప్రాయం వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో టి.వి.ఏ.ఈ జే.ఏ.సి రాష్ట్ర నాయకుడు రాఘవెందర్ గౌడ్, ఉమ్మడి జిల్లా కన్వీనర్ దిల్ దార్. , డివిజన్ చైర్మెన్ నర్సింహులు. కొ. ఛైర్మన్. లక్ష్మీకాంత్., రమేష్., కన్వీనర్ జైపాల్. శ్రీధర్, ప్రచార కార్యదర్శి జె. వెంకటేష్, గుండప్పా, మహమ్మద్ పాషా ఇతరనాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హ్యాపీ సండే విజయవంతం




**మహబూబ్ నగర్ ఏప్రిల్ 12(వుదయం ప్రతినిధి)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఆదివారం హ్యాపీ సండే కార్యక్రమాన్ని మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెయిన్ స్టేడియం కామన్ గేట్ వద్ద ఉన్న ప్రధాన రహదారి పై ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల చేత సాంస్కృతిక నృత్యాలు, యోగా ప్రదర్శనలు, మ్యాజిక్ షో, మిమిక్రీ, వివిధ క్రీడాపోటీలు, అలాగే కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శనలు నిర్వహించారు.


ముఖ్యంగా బాలికల సాంస్కృతిక నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకోగా, చిన్నారుల కరాటే ప్రదర్శనల అందరినీ అలరించింది. సీనియర్ సిటిజన్స్ సంఘం సభ్యులు పాటలు పాడి అందరినీ మెప్పించారు.ఈ కార్యక్రమంలో చిన్నారులు, యువత, వృద్ధులు ఉత్సాహంగా పాల్గొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అదేవిధంగా స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది, వారు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను ప్రజలకు ప్రదర్శించి విక్రయించారు

.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తాహిర్ భాష, యన్.పి. ప్రవీణ్ కుమార్, సత్యం, మున్సిపల్ ఇంజనీర్ మురళీధర్ రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎ.ఈ వసంత, ఇతర మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## అత్యుత్తమ ప్రతిభతో

# మెరిసిన వివేకానంద రెడ్డి

**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి)**



జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి సందడి వివేకానంద రెడ్డి తన ప్రతిభతో మెరిసి కళాశాలకు గర్వకారణంగా నిలిచాడు. శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూపులో విద్యను అభ్యసిస్తున్న ఆయన 470 మార్కులకు గాను 462 మార్కులు సాధించి అత్యుత్తమ ఫలితాన్ని నమోదు చేశాడు.కళాశాల యాజమాన్యం తెలిపిన ప్రకారం, క్రమశిక్షణతో పాటు పట్టుదలతో చదవడం వల్లే ఈ స్థాయి ప్రతిభ సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా వివేకానంద రెడ్డి మాట్లాడుతూ, చిన్ననాటి నుండి ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో క్రమబద్ధంగా చదవడం వల్లే ఈ ఫలితం సాధించానని తెలిపారు.విద్యార్థి తండ్రి సందడి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, తన కుమారుడు రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకు సాధించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఐఐటీలో సీటు సాధించి ఇంజనీరింగ్ రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, బంధువులు, స్నేహితులు వివేకానంద రెడ్డిని అభినందించారు.

# గాయని ఆశాభోస్లే మరణం సంగీత ప్రపంచానికే తీరని లోటు

**నారాయణపేట ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి)**

భారత శాస్త్రియా సంగీతానికే నిఘంటువు గాయని ఆశాబోస్లె అని ఆమె మరణం సినీ సంగీత ప్రపంచానికే శోకంలో మునిగిందని ఎస్పి బాలసుబ్రహ్మణ్యం ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్ రెడ్డి అన్నారు. ఆశా బోస్లె 20వేలకు పైగా 8భాషల్లో గీతాలను ఆలపించిన గొప్ప గాయని అని ఆమె మరణం జీర్ణించుకొలెక పోతున్నామని అన్నారు. ఆమె ఆత్మకు భగవంతుడు శాంతిని చేకూర్చి వారి కుటుంబీకులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రగాడా సానుభూతిని తెలిపారు.

# సంసద్ ఖేల్ మహోత్సవ్ ఒక ప్రజా ఉద్యమం

**బిజెపి రాష్ట్ర నాయకుడు సంసద్ ఖేల్ మహోత్సవ్ కోఆర్డినేటర్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి**

**పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఈ క్రీడా కార్యక్రమంతో సన్నిహిత సంబంధం ఉంది," అని బిజెపి రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి ఈ ఉత్సవాన్ని ఒక ప్రజా ఉద్యమంగా అభివర్ణిస్తూ, దాని స్థాయిని, క్షేత్రస్థాయికి చేరిన పరిధిని ప్రముఖంగా ప్రస్తావించారు.l**



**ఊర్కొండ ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి)**

నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం.నియోజకవర్గాల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించాలని "ఈ రోజు, సంసద్ ఖేల్ మహోత్సవ్ ఒక ప్రజా ఉద్యమంగా మారింది... నగరాల నుండి గ్రామాల వరకు, అన్ని వర్గాల యువత ఇందులో పాలుపంచుకుంటున్నారు. ఇది దీని స్థాయి ఎంత బృహత్తరమైనదో చూపిస్తుంది. పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఈ క్రీడా కార్యక్రమంతో సన్నిహిత సంబంధం ఉంది," అని బిజెపి రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి ఈ ఉత్సవాన్ని ఒక ప్రజా ఉద్యమంగా అభివర్ణిస్తూ, దాని స్థాయిని, క్షేత్రస్థాయికి చేరిన పరిధిని ప్రముఖంగా ప్రస్తావించారు.l రాబోయే సంవత్సరాల్లో దేశం అనేక ప్రధాన క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు మరియు యువత క్రీడలను చేపట్టాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గాల్లోని ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించాలని మోదీ చట్టసభ సభ్యులకు పిలుపునిచ్చారు. "

"ఈ రోజు క్రీడలలో అవకాశాలు పరిమితం కాదు; అవి అపరిమితం. ఈ రోజు దేశంలో ఒక పర్యావరణ వ్యవస్థ సృష్టించబడింది... ఈ రోజు, అత్యంత పేద కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా చిన్న వయసులోనే ఉన్నత శిఖరాలను చేరుకోగలరు," అని ఆయన అన్నారు.

"మీరు కేవలం మీ సొంత విజయం కోసం మాత్రమే ఆడటం లేదు, దేశం కోసం ఆడుతున్నారు. నేను ప్రతి తల్లిదండ్రికీ విజ్ఞప్తి చేస్తున్నాను — మీ పిల్లలను ఆడటానికి ప్రోత్సహించండి, వారికి ఆడేందుకు అవకాశాలు కల్పించండి... ఎందుకంటే క్రీడలు కేవలం చదువులో ఒక భాగం మాత్రమే కాదు. ఆరోగ్యకరమైన శరీరానికి, ఆరోగ్యకరమైన మనస్సుకు కూడా ఇది ఒక అత్యవసరమైన అంశం," అని బిజెపి రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి అన్నారు.

## మంత్రి జగ్గారెడ్డి హామీ
# బసవ భవన్ నిర్మాణ పనుల్లో కదలిక



**బసవ భవన్ నిర్మాణానికి అడ్డంకులు తొలగింపు జగ్గారెడ్డి హామీతో ముందడుగు. సంతోషంలో వీర శైవులు**

**సంగారెడ్డి ,ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి)**

కంది మండలంలోని కాశిపూర్ గ్రామంలో బసవ భవన్ నిర్మాణానికి మార్గం సుగమమైంది. బసవ భవన్ కోసం కేటాయించిన ఒక ఎకరా భూమిలో 19 నాడు జరిగే బసవ జయంతి సందర్భంగా బసవేశ్వరుని విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు.. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రముఖులు హాజరుకానున్నారు . ఈ నేపథ్యంలో భవన్ నిర్మాణంపై ఉన్న అనిశ్చితి తొలగి పోయిందివీరశైవ సమాజం జిల్లా అధ్యక్షులు ఇప్ప పల్లి నరసింహులు ఆధ్వర్యంలో స్థానిక జగ్గారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వినతిని శ్రద్ధగా విన్న జగ్గారెడ్డి సానుకూలంగా స్పందించారు. తాను ఇచ్చిన మాట ప్రకారం కేటాయించిన భూమిలో బసవ భవన్ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఇదే సందర్భంలో కంది ఎమ్మార్వోకు ఫోన్ చేసి, భూమిని ఎటువంటి ఆటంకాలు లేకుండా అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ ప్రక్రియలో ఎలాంటి అవరోధాలు లేకుండా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. అలాగే, ఈ అంశంపై మళ్లీ తనకు ఫోన్ కాల్స్ రావద్దని తాసిల్దార్ కు సూచించారు.జగ్గారెడ్డి ఇచ్చిన హామీతో వీరశైవ సమాజంలో ఆనందం నెలకొంది. బసవ భవన్ నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందనే నమ్మకంతో వీర శైవులు ఎదురు చూస్తున్నారు.ఈ కార్యక్రమం లో గౌరవ సలహాదారు వెన్న చక్రీశ్వర్, మరెల్లి అడివప్ప పన్యాల ప్రభాకర్, మీడియా ఇంచార్జ్ శరత్ బాబు, యువజన అధ్యక్షులు బుగ్గన్నగారి మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి నవీన్ రామోజి, నియోజకవర్గ అధ్యక్షులు రేవన సిద్దప్ప, ప్రధాన కార్యదర్శి శివకుమార్, అందోల్ అధ్యక్షులు పట్లోళ్ల అశోక్,సాదా శివపేట మండల అధ్యక్షులు నాగేశ్వర్, టౌన్ అధ్యక్షులు వినోద్, ప్రధాన కార్యదర్శి సతీష్, చందు, మహిళా అధ్యక్షురాలు పట్లోళ్ల అరుణ, ప్రధాన కార్యదర్శి గొర్రెగట్టు శారదా, వసంత తదితరులు పాల్గొన్నారు.



## కొలువుదీరిన నారాయణపేట
# ప్రింటింగ్ ప్రెస్ పట్టణ కమిటీ

**నారాయణపేట ,ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కేంద్రంలో గల ప్రింటింగ్ ప్రెస్ పట్టణ కమిటీ ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం సమావేశమైన ప్రింటింగ్ ప్రెస్ కమిటీ సభ్యులు అధ్యక్షులుగా మాధ్గుండి కున్నప్ప కుమార్ శివ, ప్రధాన కార్యదర్శి గా వారధి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా వెంకటేష్భండారి,గౌరవఅధ్యక్షులుగా మురళి భట్టడ్,కోశాధికారి గా సూతరి చంద్రకాంత్,గౌరవ సలహా సభ్యులు గా దిలీప్ సరోదే, సభ్యులుగా సంబరి శ్రీనివాస్, జుట్టు శ్రీనివాస్,మల్లికార్జున్, ఘనశ్యామ్, సామల అజయ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు మాధ్గుండి కున్నప్ప కుమార్ శివ మాట్లాడుతూ కమిటీ సభ్యులు నాపై ఉంచిన బాధ్యతను తూచా తప్పకుండా పాటిస్తానని ప్రతినెల రెండవ ఆదివారం కమిటీ సమావేశం అవుతుందని,ప్రింటింగ్ లో కనీస ధరలను నిర్ణయించామని వాటిని ఎవరు ఉల్లంఘించరాదని కోరారు.

# పటాన్‌చెరు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



**పటాన్ చెరు,ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి)**

వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరై కార్యక్రమాన్ని శోభాయమానం చేశారు.మంత్రి రాక సందర్భంగా పటాన్ చెరు బస్టాండ్ చౌరస్తాలో నియోజకవర్గ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, వేలాది మంది కార్యకర్తలతో భారీ ర్యాలీగా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వరకు తరలివచ్చారు.

ర్యాలీలో మంత్రి దామోదర్ రాజనర్సింహకు గజమాలలు వేసి, బాణాసంచా కాల్చి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా స్వాగతం పలికారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో సాగగా, మంత్రి కార్యకర్తలకు అభివాదం చేస్తూ వారికి మరింత ఉత్సాహాన్ని నింపారు.ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా యేపూరి శివానందం, వైస్ చైర్మన్‌గా రాజశేఖర్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని మంత్రి ఘనంగా సన్మానించారు.మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ పటాన్ చెరు నియోజకవర్గానికి విశిష్ట చరిత్ర ఉందని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా పటాన్ చెరు గుర్తింపు పొందిందన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాటా శ్రీనివాస్ స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారని గుర్తుచేస్తూ, భవిష్యత్తులో ఆయన ఎమ్మెల్యేగా అవతరిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

పేదవారికి నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. రైతు సంక్షేమం, విద్య, వైద్య రంగాలతో పాటు మహిళా సాధికారతకు సీఎం రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు.



సంగారెడ్డి జిల్లాకు బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఓడీఎఫ్, ఐఐటీ హైదరాబాద్ వంటి కీలక సంస్థలను తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇందిరమ్మ మెదక్ ఎంపీగా ఉన్న సమయంలో జిల్లా అభివృద్ధి పథంలో నడిచిందని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ శ్రీమతి నిర్మల జగ్గారెడ్డి, కాటా శ్రీనివాస్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎస్ఈలో ఫాతిమాకు పీహెచ్.డీ

**పటాన్చెరు ,ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి)**



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ పరిశోధక విద్యార్థి సయ్యదా ఇమ్రానా ఫాతిమా ఖవాజా జకియుల్లా ఖ్వాద్రి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'సురక్షిత చిత్ర స్టెగానోగ్రఫీ కోసం ఒక ఉత్పాదక ప్రతికూల నెట్ వర్క్'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి. యుగంధర్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.

వినూత్న డీప్ లెర్నింగ్ పద్ధతుల ద్వారా సురక్షిత డేటా ప్రసారాన్ని మెరుగుపరచడంపై ఈ అధ్యయనం దృష్టి సారించినట్టు తెలియజేశారు. ప్రస్తుత స్టెగానోగ్రాఫిక్ పద్ధతులలోని కీలక పరిమితులను పరిష్కరిస్తూ, శిక్షణ స్థిరత్వాన్ని పెంచే, ఎంబెడింగ్ సామర్థ్యాన్ని మెరుగుపరిచే, దాగి ఉన్న సమాచారాన్ని విశ్వసనీయంగా వెలికితీసేలా చూసే పటిష్టమైన GANఆధారిత ఫ్రేమ్ వర్కుల శ్రేణిని ఈ అధ్యయనం ప్రతిపాదిస్తుందని వివరించారు.

గేమ్ థియరీ, డీప్ కన్వల్యూషనల్ నెట్ వర్కులు, సైకిల్ కన్సిస్టెన్సీ లెర్నింగ్, ఆప్టిమైజేషన్ వ్యూహాలను ఏకీకృతం చేయడం ద్వారా, ఈ పరిశోధన ఇమేజ్ స్టెగానోగ్రఫీ సిస్టమ్ ల భద్రతను, గుర్తించలేనితనాన్ని, ప్రతికూల దాడులు, డేటా నష్టానికి వ్యతిరేకంగా వాటి స్థితిస్థాపకతను గణనీయంగా బలపరుస్తుందని పేర్కొన్నారు.

సాంప్రదాయ పద్ధతులతో పోలిస్తే మెరుగైన దృశ్య నాణ్యత, గుర్తింపును నిరోధించే పటిష్టత, సురక్షితమైన డేటా పునరుద్ధరణ వంటివి ఈ పరిశోధన ఫలితాలలో కనబడుతున్నాయన్నారు. ఇవి మరింత సురక్షితమైన, విశ్వసనీయమైన డిజిటల్ కమ్యూనికేషన్ వ్యవస్థలకు దోహదపడతాయని తెలిపారు.

డాక్టర్ సయ్యదా ఇమ్రానా ఫాతిమా సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ షేక్ మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సరికొత్త రికార్డు
## కేటీదొడ్డి ఎంజేపి జూనియర్ కాలేజ్

**కేటీదొడ్డి ఎంజెపి టిబిసి జూనియర్ కాలేజ్‌కు అద్భుత ఫలితాలు**

**గద్వాల ,ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి)**




జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల నియోజకవర్గంలోని కేటీదొడ్డి మండల కేంద్రంలో ఉన్న ఎంజెపి టిబిసి జూనియర్ కాలేజ్ విద్యార్థులు ఈసారి ఇంటర్మీడియట్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబర్చారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులు అత్యుత్త మ మార్కులు సాధించి కాలేజ్‌కు మంచి పేరు తెచ్చారు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బిపిసి విభాగంలో విద్యార్థులు 1000 మార్కులకు 968 మార్కులు సాధించగా, ఎంపిసి విభాగంలో 957 మార్కులు, సీఈసీ (ఏసిపి) విభాగం లో 943 మార్కులు సాధించారు ఈ ఫలితాలు విద్యార్థుల కష్టపాటు ఉపాధ్యా యుల సమర్థమైన బోధనకు నిదర్శనంగా నిలిచాయి ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసు లు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఈ విజయా న్ని సాధించారని తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు ఉపాధ్యాయు లు కూడా విద్యార్థుల కృషిని అభినందిస్తూ, వారి విజయానికి కారణమైన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు కేటీదొడ్డి ప్రాంతం లో ఈ ఫలితాలు ఆనందాన్ని నింపగా తల్లిదండ్రులు స్థానికులు కళాశాల నిర్వహణపై ప్రశంసలు కురిపిస్తున్నారు

# పేదల సొంతింటి కల సాకారం

**ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే**

**నారాయణఖేడ్, ఏప్రిల్ 12(వుదయం)**



నారాయణఖేడ్ మండల పరిధిలోని చప్టా(కె) గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం లో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన చిన్నమ్మ (భర్త శంకరయ్య స్వామి) నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, యువనేత సాగర్ శెట్కార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే, యువనేత నూతన గృహంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, లబ్ధిదారురాలు చిన్నమ్మ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సంయుక్తంగా మాట్లాడుతూ.. పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చూస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందడంతో ప్రజలు ఆనంద పడుతున్నారని అన్నారు. ఎ అబివృధి చేయాలన్న కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యం అని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగయ్యస్వామి,కాలనీ 9 వార్డ్ మెంబర్ నందు,3 వార్డ్ మెంబర్ పండరి రెడ్డి,నియోజికవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివకాంత్ పటేల్,సర్పంచ్ గోరక్ పటేల్ ,యాదవ్ రెడ్డి మాజీ సర్పంచ్,పండరి రెడ్డి మాజీ ఎంపీటీసీ,గోవింద్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి,శివ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, జైపాల్ రెడ్డి మండల హౌసింగ్ అధికారులు పంచాయతీ కార్యదర్శి,స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, చప్టా(కె)గ్రామస్తులు గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిగాచి ప్రమాదం
## బాధ్యులైన అధికారులపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి

**సిగాచి ప్రమాదానికి బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి**
**కార్మిక శాఖా మంత్రి గడ్డం వివేక్ ను కోరిన..**
**నవభారత్ నిర్మాన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టుశ్రీధర్**

**పటాన్చెరు వుదయం**



సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్ యాజమాన్యం మరియు సంబంధిత అధికారుల ఘోర నిర్లక్ష్యం వల్ల అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ తీవ్రంగా ఆరోపించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన పటాన్చెరు పట్టణంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిని కలిసి, 2018 నుండి 2024 వరకు జరిగిన తనిఖీ నివేదికల ఆధారంగా సమగ్ర వివరాలతో కూడిన ఫిర్యాదును సమర్పించారు.

ఈ సందర్భంగా మెట్టు శ్రీధర్ మాట్లాడుతూ, సిగాచి ఇండస్ట్రీస్ గత ఏడేళ్లుగా ఫ్యాక్టరీ చట్టాలను నిర్లక్ష్యంగా ఉల్లంఘిస్తూ వస్తోందని పలు ఆధారాలతో వివరించారు. ముఖ్యంగా 201819లో అనుమతించిన 100 మంది కార్మికుల పరిమితిని మించి నియామకాలు జరిపినట్టు, 2022లో 818 HP లైసెన్స్ పరిమితి ఉండగా 1777 HP సామర్థ్యం గల యంత్రాలను అనుమతి లేకుండా ఏర్పాటు చేసి ప్రమాదాలకు కారణమయ్యారని వెల్లడించారు.


అలాగే 2019, 2021 మరియు 2023 సంవత్సరాల తనిఖీలలో యంత్రాలకు భద్రతా గార్డులు లేవని స్పష్టంగా గుర్తించినప్పటికీ యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ప్రమాదకర రసాయనాలు ఉపయోగించే ఫ్యాక్టరీలో హాజర్డ్ అనాలిసిస్ నివేదికలు లేకపోవడం అత్యంత ఆందోళనకరమని అన్నారు. ప్రతి ఏడాది తనిఖీల్లో లోపాలు బయటపడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇటువంటి విషాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కార్మికుల మరణాలకు బాధ్యులైన సిగాచి ఇండస్ట్రీస్ యాజమాన్యంతో పాటు విధి నిర్వహణలో విఫలమైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించాలని అమాయక కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలని మెట్టు శ్రీధర్ గట్టిగా డిమాండ్ చేశారు.

# జిల్లాలో కేజీబీవీల విద్యార్థినుల ఘన విజయం

- **ఇంటర్ ఫలితాల్లో 86% ఉత్తీర్ణత, 900 మార్కులపైగా సాధించిన 85 మందికి పైగా బాలికలు**

**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 12 (వుదయం ప్రతినిధి)**




జిల్లా లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీ) విద్యార్థినులు ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. ఆదివారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాలోని కేజీబీవీ విద్యార్థినులు ఉత్తీర్ణత శాతంలో మంచి ప్రదర్శన నమోదు చేశారు. జిల్లాలోని 11 కేజీబీవీలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలకు మొత్తం 509 మంది విద్యార్థినులు హాజరయ్యారు. వీరిలో 438 మంది విద్యార్థినులు విజయవంతంగా ఉత్తీర్ణత సాధించారు.దీంతో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్‌లో మొత్తం 86 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది.ఈ ఫలితాల్లో ప్రత్యేకంగా 85 మందికి పైగా విద్యార్థినులు 900కు పైగా మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభను చాటుకున్నారని కేజీబీవీల పర్యవేక్షణ అధికారిని శోభారాణి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకుంటూ ఈ స్థాయి మార్కులు సాధించడం పట్ల ఆయా కేజీబీవీల ప్రత్యేక అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.అదేవిధంగా ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో కూడా కేజీబీవీ విద్యార్థినులు మెరుగైన ఫలితాలు సాధించారు. జిల్లాలోని 20 కేజీబీవీల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 1024 మంది విద్యార్థినులు హాజరుకాగా, వీరిలో 792 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో ప్రథమ సంవత్సరంలో 77 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైనట్లు జిల్లా పర్యవేక్షణ అధికారిని శోభారాణి వెల్లడించారు.ఈ ఫలితాల్లో 150 మందికి పైగా విద్యార్థినులు 400కు పైగా మార్కులు సాధించడం విశేషంగా నిలిచింది. విద్యార్థినుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శనం, కేజీబీవీ పాఠశాలల ప్రత్యేక బోధనా విధానాల కారణంగా ఈ విజయాలు సాధ్యమయ్యాయని కేజీబీవీ పర్యవేక్షణ అధికారి శోభారాణి పేర్కొన్నారు.జిల్లా వ్యాప్తంగా కేజీబీవీ విద్యార్థినుల ఈ ప్రతిభను అధికారులు అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.

గ్రామీణ బాలికల విద్యలో కేజీబీవీల పాత్ర మరింత బలోపేతమవుతోందని ఈ ఫలితాలు స్పష్టంగా చూపిస్తున్నాయని మె అభిప్రాయపడ్డారు.

ఈ విజయంతో కేజీబీవీ విద్యార్థినులు ఉన్నత విద్య వైపు ముందడుగు వేస్తూ, గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి సప్లమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా బాలికలను ఉన్నత చదువులకు సిద్ధం చేయనున్నట్లు ఆమె తెలిపారు.గత సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో ద్వితీయ సంవత్సరంలో 82% నమోదు కాగా, మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో 75% ఉత్తీర్ణత శాతం నమోదయినట్లు ఆమె తెలిపారు.



## శాంతినగర్‌లో సిలిండర్ పేలుడు
# నలుగురికి తీవ్ర గాయాలు

**సంగారెడ్డి ఏప్రిల్ 12 (వుదయం)**

సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌లో గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటన కలకలం రేపింది. ఈ ప్రమాదంలో సంగమేశ్, మల్లమ్మ, బిందు, చిన్నలకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఘటన చోటుచేసుకున్న వెంటనే స్థానికులు అప్రమత్తమై గాయపడిన వారిని అత్యవసరంగా సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. పేలుడు కారణాలపై స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు.అనంతరం ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే, వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో చర్చించి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. గాయాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని బాధితులను హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించేలా చర్యలు చేపట్టారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం.

## దౌల్తాబాద్ మోడల్ కళాశాలలో
# విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం

*** ఇంటర్ ఫలితాల్లో దారుణ పరిస్థితి**
**- విద్యా ప్రమాణాలపై సందేహాలు**

**దౌల్తాబాద్,ఏప్రిల్ 12 (వుదయం)**

దౌల్తాబాద్ మోడల్ కళాశాలలో ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాలు తీవ్ర నిరాశను కలిగించాయి. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం చాలా తక్కువగా ఉండటం వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మొత్తం 30 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో కేవలం 6 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఇది సుమారు 20 శాతం మాత్రమే కావడం గమనార్హం. అలాగే ద్వితీయ సంవత్సరంలో 48 మంది విద్యార్థుల్లో కేవలం 11 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించడం విద్యా ప్రమాణాలపై అనుమానాలు కలిగిస్తోంది. ఈ ఫలితాలు విద్యార్థుల విద్యా స్థాయిని మాత్రమే కాకుండా, కళాశాలలో బోధన విధానం, ఉపాధ్యాయుల లోపాలు, పర్యవేక్షణలో నిర్లక్ష్యం వంటి అంశాలను కూడా ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు కళాశాల నిర్వహణపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం మోడల్ కళాశాలల ద్వారా నాణ్యమైన విద్య అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, ఈ విధమైన ఫలితాలు ఆ లక్ష్యానికి విరుద్ధంగా ఉన్నాయని విద్యా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కళాశాలలో ఉపాధ్యాయుల కొరత, సరైన అకాడమిక్ ప్లానింగ్ లోపం, విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ లేకపోవడం వంటి కారణాలు ఈ పరిస్థితికి దారితీసి ఉండవచ్చని భావిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి,

కళాశాల పరిస్థితిని సమీక్షించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. లేదంటే భవిష్యత్తులో మరింత మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

# కేంద్ర బ్యాంకుల పసిడి వేట

పసిడి ధర పరుగులు పెట్టడానికి, వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు పెద్దమొత్తంలో పసిడి నిల్వలు పెంచుకోవడమూ ఒక కారణమన్నది తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరి లోనూ ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు నికరంగా 19 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేశాయని ప్రపంచ స్వర్ణమండలి (డబ్ల్యూజీసీ) తెలిపింది.కొనుగోలుదార్లువిక్రయదార్ల వివరాలు: పోలండ్ 20 టన్నులు, ఉజ్బెకిస్థాన్ 8, చెక్ రిపబ్లిక్ 2, మలేషియా 2, చైనా కాంబోడియా 1 టన్ను చొప్పున కొనుగోలు చేయగా, టర్కీ 8 టన్నులు, రష్యా 6 టన్నుల చొప్పున పసిడిని విక్రయించాయి.2025 ఫిబ్రవరిలో 29 టన్నులు కొనుగోలు చేసిన పోలండ్ కేంద్రబ్యాంక్ మళ్లీ ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ రికార్డుస్థాయిలో పసిడిని పోగుచేసుకుంది. మొత్తం బంగారం నిల్వలను 700 టన్నులు చేయాలన్నది ఈ బ్యాంక్ లక్ష్యం కాగా, ఇప్పటికి 570 టన్నులు చేసింది. చైనా విదేశీ మారకపు నిల్వల్లో బంగారం వాటా 10%. ఈ దేశ కేంద్రబ్యాంక్ వద్ద మొత్తం 2,308 టన్నుల బంగారం ఉంది.






## సంక్షోభంలో ఎయిరిండియా

- గమ్యం తెలియని గగన విహారం
- సమిష్టి కృషితో రాణించాలి
- ఉద్యోగులతో టాటా సన్స్ చైర్మెన్
- చంద్రశేఖరన్

**న్యూఢిల్లీ:**
పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం, అంతర్గత నాయకత్వ మార్పుల నేపథ్యంలో ఎయిర్ ఇండియా ప్రస్తుతం ఒక క్లిష్ట దశను ఎదుర్కొంటోందని టాటా సన్స్ చైర్మెన్ ఎన్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన ఉద్యోగుల అంతర్గత సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యుద్ధం కారణంగా విమాన సర్వీసుల రద్దు, మార్గాల మార్పు, పెరిగిన ఇంధన ధరలు సంస్థపై తీవ్ర ఒత్తిడి పెంచాయని వివరించారు. ముఖ్యంగా పశ్చిమాసియా ప్రాంతానికి విమాన రాకపోకలు 30 శాతానికి పడిపోయాయని తెలిపారు. యూరప్ వెళ్లే విమానాలు ఆఫ్రికా మీదుగా సుదీర్ఘ మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోందన్నారు. ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ సంస్థను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో చేపట్టిన దీర్ఘకాలిక మార్పులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.గడిచిన నాలుగేండ్లలో సుమారు 17,000 మంది కొత్త ఉద్యోగులను నియమించుకోవడం, నాలుగు ఎయిర్‌లైన్స్‌ను రెండుగా విలీనం చేయడం, విమానాల్లో అత్యాధునిక సదుపాయాలను కల్పించడం వంటి కీలక మార్పులు జరిగాయని వివరించారు. సంస్థ నిర్వహణలో భద్రత అనేది అత్యంత కీలకమని, దీనిపై ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన పునరుద్ఘాటించారు. విమానంలో మొదటి వరుసలో ఉన్న వారితో పాటు చివరి వరుసలో కూర్చున్న ప్రయాణికులకు కూడా సమానమైన గౌరవం, మర్యాద దక్కాలన్నదే తమ ప్రధాన విధానమని ఆయన ఉద్యోగులకు వివరించారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో ఉద్యోగులు చూపుతున్న పట్టుదల అభినందనీయమని.. టాటా గ్రూప్ ఎల్లప్పుడూ ఎయిర్ ఇండియాకు అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. బయట నుండి వచ్చే విమర్శలను సానుకూలంగా స్వీకరించి ఒకవేళ అవి సహేతుకమైతే లోపాలను సరిదిద్దుకోవాలని సూచించారు. ఉద్యోగులంతా సమష్టిగా కృషిచేసి సంస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని చంద్రశేఖరన్ కోరారు. కస్టమర్ సంతృప్తిని పరమావధిగా పెట్టుకుని ముందుకు సాగాలని ఆయన కోరారు.

# వెనెజువెలా చమురు వెల్లువ

## 12 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు సిద్ధం!

**ముడి చమురు జోరు..**

**వెనెజువెలా నుంచి భారీ దిగుమతి.**

**మీ కంటెంట్ యొక్క ప్రాధాన్యతను**

**బట్టి వీటిలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు**

.ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించాక, పశ్చిమాసియా నుంచి చమురుగ్యాస్ దిగుమతులు తగ్గడంతో, మనదేశం చురుగ్గా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. వెనెజువెలా నుంచి చమురు దిగుమతులను భారత్ పెంచుతోందని, నౌకా రవాణా పరిశీలనా సంస్థ కెప్లర్ తెలిపింది. ఈ నెలలో వెనెజువెలా నుంచి 12 మిలియన్ బ్యారెళ్ల కంటే ఎక్కువ ముడిచమురు మన దేశానికి చేరుకోనుంది. 2020 ఫిబ్రవరి తర్వాత ఇదే అతిపెద్ద పరిమాణం. గత ఆరేళ్లలో వెనెజువెలా నుంచి భారత్ కొనుగోలు చేసిన అత్యధిక పరిమాణ ముడిచమురూ ఇదే. అమెరికా ఆంక్షలు సడలించడంతో..: ఏప్రిల్‌లో భారత్‌కు చేరుకుంటున్న చమురు దిగుమతులు, పశ్చిమాసియాలో సంక్షోభం ప్రారంభం కావడానికి ముందు ఒప్పందాలు చేసుకున్నవి కావొచ్చని కెప్లర్ లీడ్ రీసెర్చ్ అనలిస్ట్ సుమిత్ రిటోలియో పేర్కొన్నారు. 'వెనెజువెలా చమురు కొనుగోళ్లు, భారత తక్షణ ప్రతిస్పందన మాత్రమే కాదు. దీర్ఘకాలిక వ్యూహాత్మక మార్పును సూచిస్తోంది' అని ఆయన పేర్కొన్నారు. గతంలో వెనెజువెలా నుంచి భారత్ పెద్ద ఎత్తున చమురు కొనుగోలు చేసేది. ఆ దేశంపై అమెరికా ఆంక్షలు విధించాక, అక్కడనుంచి మనదేశానికి దిగుమతులు తగ్గిపోయాయి. ఈ ఏడాది జనవరిలో వెనెజువెలా అధ్యక్షుడు మదురోను బంధించిన అమెరికా, ఆ దేశ చమురు విక్రయాలపై ఆంక్షలు సడలించింది. దీంతో మనదేశమూ కొనుగోళ్లను పునరుద్ధరించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ నిర్వహిస్తున్న సిక్కా పోర్టుకు 1 మిలియన్ బ్యారెళ్ల వెనెజువెలా ముడిచమురుతో ఒట్టోమన్ సిన్సియారిటీ నౌక చేరుకుంది. గతేడాది కాలంలో వెనెజువెలా నుంచి భారత్‌కు వచ్చిన మొదటి షిప్‌మెంట్ ఇదే. వెనెజువెలా ప్రభుత్వ సంస్థ పీడీవీఎస్ఏ నుంచి నేరుగా చమురు కొనుగోలు చేయడానికి అమెరికా నుంచి రిలయన్స్ అనుమతి పొందింది. గతంలో విటోల్ గ్రూప్, ట్రాఫిగురా వంటి మధ్యవర్తుల నుంచి చమురు వచ్చేది. కానీ ఇప్పుడు నేరుగా దిగుమతి చేసుకుంటోంది.వెనెజువెలాకు చెందిన హెవీ క్రూడ్ వల్ల డీజిల్, విమాన ఇంధనం వంటి ఉత్పత్తులు అధికంగా లభిస్తాయని, ప్రస్తుత సమయంలో ఇవి చాలా కీలకమని రిటోలియా వివరించారు.



ఇరాన్ నుంచి ముడి చమురు దిగుమతికి ప్రభుత్వ అనుమతి కోరిన ఆర్ఐఎల్

ఇరాన్ ముడిచమురు విక్రయానికి అమెరికా ఇచ్చిన ఆంక్షల మినహాయింపు గడువు ఈనెల 19న ముగియనుంది. ఈ లోపుగానే 4 నౌకల్లో ఇరాన్ ముడి చమురు దిగుమతి చేసుకోవడానికి భారత ప్రభుత్వ అనుమతిని ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) కోరినట్లు సంబంధితులు తెలిపారు. అమెరికా ఆంక్షలకు అనుగుణంగా, మనదేశ చట్టాలను ఉల్లంఘించకుండా ఉండేలా ఆర్ఐఎల్ జాగ్రత్త వహిస్తున్నట్లు సమాచారం.
ట్రంప్ ప్రభుత్వం ఇరాన్‌కు మినహాయింపులు మంజూరు చేయడం వల్లే, ఏడేళ్ల తరవాత భారతీయ రిఫైనరీలు రష్యా చమురు కొనుగోళ్లను ప్రారంభించాయి. వార్తాసంస్థ బ్లూమ్‌బర్గ్ సంకలనం చేసిన నౌకల కదలికల డేటా ప్రకారం.. గత నెలలో మాస్కో నుంచి రోజుకు సుమారు 1.9 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు భారతదేశానికి చేరుకుంది. ఫిబ్రవరిలో ఆ దేశం నుంచి వచ్చింది రోజుకు సుమారు 1.1 మి.బ్యారెళ్లే. రష్యా చమురుపైనా ఆంక్షలు తొలగించడం ఇందుకు నేపథ్యం.

ఇరాన్ చమురు విషయానికి వస్తే, ఆంక్షలతో ముడిపడి ఉన్న సరఫరాదారులు, మధ్యవర్తులు, చెల్లింపు విధానాలపై ఉన్న ఆందోళనల కారణంగా ఇరాన్ నుంచి కొనుగోళ్లకు పరిమిత ఆదరణ మాత్రమే లభించింది.
మన దేశం ఇరాన్ నుంచి తాజాగా చమురు, ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ కొనుగోలు చేస్తోందని చమురు మంత్రిత్వ శాఖ ఈ నెల ప్రారంభంలో
'ఎక్స్' పోస్టులో తెలిపింది.



## ఎరువుల ఉత్పత్తిపై యుద్ధ నీడలు
## అన్నదాతల్లో పెరుగుతున్న ఆందోళన!

- గ్యాస్ కొరతతో తగ్గిన తయారీ
- ఖరీఫ్‌లో రైతులకు కష్టకాలమే

**న్యూఢిల్లీ :**
అమెరికా సామ్రాజ్యవాదంతో పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధం భారతదేశ వ్యవసాయ రంగాన్ని కలవరపెడుతోంది. యుద్ధం కారణంగా సహజ వాయువు సరఫరాలో ఏర్పడిన అంతరాయం వల్ల దేశీయంగా యూరియా ఉత్పత్తి భారీగా పడిపోయింది. మార్చి నెలలో సాధారణంగా ఉత్పత్తి కావాల్సిన 26 లక్షల టన్నుల కంటే సుమారు 8 లక్షల టన్నుల మేర తక్కువగా యూరియా ఉత్పత్తి అయినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఎరువుల తయారీకి ప్రధాన ముడిసరుకైన గ్యాస్ అందకపోవడంతో ఇఫ్కో వంటి దిగ్గజ సంస్థలు తమ ప్లాంట్లను తాత్కాలికంగా నిలిపివేయడం లేదా మరమ్మతుల పేరుతో మూసివేయడం ఈ లోటుకు ప్రధాన కారణంగా నిలిచింది.ప్రస్తుతం గ్యాస్ సరఫరాను ప్రభుత్వం 95 శాతానికి పెంచి ఉత్పత్తిని పునరుద్ధరిస్తున్నప్పటికీ అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న అనిశ్చితి ఇంకా కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా ఖతార్ వంటి ప్రధాన దేశాల నుంచి అందాల్సిన ఎల్ఎన్‌జి దిగుమతులు గత ఏడాదితో పోలిస్తే 27 శాతం తగ్గాయి. జూన్ నుండి వరి, మొక్కజొన్న, సోయాబీన్ వంటి ఖరీఫ్ పంటల సాగు ప్రారంభం కానున్న తరుణంలో ఈ ఉత్పత్తి లోటు, దిగుమతుల్లో జాప్యం ఎరువుల కొరతకు దారితీయవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకవేళ హోర్ముజ్ జలసంధి గుండా రవాణా మరింత మందగిస్తే సాగు సమయానికి ఎరువుల లభ్యత కష్టతరమై రైతులకు పెట్టుబడి భారం పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఈ పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం ఇప్పటికే 25 లక్షల టన్నుల యూరియా దిగుమతి కోసం అంతర్జాతీయ టెండర్లు జారీ చేసిందని తెలుస్తోంది. అయితే యుద్ధం మొదలైన తర్వాత ఇదే మొదటి భారీ దిగుమతి కావడంతో అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పెరిగే అవకాశం ఉండటం ప్రతికూలాంశంగా మారింది. ఒకవైపు యుద్ధ ప్రభావంతో రవాణా ఖర్చులు పెరగడం, మరోవైపు దేశీయ ఉత్పత్తి తగ్గడం వంటి పరిణామాలు భారత వ్యవసాయ రంగానికి సవాలుగా మారాయి.




## సంజు శాంసన్ శతకం
## చెన్నై సూపర్‌కింగ్స్ బోణీ కొట్టింది

హ్యాట్రిక్ పరాజయాలతో కొట్టు మిట్టాడుతున్న చెన్నై.. ఈ గెలుపుతో ఊపిరి పీల్చుకుంది. తొలుత చెన్నై సూపర్‌కింగ్స్ ఓపెనర్, వరల్డ్ కప్ హీరో సంజూ శాంసన్(115నాటౌట్; 56బంతుల్లో 15ఫోర్లు, 4సిక్సర్లు) శతకంతో మెరిసాడు. ఈ సీజన్ ఐపిఎల్‌లో ఇదే తొలి శతకం. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 212 పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. భారీ ఛేదనలో భాగంగా ఢిల్లీ జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 189 పరుగులు చేసి ఆలౌంది. దీంతో చెన్నై జట్టు 23 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయం ఈ సీజన్‌లో బోణీ కొట్టింది. చెన్నై బౌలర్లు ఓవర్టన్‌కు నాలుగు, కంబోజ్‌కు మూడు వికెట్లు దక్కాయి.
ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సంజు శాంసన్‌కు దక్కింది. టాస్ ఓడిన చెన్నై సూపర్ కింగ్స్‌కు సంజూ శాంసన్, రుతురాజ్ గైక్వాడ్(15) కలిసి శుభారంభం అందించారు. చెన్నై పవర్ ప్లేలో చెన్నై 61 పరుగులు చేసింది. ఐపీఎల్‌లో నాలుగో సెంచరీ సాధించాడు.



# సన్‌రైజర్స్‌పై పంజాబ్ ఘనవిజయం



సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ జట్ల తరఫున నలుగురు బ్యాటర్లు అర్ధసెంచరీలతో మెరిసారు. తొలుత అభిషేక్ శర్మ(74; 28బంతుల్లో 5ఫోర్లు, 8సిక్సర్లు) రాణించడంతో సన్‌రైజర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 219పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం పంజాబ్ బ్యాటర్లు రాణించడంతో ఆ జట్టు మరో 7బంతులు మిగిలి ఉండగానే కేవలం 4వికెట్లు మాత్రమే కోల్పోయి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఈ సీజన్‌లో రెండో ఓటమిని చవిచూసింది. సన్‌రైజర్స్ నిర్దేశించిన 220 పరుగులు ఛేదనలో పంజాబ్ కింగ్స్ ఓపెనర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. పోటా పోటీగా బౌండరీలు బాదిన ప్రియాన్ష్ ఆర్య(57), ప్రభ్‌సిమ్రన్ సింగ్(51) అర్ధసెంచరీలతో మెరిసారు. దీంతో ఆ జట్టు 6ఓవర్లలోనే 99పరుగులు చేసింది. ఎట్టకేలకు ఈ ప్రమాదకరమైన ద్వయాన్ని శివాంగ్ కుమార్(2/17) విడదీశాడు. 16 బంతుల్లోనే అర్ధ శతకం బాదేసిన ప్రియాన్ష్‌ను బౌండరీ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. దాంతో 99 పరుగుల వద్ద పంజాబ్ తొలి వికెట్ కోల్పోయింది. శివాంగ్ ఓవర్లోనే మిడాఫ్‌లో సిక్సర్‌తో అర్ధ శతకం సాధించిన ప్రభ్‌సిమ్రన్ బౌండరీ వద్ద క్లాసెన్ చేతికి దొరికాడు. దాంతో.. 117 వద్ద పంజాబ్ రెండో వికెట్ కోల్పోయింది. డేంజరస్ కొన్నొల్లి(11)ని సైతం ఔట్ చేసిన శివాంగ్ మ్యాచ్‌ను హైదరాబాద్ వైపు తిప్పాడు. కానీ, హర్షల్ పటేల్ ఓవర్లో శ్రేయాస్ అయ్యర్(69 నాటౌట్) వరసగా 6, 4, 6తో పంజాబ్‌ను పోటీలోకి తెచ్చాడు. నేహల్ వధేరా(14) ఇషాన్ మలింగను సైతం ఉతికేసిన అయ్యర్ 4, 6తో సన్‌రైజర్స్ ఆశలపై నీళ్లు చల్లాడు. అర్ధ శతకంతో విరుచుకుపడిన అయ్యర్.. అభిషేక్ వేసిన 19వ ఓవర్లో బౌండరీతో పంజాబ్‌కు 6 వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు. ఆ తర్వాత కెప్టెన్ ఇన్నింగ్స్‌తో విరుచుకుపడిన శ్రేయాస్ అయ్యర్(69 నాటౌట్) మ్యాచ్‌ను ముగించాడు. రాణించిన అభిషేక్ ఓపెనర్లు అభిషేక్ శర్మ(74), ట్రావిస్ హెడ్ (38) విధ్వంసక బ్యాటింగ్‌తో విరుచుకుపడినా.. మిడిలార్డర్ తడబాటుతో భారీ స్కోర్ చేయలేక పోయింది.

అభిషేక్, హెడ్ మెరుపులతో 250 అలవోకగా కొట్టేలా కనిపించిన సన్‌రైజర్స్‌ను పంజాబ్ కింగ్స్ పేసర్ శశాంక్ సింగ్(250) దెబ్బకొట్టాడు. ఆఖర్లో హెన్రిచ్ క్లాసెన్(39) దంచేసినా.. మిగతా బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టడంతో హైదరాబాద్‌ను 219కే కట్టడి చేసింది. పంజాబ్ బౌలర్లు ఆర్ష్‌దీప్, శశాంక్ సింగ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ శ్రేయస్ అయ్యర్‌కు దక్కింది.

## ముఖం చాటేసిన కావ్య మారన్!

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్(•ఖీఊ) తమ పరాజయాల పరంపరను కొనసాగిస్తోంది. ఈ టోర్నీలో మూడో పరాజయాన్ని మూటగట్టుకుంది. శనివారం ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 6 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఓడించింది. చెత్త బౌలింగ్, స్లో బ్యాటింగ్.. లాక్ ఆఫ్ ప్లానింగ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ పతనాన్ని శాసించాయి. ముఖ్యంగా బౌలింగ్ విభాగం ప్రదర్శన తీవ్ర నిరాశకు గురి చేసింది. 219 పరుగుల భారీ స్కోర్ చేసినా సన్‌రైజర్స్ హైదరాబాద్ కాపాడుకోలేకపోయింది. కనీసం పంజాబ్ కింగ్స్ బ్యాటర్ల జోరుకు బ్రేకులు వేసేందుకు కూడా ప్రయత్నించలేదు. స్పిన్నర్లు శివాంగ్ కుమార్, హర్ష్ దూబే మినహా అంతా చేతులెత్తేసారు. ప్రతీ ఓవర్‌లో బౌండరీలు, సిక్సర్లు సమర్పించుకున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ పేలవ ప్రదర్శన నేపథ్యంలో ఆ జట్టు ఓనర్ కావ్యమారన్ ముఖం చాటేసినట్లు ప్రచారం జరుగుతోంది. సన్‌రైజర్స్‌కు సంబంధించిన ప్రతీ మ్యాచ్‌కు హాజరయ్యే కావ్య మారన్.. శనివారం పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో కనిపించలేదని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. టీవీ కెమెరామెన్స్ కూడా కావ్య మారన్‌ను సూచించలేదు. తనను చూపించవద్దని బ్రాడ్‌కాస్టర్స్‌ను కావ్య మారన్ కోరినట్లు ఉందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. జట్టు ప్రదర్శన పట్ల కావ్య మారన్ సిగ్గుతో ముఖం చాటేస్తుందని సెర్లు పేల్చుతున్నారు. ఇంత చెత్త బౌలింగ్‌తో టోర్నీలో రాణించడం కష్టమని అభిప్రాయపడుతున్నారు. జట్టు ప్రక్షాళన చేయాల్సిన ఆసన్నమైందని, ముఖ్యంగా సపోర్ట్ స్టాఫ్ మొత్తాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్ సైతం.. తమ బౌలింగ్ టీమ్‌పై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాడు. ఇంత చెత్తగా బౌలింగ్ చేస్తే ఏం చే ... యలేమని అసహనం వ్యక్తం చేశాడు. 'మేం బౌలింగ్‌లో దారుణంగా విఫలమయ్యాం. సరైన లెంగ్త్‌లో బౌలింగ్ చేయలేకపోయాం. టీ20 క్రికెట్‌లో సరైన చోట బంతులు వేయడం చాలా ముఖ్యం. ఈ విషయంలో ఈరోజు మేం వెనకపడ్డాం. వాస్తవానికి 219 స్కోర్ మంచిదే. మరీ ముఖ్యంగా ఆరు ఏడుగురు బౌలర్లు జట్టులో ఉన్నప్పుడు ఈ స్కోర్‌ను కాపాడుకోవచ్చు. కానీ ప్రత్యర్థి బ్యాటర్ల ఆటకు తగ్గట్లు బౌలింగ్ చేయాలి. అలా చేయలేక మూల్యం చెల్లించుకున్నాం. మా బౌలింగ్ ప్రణాళికలు కూడా సరిగ్గా లేవు. మ్యాచ్ మధ్యలో ఏం చేయలేం. మ్యాచ్‌కు ముందే మంచి బౌలింగ్ వ్యూహాలతో బరిలోకి దిగాలి.



## వైభవ్ సూర్యవంశీ సంపాదన

వైభవ్ సూర్యవంశీ. ఇప్పుడు ఈ పేరు ఓ సంచలనం. ఐపీఎల్ వైభవ్ సూర్య వంశీ పేరు కాదు.. ఒక బ్రాండ్. అతి పిన్న వయసులో దిగ్గజాలైన బౌలర్లకు చుక్కలు చూపిస్తున్నాడు.బౌలర్ ఎవరైనా సరే.. బంతిని బౌండరీకి తరలించటమే అతని లక్ష్యం. యావత్ క్రికెట్ ఫ్యాన్స్ ప్రశంసలతో ముంచెత్తున్నారు. ప్రత్యర్థి టీంలకు చెమటలు పట్టిస్తున్న వైభవ్ సూర్య వంశీ ఆదాయ లెక్కలు అంతే సంచలనం. ఈ యువ కెరటం సంపాదన లెక్కలు మరీ ఆసక్తి కరం. వైభవ్ సూర్యవంశీ. గత ఏడాది ఐపీఎల్ తో ఆరంగేట్రం చేసి.. ప్రస్తుత సీజన్ లో సంచలనంగా ఎదిగాడు. వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ కోసం యావత్ క్రికెట్ ఫ్యాన్స్ వేచి చూస్తున్నారు. వణికించే బౌలర్లకు సైతం చుక్కలు చూపిస్తున్నాడు. 15 ఏళ్ల వయసులో ఐపీఎల్ క్రికెట్ లో సంచలనాలు నమోదు చేస్తున్న ఈ కుర్రాడి సంపాదన పైన చర్చ జరుగుతోంది. వచ్చే ఐపీఎల్ ఆక్షనలో వైభవ్ కోసం ఫ్రాంచైజీలు ఎంత పెట్టటానికైనా సిద్ధపడటం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఆర్సీబీ, ముంబాయి ఇండియన్స్ వైభవ్ కోసం పోటీలో ఉన్నట్లు ఇప్పటికే ప్రచారం సాగుతోంది. అయితే, అసలు రాజస్థాన్ వైభవ్ ను వదులుకుంటుందా అనేది సందేహమే. ఎక్కడా గర్వం లేకుండా పూర్తిగా పరిణితి సాధించిన తరహాలో వైభవ్ ఆటతీరు అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఇక, వైభవ్ ఆదాయం పైన ఆసక్తి కర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఐపీఎల్ 2026

> ప్రత్యర్థి టీంలకు చెమటలు పట్టిస్తున్న వైభవ్ సూర్య వంశీ ఆదాయ లెక్కలు అంతే సంచలనం. ఈ యువ కెరటం సంపాదన లెక్కలు మరీ ఆసక్తి కరం. వైభవ్ సూర్యవంశీ. గత ఏడాది ఐపీఎల్ తో ఆరంగేట్రం చేసి.. ప్రస్తుత సీజన్ లో సంచలనంగా ఎదిగాడు.

వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు వైభవ్ సూర్యవంశీని రూ.1.10 కోట్లకు సొంతం చేసుకుంది. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత చిన్న వయస్కుడైన ఆటగాడిగా రికార్డు సృష్టించిన వైభవ్ ఒక్కో మ్యాచ్‌కు రూ. 15 లక్షలకు పైగా ఆదాయం వస్తోంది. లీగ్ దశలోని 14 మ్యాచ్‌లకు వైభవ్ సూర్యవంశీ చేసుకున్న ఒప్పందం మేరకు ఒక్కో మ్యాచ్‌కు సుమారు రూ. 7.85 లక్షల ఆదాయం సమకూరుతుంది. కాగా.. ఐపీఎల్ నిబంధనల ప్రకారం.. ఆడే ప్రతి మ్యాచ్‌కు అదనంగా రూ. 7.50 లక్షల మ్యాచ్ ఫీజు లభిస్తుంది. ఈ రెండు రకాల ఆదాయం కలిపితే, వైభవ్ ఒక్కో మ్యాచ్‌కు సుమారు రూ. 15.35 లక్షలు సంపాదిస్తున్నాడు. అదే విధంగా వీటితో సంబంధం లేకుండా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ లేదా ఇతర అవార్డుల రూపంలో వచ్చే నగదు బహుమతులు అదనం. సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన వైభవ్, తండ్రి సంజీవ్ సూర్యవంశీ ప్రోత్సాహంతో నాలుగేళ్ల ప్రాయంలోనే బ్యాట్ పట్టాడు. భారత క్రికెట్ ను శాసించే స్థాయికి వైభవ్ సూర్యవంశీ ఎదుగుతాడనే అంచనాలు కనిపిస్తున్నాయి.

# అంపైర్‌పై అసభ్య పదజాలం

## నీతీశ్‌కు భారీ జరిమానా

చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో దిల్లీ క్యాపిటల్స్ ఆటగాడు నీతీశ్ రాణాపై భారీ జరిమానా పడింది. ఫోర్త్ అంపైర్‌తో అసభ్య పదజాలం వాడుతూ వాదనకు దిగడంతో ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకుంది. అతడి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించింది. అంతేకాకుండా, ఒక డీమెరిట్ పాయింట్‌ను అతడి ఖాతాకు జతచేసింది. సీఎస్‌కేతో మ్యాచ్‌లో నీతీశ్ రిజర్వ్ బెంచ్‌పై ఉండటం గమనార్హం. తుది జట్టులో లేదా ఇంపాక్ట్ ప్లేయర్‌గానైనా నీతీశ్ మైదానంలోకి దిగలేదు. ఇలా బెంచ్‌పై ఉన్న క్రికెటర్‌కు జరిమానా పడటం చాలా అరుదు. ఇంతకీ అసలు ఏం జరిగిందంటే? సీఎస్‌కే నిర్దేశించిన 213 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన దిల్లీ 189 పరుగులకు ఆలౌంది. ట్రిస్టన్ స్టబ్స్ (60) పోరాడినా ఓటమి తప్పలేదు. అయితే, ఇన్నింగ్స్ 19వ ఓవర్ రెండో బంతిని ఓవర్టన్ వికెట్లకు కాస్త దూరంగా విసిరాడు. దానిని ఫీల్డ్ అంపైర్ వైడ్‌గా ఇచ్చాడు. ఓవర్టన్ వెంటనే రివ్యూ తీసుకున్నాడు. ఈ సమయంలోనే స్టబ్స్ తన గ్లవ్‌ను మార్చుకుంటానని అంపైర్ దృష్టికి తీసుకెళ్లాడు. కానీ, ఫోర్త్ అంపైర్ అందుకు అంగీకరించలేదు. దిల్లీ ప్రధాన కోచ్ హేమంగ్ బదానీ వచ్చి ఫోర్త్ అంపైర్‌తో మాట్లాడాడు. ఇక సక్షలో ఆ బంతి సరైందిగా వచ్చింది. తర్వాత బంతిని షాట్ కోసం యత్నించిన స్టబ్స్ మిడాఫ్‌లో నూర్ అహ్మద్‌కు దొరికిపోయాడు. అప్పటికే తీవ్ర అసహనంతో ఉన్న అతడు ఔన తర్వాత డ్రెస్సింగ్‌రూమ్‌లోకి వెళ్లి తన హెల్మెట్‌ను విసిరికొట్టాడు. దీనిపైనా స్టబ్స్‌కు జరిమానా పడే అవకాశం లేకపోలేదు.
ఇదంతా ఇలా జరిగితే.. మరోవైపు బెంచ్‌పై ఉన్న నీతీశ్ రాణా కూడా ఇదే విషయంపై ఫోర్త్ అంపైర్‌తో తీవ్ర స్థాయిలో వాగ్వాదానికి దిగాడు. కాస్త కఠినమైన పదజాలంతో గొడవ పడినట్లు రిఫరీ నిర్ణయం మేరకు నీతీశ్ రాణాకు భారీ జరిమానా పడింది.



# అరుదైన జాబితాలో ఆయుశ్ మాత్రే!



ఐపీఎల్ 19వ సీజన్‌లో భాగంగా శనివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ ఆటగాడు ఆయుశ్ మాత్రే రిర్డ్ ఔట్‌గా వెనుదిరిగిన సంగతి తెలిసిందే. అయితే ఆయుశ్ రిర్డ్ ఔట్ వెనుక సీఎస్‌కే మేనేజ్‌మెంట్ హస్తం ఉంది. మంచి ఈజ్‌తో బ్యాటింగ్ చేస్తున్న ఆయుశ్ మాత్రేను అర్థంతరంగా రిర్డ్ ఔట్‌గా వెళ్లిపోవడం వెనుక విమర్శలు వచ్చాయి.కానీ సీఎస్‌కే నిర్ణయం సరైనదే అని కాసేపటికే తెలిసొచ్చింది. ఆయుశ్ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన హార్డ్ హిట్టర్ శివమ్ దూబే తన పాత్రకు న్యాయం చేస్తూ వేగంగా పరుగులు రాబట్టాడు. ఫలితంగా సీఎస్‌కే భారీ స్కోరు సాధించింది. ఆయుశ్ మాత్రే రిర్డ్ ఔట్ వెనుక కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ పాత్ర కీలకం. అందుకే మాత్రే పెవిలియన్ చేరుకున్న సమయంలో అతడికి స్టాండింగ్ ఒవేషన్ లభించింది. ఈ నేపథ్యంలో ఆయుశ్ మాత్రే ఒక అరుదైన జాబితాలో చేరిపోయాడు. ఐపీఎల్‌లో రిర్డ్ ఔట్‌లు చాలా తక్కువగా జరుగుతుంటాయి. గతంలో రవిచంద్రన్ అశ్విన్, సాయి సుదర్శన్, తిలక్ వర్మ, డెవాన్ కాన్వే వంటి క్రికెటర్లు రిర్డ్ ఔట్‌గా వెనుదిరిగారు. తాజాగా ఈ జాబితాలో ఆయుశ్ మాత్రే కూడా చేరిపోయాడు. కాగా ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆయుశ్ మాత్రేదే తొలి రిర్డ్ ఔట్. సాధారణంగా క్రికెట్‌లో రిర్డ్ హర్ట్, రిర్డ్ ఔట్ వేర్వేరు. రిర్డ్ హర్ట్' అంటే గాయం కారణంగా ఆటగాడు మైదానం విడిచిపెట్టడం. అదే రిర్డ్ ఔట్ అనేది జట్టు ప్రయోజనాల కోసం స్వచ్ఛందంగా మైదానం విడిచిపెట్టడం. రిర్డ్ హర్ట్ అయితే సదరు మ్యాచ్‌లో మళ్లీ మైదానంలోకి వచ్చేందుకు అవకాశం ఉంటుంది. రిర్డ్ ఔట్ అలా కాదు. ఒక్కసారి రిర్డ్ ఔట్‌గా వెనుదిరిగితే మళ్లీ క్రీజులోకి వచ్చేందుకు అవకాశం ఉండదు. మ్యాచ్ విషయానికొస్తే తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. శాంసన్ సెంచరీ, శివమ్ దూబే అజేయ అర్థసెంచరీతో రాణించారు.

# వుదయం సినిమా MOVIE TIME!

## మంగ్లీ కేసుతో నాకు ఎలాంటి సంబంధం లేదు



**వుదయం సినిమా:** ఆర్థిక మోసం ఘటనలో గాయని మంగ్లీపై నమోదైన కేసులో దర్శకుడు వేణు ఊడుగుల కూడా ఉన్నారంటూ కొన్ని మీడియా సంస్థలు ప్రచారం చేశాయి. ఈ అసత్య వార్తలపై వివరణ ఇచ్చారు దర్శకుడు వేణు ఊడుగుల. మంగ్లీ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదంటూ ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు దర్శకుడు వేణు ఊడుగుల ప్రెస్ నోట్ రిలీజ్ చేశారు. వేణు ఊడుగుల స్పందిస్తూ గాయని మంగ్లీ కేసులో నా పేరును చేర్చుతూ కొన్ని మీడియా సంస్థలు ప్రచారం చేస్తున్న వార్తలు చూసి బాధపడ్డాను. మంగ్లీ, లాయర్ సుబ్బారావు ఇద్దరూ నాకు తెలిసిన వాళ్లు కావడంతో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి, బాధితులకు న్యాయం చేయాలని సూచించాను. ఇంతవరకే ఈ కేసులో నా పాత్ర. ఈ కేసు ఎఫ్ఐఆర్ లో కూడా నిందితుడిగా నా పేరు ఎక్కడా ప్రస్తావించలేదు. అడ్వకేట్ సుబ్బారావు ఈ రోజు మీడియాతో మాట్లాడుతూ వేణు ఊడుగులకు ఈ కేసుతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టంగా చెప్పారు. పంజాగుట్ట పోలీసులు కూడా ఈ కేసుతో నాకు సంబంధం లేదని నిర్ధారించారు.





## విజయ్, రశ్మికకు వెల్‌కమ్

**వుదయం సినిమా:** విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో టీ సిరీస్ సమర్పణలో ప్రెస్టీజియస్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న క్రేజీ మూవీ "రణబాలి". ఈ సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. "రణబాలి" సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ కు రాబోతోంది. ఇటీవలే విజయ్, రశ్మిక వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. తాజాగా ఈ కొత్త జంట "రణబాలి" సెట్ లోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా విజయ్, రశ్మికకు చిత్ర యూనిట్ వెల్ కమ్ చెబుతూ సెలబ్రేషన్స్ జరిపారు. కేక్ కట్ చేయించి, హ్యాపీ మ్యారీడ్ లైఫ్ మిస్టర్ అండ్ మిసెస్ రణబాలి అంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సినిమాలో రణబాలి అనే యోధుడి పాత్రలో విజయ్ దేవరకొండ, జయమ్మగా రశ్మిక మందన్న ప్రేక్షకుల్ని ఆకట్టుకోనున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా "రణబాలి" సినిమా రూపొందుతోంది.

## గాడ్స్ అండ్ సోల్జర్స్ ట్రైసర్ విడుదల





**వుదయం సినిమా :** రఫ్ నోట్ ప్రొడక్షన్ సంస్థ నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక తమిళ-తెలుగు ద్విభాషా చిత్రం 'గాడ్స్ అండ్ సోల్జర్స్'. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణనంతర పనులను శరవేగంగా జరుపుకుంటోంది. ప్రముఖ దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం కమర్షియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఇప్పటికే ప్రిరీలీజ్ బజ్ తెచ్చుకుంది. కాగా ఈ చిత్రం ట్రైజర్ పేరుతో ఓ వీడియోను విడుదల చేసింది. ఈ ట్రైసర్‌ను ప్రముఖ సంచలన దర్శకుడు హరీష్ శంకర్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా విడుదల చేశారు. మాస్ అండ్ ఎమోషన్స్, యాక్షన్ అంశాలతో ఈ ట్రైసర్ అందర్నీ ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా దర్శకుడు విజయ్ మెల్టన్ మాట్లాడుతూ " మా ట్రైసర్‌ను విడుదల చేసి మాకు ప్రోత్సాహం అందించిన దర్శకుడు హరీష్ శంకర్‌కు ధన్యవాదాలు. భారీ స్థాయిలో, భావోద్వేగాల నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం, వాస్తవిక కథనంతో పాటు వాణిజ్య అంశాలను మేళవించిన సినిమాటిక్ అనుభూతిని ప్రేక్షకులకు అందించనుంది. ఈ చిత్రంలో మంచి టాలెంటెడ్ నటీనటులు సరికొత్త అవతారంలో కనిపంచబోతున్నారు. ఆరి అరుజునన్ తొలిసారి పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. రాజ్ తరుణ్ ఈ చిత్రంతో తమిళంలో అడుగుపెడుతున్నారు. భరత్ కీలక భావోద్వేగ పాత్రలో నటిస్తున్నారు. అమూ అభిరామి, కిశోర్ ప్రాధాన్యత ఉన్న పాత్రల్లో కనిపించనున్నారు. సినిమా కోసం అందరూ శారీరకంగా, భావోద్వేగంగా కష్టపడ్డారు. ఇక ప్రత్యేక ఆకర్షణగా స్వతంత్ర సంగీత కళాకారుడు వేధన్ కూడా ఒక ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. తన ప్రత్యేక గాత్రం, సామాజిక అంశాలపై ఆధారిత గీతాలతో యువతలో గుర్తింపు పొందిన వేధన్ పాల్గొనడం ద్వారా చిత్రానికి సాంస్కృతిక, సంగీత పరమైన ప్రత్యేకత కలగనుంది. విభిన్న ప్రదేశాల్లో విస్తృతంగా షూటింగ్ జరుపుకుంది. ప్రస్తుతం చిత్రబృందం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో నిమగ్నమైంది. రఫ్ నోట్ ప్రొడక్షన్ నిర్మిస్తున్న ఈ చిత్రం యాక్షన్, భావోద్వేగం, సామాజిక అంశాల సమ్మేళనంగా తమిళ, తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందుతోంది' అన్నారు.

## కోటికి పైగా వ్యూస్‌తో దూసుకెళ్తున్న చెన్నై లవ్ స్టోరీ గురుతుందా..



**వుదయం సినిమా:** హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా "కలర్ ఫోటో", "బేబి" వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో రూపొందుతున్న "చెన్నై లవ్ స్టోరీ" సినిమాకు బిజినెస్ పరంగా మంచి క్రేజ్ ఏర్పడుతోంది. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ "చెన్నై లవ్ స్టోరీ" సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ సింగిల్ తోనే మ్యూజికల్ బ్లాక్ బస్టర్ జర్నీ స్టార్ట్ చేసింది. ఈ సినిమా నుంచి రీసెంట్ గా రిలీజ్ చేసిన 'గురుతుందా...' పాట మ్యూజిక్ లవర్స్ ను మెస్మరైజ్ చేస్తోంది. ఈ పాట రిలీజైన 10 రోజుల్లోనే 10 మిలియన్ ప్లస్ వ్యూస్ సాధించడం విశేషం. 'గురుతుందా...' పాటలోని తొలి ప్రేమం తోపు కాదే తోపు కాదే అమ్మడూ, నీ లైఫ్ నీ ఆపలేదే ఆపలేదే ఎన్నడూ అనే హుక్ లైన్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మెలోడీ బ్రహ్మ మణిశర్మ ప్లెజెంట్ కంపోజిషన్, అనంత శ్రీరామ్ అందమైన సాహిత్యం, హరిచరణ్, శృతిక సముద్రాల ఎక్స్ ప్రెసివ్ గా పాడిన విధానం మ్యూజిక్ లవర్స్ ను బాగా ఆకట్టుకుంటోంది.

## క్వీన్ పోస్టర్ రిలీజ్



**వుదయం సినిమా:** ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ యామినీ ఈఆర్ ను హీరోయిన్ గా పరిచయం చేస్తూ టాలెంటెడ్ యంగ్ డైరెక్టర్ రతన్ రిషి హీరోయిన్ సెంట్రిక్ కథతో "క్వీన్" మూవీని రూపొందిస్తున్నారు. ఈ సినిమాను వన్ సర్కిల్ ఫిలింస్ బ్యానర్ నిర్మిస్తోంది. ఈ చిత్రంలో కాళకేయ ప్రభాకర్, అజయ్ ఘోష్ విలన్స్ గా నటిస్తున్నారు. ఈ మూవీలో ఎంతో స్పెషల్ గా, ఇంట్రెస్టింగ్ గా ఉండే హీరోయిన్ తండ్రి పాత్రలో 90's హీరోల్లో ఒకరు నటించబోతున్నారు. ఈ రోజు హీరోయిన్ యామినీ ఈఆర్ పుట్టినరోజు సందర్భంగా ఆమెకు బర్త్ డే విశెస్ చెబుతూ "క్వీన్" మూవీ నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో క్లాసికల్ డాన్సర్ గెటప్ లో అందంగా ముస్తాభైన యామిని, ఆనందభాష్పాలతో కనిపించి ఆకట్టుకుంటోంది. ప్రస్తుత సొసైటీ తో ముడిపడి ఉన్న ఒక ఇంట్రెస్టింగ్ లవ్ స్టోరీని ఈ చిత్రంలో తెరకెక్కిస్తున్నారు దర్శకుడు రతన్ రిషి. తను ప్రేమించిన వ్యక్తి కలను నిజం చేస్తూ... అతని కలకు చట్టబద్ధమైన గుర్తింపు తీసుకొచ్చేందుకు ఒక అమ్మాయి ఎలాంటి పోరాటం చేసింది అనేది ఈ చిత్రంలో ఆద్యంతం ఆసక్తిని కలిగించనుంది. "క్వీన్" సినిమా ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది.


## డెకాయిట్ సమ్మర్ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ : నాగ్ అశ్విన్



హిట్ మిషన్ అడివి శేష్ లేటెస్ట్ ఆడియన్స్ బ్లాక్ బస్టర్ 'డెకాయిట్. శేష్ సరసన మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటించారు. షానియల్ డియో దర్శకత్వం వహించారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో ఈ చిత్రాన్ని సుప్రియ యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరించారు. ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన రెస్పాన్స్ తో విమర్శకులు, ప్రేక్షకుల ప్రశంసలు అందుకొని సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ వేడుకలో డైరెక్టర్ నాగ్ అశ్విన్, నిర్మాతలు అల్లు అరవింద్, బన్నీవాసు, స్వప్నదత్, నందిని రెడ్డి పాల్గొన్నారు. డైరెక్టర్ నాగ్ అశ్విన్ మాట్లాడుతూ.. అందరికీ హాయ్. సినిమా తీయడం రాయడం అంత ఈజీ కాదు. అలాగే రిలీజ్ కూడా. ఒక సినిమాకి రెండు మూడేళ్లు పడుతుంది. ఆ సమయంలో అసలు ఎందుకు చేస్తున్నామనే ఆలోచనలు కూడా వస్తాయి. మనందరి ప్రయత్నం కూడా ఒక మంచి సినిమా తీయాలని. ఈ జర్నీలో వాళ్ళందరి ఎక్స్పీరియన్స్ లు వింటుంటే చాలా ఫ్యాషన్ తో ఈ సినిమా తీశారు అనిపిస్తుంది. ప్రేమతోనే సినిమా చేస్తాం. ఆ ప్రేమ తోనే సినిమాకి ప్రాణం వస్తుంది. డెకాయిట్ చూసి ఆడియన్స్ చాలా ఎమోషనల్ ఫీల్ అవుతున్నారు. సుప్రియ గారు నా సీనియర్. వారు ఇంత మంచి సినిమాని నిర్మించడం చాలా ఆనందంగా ఉంది. శేష్ సినిమా వస్తుంటే చాలా నేర్చుకోవచ్చు. రైటింగ్ ఎడిటింగ్ స్క్రీన్ ప్లే అని చాలా కొత్తగా ఉంటాయి. సినిమాని హిట్ అయ్యేవరకు తీస్తారు. అది ఆయన పాషన్. టీమ్ అందరికీ బిగ్ కంగ్రాజులేషన్స్. డెకాయిట్ సమ్మర్ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్.



## చింతామణి సొంతకథ ప్రారంభం



**వుదయం సినిమా:** శ్రీరామ్, మహిమా గుప్త హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "చింతామణి సొంతకథ". ఈ చిత్రాన్ని దర్శకుడు ప్రేమ్ రాజ్ రూపొందిస్తున్నారు. మిత్రా మూవీ మేకర్స్ బి.రాజీవ్ కుమార్, రాకేష్ కర్రె, డా. ఎన్ వీ రావు, శ్రీనివాస్ పసుపులేటి నిర్మిస్తున్నారు. ఈ రోజు హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ఈ సినిమా ప్రారంభోత్సవం పూజా కార్యక్రమాలతో ఘనంగా జరిగింది. ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ డా. అద్దంకి దయాకర్, తెలంగాణ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

## కర్మస్థలం పోస్టర్ విడుదల



**వుదయం సినిమా :** రాయ్ ఫిల్మ్స్ సమర్పణలో అరవింద్ కృష్ణ, చుంకీ పాండే, అర్చనా శాస్త్రి, ప్రిన్స్, దివి ప్రధాన పాత్రల్లో రాకీ షెర్మాన్ తెరకెక్కిస్తున్న చిత్రం 'కర్మస్థలం'. ఈ మూవీని రాయ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కి సాయి కార్తిక్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమాని తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక తాజాగా ఈ సినిమా నుంచి అరవింద్ కృష్ణ పాత్రకు సంబంధించిన లుక్‌ను విడుదల చేశారు. అరవింద్ కృష్ణ ప్రస్తుతం సూపర్ హీరో పాత్రలతో ఆడియెన్స్‌ను ఆకట్టునేందుకు రెడీ అవుతన్నారు. ఇలాంటి టైంలో ఓ యోధుడిలా 'కర్మస్థలం'లో కనిపించబోతోన్నారు. విజువల్స్, బీజీఎం ఈ సినిమాను అదనపు ఆకర్షణ అయ్యేలా ఉంది.

## కూకట్‌పల్లిలో మర్రి గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం ప్రారంభం

### 365 రోజులూ అతితక్కువ తరుగు ఆఫర్‌తో వినియోగదారులకు సరికొత్త స్వర్ణ సౌలభ్యం



భాగ్యనగర పసిడి ప్రియుల చిరకాల వాంఛ నెరవేరుస్తూ, కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ సమీపంలో 'మర్రి గోల్డ్ అండ్ డైమండ్స్' మెగా షోరూం ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. జంట నగరాల్లోనే అతిపెద్దదిగా, నాలుగు అంతస్తుల విశాలమైన భవనంలో అంతర్జాతీయ హంగులతో తీర్చిదిద్దిన ఈ షోరూంను ప్రముఖ సినీ నటుడు, విక్టరీ వెంకటేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.

**విక్టరీ వెంకటేష్ ప్రశంసలు:**
షోరూంలోని అద్భుతమైన కలెక్షన్లను తిలకించిన వెంకటేష్ మాట్లాడుతూ, "హైదరాబాద్ ప్రజలకు వేలాది సరికొత్త డిజైన్లను ఒకే చోట అందించడం అభినందనీయం. ముఖ్యంగా సామాన్యులకు భారం కాకుండా సంవత్సరం పొడవునా అతితక్కువ తరుగు ధరలకే బంగారం అందించాలనే యాజమాన్యం ఆలోచన చాలా గొప్పది," అని కొనియాడారు.

**షోరూం ప్రత్యేక ఆఫర్లు & వివరాలు:**

**1. బంగారం ఆభరణాలపై ప్రత్యేక ఆఫర్స్ :**
★ తరుగు: కేవలం 1% నుండి 11% వరకు మాత్రమే. ఈ ప్రత్యేక ఆఫర్ కేవలం పండుగలకు మాత్రమే పరిమితం కాకుండా, సంవత్సరంలో 365 రోజులూ వినియోగదారులకు అందుబాటులో ఉంటుంది.
★ అక్షయ తృతీయ స్పెషల్: ప్రస్తుతం ప్రారంభోత్సవం మరియు అక్షయ తృతీయ సందర్భంగా పైన పేర్కొన్న తరుగు పై అదనంగా 25% తగ్గింపు లభిస్తుంది.
★ మేకింగ్ ఛార్జీలు: ఆభరణాల తయారీ ఖర్చులు పూర్తిగా రద్దు (సున్నా).
★ నాణ్యత: ప్రతి ఆభరణం బిఐఎస్ 916 హాల్‌మార్క్ ముద్రతో లభిస్తుంది.

**2. వెండిపై భారీ ధమాకా :**
★ వెండి వస్తువులపై ఎటువంటి తరుగు లేదు.
★ మేకింగ్ ఛార్జీలు మరియు జిఎస్ టి పూర్తిగా రద్దు చేయబడ్డాయి.
★ 1 కేజీ పైన వెండి కొనుగోలుపై ఏకంగా ₹20,000/ వరకు నగదు తగ్గింపు పొందవచ్చు.

**3. డైమండ్స్ ప్రత్యేక ధర:**
★ అత్యున్నత నాణ్యత కలిగిన డైమండ్స్ క్యారెట్ కేవలం ₹49,900/ లకే లభ్యం.

వినియోగదారుల కోసం వినూత్న పథకాలు:
★ రేటు ప్రొటెక్షన్ స్కీమ్: 6 నెలల కాల పరిమితి గల ఈ పథకంలో, బుక్ చేసిన రోజు లేదా డెలివరీ తీసుకునే రోజు... ఏ రోజు ధర తక్కువగా ఉంటే ఆ ధరకే బంగారం పొందవచ్చు.
★ గోల్డ్ సేవింగ్ స్కీమ్ (10 నెలలు): నెలకు కొంత మొత్తం పొదుపు చేయడం ద్వారా, 10 నెలల తర్వాత ఎటువంటి తరుగు చార్జీలు లేకుండా ఆభరణాలను కొనుగోలు చేయవచ్చు.

## ఆ జ్ఞాపకాలు ఎప్పటికీ మర్చిపోలేను

**వుదయం సినిమా:** టాలీవుడ్‌లో అతి తక్కువ సమయంలోనే తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి ప్రియాంక అరుళ్ మోహన్. నాని 'గ్యాంగ్ లీడర్' సినిమాతో వెండితెరకు పరిచయమైన ఈ సుందరి, అటు అందంతోనూ, ఇటు అభినయంతోనూ తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకుంది. రీసెంట్‌గా ఆమె నటించిన 'మేడ్ ఇన్ కోరియా' ఓటీటీలో భారీ విజయాన్ని సాధించడంతో ఆమె పేరు మారుమోగిపోతోంది. ఈ నేపథ్యంలో ప్రియాంక తన మనసులోని మాటలను ఒక ఇంటర్వ్యూ ద్వారా పంచుకున్నారు. ప్రియాంక తన విద్యాభ్యాసం గురించి చెబుతూ.. తాను బయో టెక్నాలజీలో డిగ్రీ చేశానని తెలిపారు. అయితే చదువుకుంటున్న సమయంలో కూడా తన మనసంతా సినిమాలపైనే ఉండేదని, తెరపై నటిగా కనిపించాలన్నదే తన ఏకైక లక్ష్యమని చెప్పారు. చదువు పూర్తవ్వగానే తన కలను నిజం చేసుకునే క్రమంలో 'ఒంధ్ కథే హెళ్లా' అనే కన్నడ సినిమాతో నటనలో అడుగు పెట్టారు. నాని, శర్వానంద్ వంటి హీరోలతో పనిచేయడం ద్వారా తాను నటిగా ఎంతో నేర్చుకున్నానని ప్రియాంక వెల్లడించారు. ముఖ్యంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌తో కలిసి 'ఓజీ' సినిమాలో నటించిన క్షణాలు తన జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని మధుర జ్ఞాపకాలని ఆమె ఎమోషనల్ అయ్యారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.